శ్రీ జ్ఞానేశ్వర్ మహారాజ్ జీవిత చరిత్ర

చరణ్ జనమంచి

శ్రీ జ్ఞానేశ్వర్ మహారాజ్

జీవితచరిత్ర

రచన

చరణ్ జనమంచి

శ్రీ జ్ఞానేశ్వర్ మహారాజ్ జీవిత చరిత్ర

రచన : **చరణ్ జనమంచి**

ప్రథమ ముద్రణ : జూన్, 2012

ప్రతులు : 1000

మూల్యము : రూ. **100/-**

హక్కులు : ప్రచురణకర్తలవి

ప్రతులకోసం : **శ్రీసాయిదర్శన్**
దమ్మాయిగూడ, హైద్రాబాద్ - 500 083
సెల్ : 9177788099, 9393930525

కవర్ డిజైన్ : కె.లక్ష్మణ్ నాయుడు

డి.టి.పి : కె. సుధాకర్
శ్రీసాయిరాం గ్రాఫిక్స్,హైద్రాబాద్.
ఫోన్ :040-27091973//9959183167

ముద్రణ : కర్షక్ ప్రింటర్స్, హైద్రాబాద్

రచయిత మాట

యావత్ జగత్తును పాలించే బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు, అవతారపురుషులుగా భూమండలం మీద అవతరించి చేసిన ప్రతి పని సాధారణ మనిషి జీవితంలో అద్భుతాలుగా చెప్పవచ్చు. వారు పలికిన ప్రతి పలుకులు, నడవడిక, చూపిన మార్గం ఎందరికో మోక్షప్రాప్తిని కలిగించింది. కనిపించడానికి చిన్న పిల్లలుగా ఉన్న, వారికి ఈ భూమండలం మీద, అన్నింటి మీద జ్ఞానం ఉంది. మానవరూపంలో ఉన్నారు కాబట్టి వారు కొన్ని హద్దులు ఏర్పరుచుకుని ధర్మస్థాపనకై ప్రజలలో చైతన్యం తెచ్చారు.

వీరు ప్రదర్శించిన లీలలు తరతరాలుగా ఇంకా ప్రజలు చెప్పుకుంటున్నారంటే వారి గొప్పతనం ఏలాంటిదో పాఠకులు గ్రహించగలరు.

స్వయంగా త్రిమూర్తులే మానవరూపం దాల్చి, మానవజీవితాన్ని సాఫల్యం చేసి, అజ్ఞానపు పొరలనుంచి జ్ఞానపు వెలుగు చూపిన మంగళకారుల గూర్చి తెలుపునదే ఈ పుస్తకం.

ప్రజల మూర్ఖత్వాన్ని వారికే తెలియజేయడానికై వారు దున్నపోతుతో వేదాలు చదివించారు. పితృదేవతలను భూమి మీద

ప్రత్యక్షపరచారు. ఇలాఎన్నో లీలలు చేశారు. అంతేకాక ప్రజల్లో చైతన్యం తేవడం కోసం శ్రీ జ్ఞానేశ్వర్ మహారాజ్ 'జ్ఞానేశ్వరి' అను గ్రంధం వ్రాసి ప్రజలను ఉద్ధరింపచేసారు.

అలాంటి మహనీయుని చరిత్ర వ్రాసే అదృష్టం నాకు దక్కటం, నా పూర్వజన్మ సుకృతమే తప్ప, నా గొప్పతనం ఏమీ లేదు, నాకు అంత జ్ఞానంలేదు.

నాచే ఏమైనా తప్పులు జరిగివుంటే పెద్ద మనసు చేసుకొని, ఈ అధ్యాత్మిక రచనను చదివి నన్ను కృతార్ధుడను చేయమని మనవి.

మీ

చరణ్ జనమంచి

అంకితం

పవిత్ర మనస్సుతో
ఫలాపేక్ష ఆశించక
మంగళకరమైన
మందిరాలు, మఠాలు, పీఠాలు...
భారతదేశ నలుమూలలా
నిర్మించి, ఇంకా నిర్మిస్తూ
భారతీయ సంస్కృతిని కాపాడుతూ
భక్తి భావాన్ని ప్రజల్లోకి తీసుకెళ్తున్న
విశిష్టవ్యక్తి
శ్రీ గరిమెళ్ళ వెంకటరమణశాస్త్రి గారికి

కృతజ్ఞతలు

ఈశ్వరకృప లేక చీమైనా కాలు కదపలేదంటారే !
మరి ఈ పుస్తకాన్ని నేను రాయటమేమిటి?
పరమేశ్వరుడే శ్రీసాయిబాబా రూపంగా నన్ను ఓ సాధనంగా
చేసుకొని నాచే ఆధ్యాత్మిక గ్రంధాలు రచింపచేస్తున్నారు.
అలాంటి నిత్యమంగళకారకుడైన నా తండ్రి
శ్రీసాయినాథమహారాజ్‌కు శిరస్సాభివందనాలు.
నా తల్లితండ్రుల పుణ్యఫలితములే ఈ రోజు నేను ఏమి
సాధించినా !
అలాంటి నాకు జన్మను ప్రసాదించిన నా మాతాపితురులకు
పాదాభివందనములు.
డి.టి.పి.నే కాక, ఆధ్యాత్మిక సలహాలతో ఈ పుస్తకాన్ని
తీర్చిదిద్దిన విశిష్టవ్యక్తి కె.సుధాకర్‌గారికి మనస్ఫూర్తిగా
వందనాలు.
చివరిగా పాఠకదేవుళ్ళకు కృతజ్ఞతలు తెలుపుతూ,
ఈ మహత్తరమైన పుస్తకాన్ని మీ ముందుకు తెస్తూ.....

మీ
చరణ్ జనమంచి

విషయసూచిక

1. శ్రీ జ్ఞానేశ్వర్ మహారాజ్ పూర్వీకుల చరిత్ర....................1

2. శ్రీ జ్ఞానేశ్వర్ మహారాజ్ తల్లితండ్రులు....................3

శ్రీ విఠోభా ఆకాంక్ష మరియు తీర్థయాత్ర....................3

శ్రీ విఠోభా - రుక్మాబాయిల వాదన....................8

శ్రీ విఠోభా- రుక్మాబాయిల వివాహము....................12

శ్రీ విఠోభా తల్లిదండ్రులవద్దకు వెళ్ళుట....................14

శ్రీ విఠోభా సన్యాసము స్వీకరించుట....................20

శ్రీ పాదస్వామి అలకావతికి వచ్చుట....................25

శ్రీ విఠోభా గృహస్థాశ్రమ స్వీకారము....................29

శ్రీ విఠోభా రుక్మాబాయి అడవికి ప్రయాణము....................34

3. శ్రీ జ్ఞానేశ్వర్ మహారాజ్ జననం....................37

4. శ్రీ జ్ఞానేశ్వర్ మహారాజ్ చిన్నతనం....................43

5. శ్రీ జ్ఞానేశ్వర్ మహారాజ్ బ్రాహ్మణుల గర్వమణచుట....................52

6. శ్రీ జ్ఞానేశ్వర్ మహారాజ్ - విఠోభాల మధ్య వాదన....................63

7. శ్రీ జ్ఞానేశ్వర్ మహారాజ్ లీలలు....................79

దున్నపోతుచే వేదమును చెప్పించుట....................79

శ్రాద్ధమును నెరవేర్చి బ్రాహ్మణులను రక్షించుట....................86

చాంగదేవుడు జ్ఞానదేవుని చూడవచ్చుట....................92

విసోబా మూర్ఖత్వము - శ్రీ జ్ఞానదేవుడు నేర్పినగుణపాఠము....................113

8. శ్రీ జ్ఞానేశ్వర్ మహారాజ్ రచనలు..118

9. శ్రీ జ్ఞానేశ్వర్ మహారాజ్ మహాసమాధి...124

10.శ్రీజ్ఞానేశ్వర్ మహారాజ్ సమాధి అనంతరం...129

11.ఆళంది చేరు మార్గము...132

12. ఉపకరించిన పుస్తకాలు..133

1. శ్రీజ్ఞానేశ్వర్ మహారాజ్ పూర్వీకుల చరిత్ర

గంగానదీ తీరమున ఒక గ్రామము కలదు. ఆ గ్రామమున గోవింద పండితుడను ఒక సత్పురుషుడు నివసించు చుండెను. అతడు గ్రామకరణముగా పనిచేయుచు జీవితమున ఎట్టి యిబ్బంది లేక సుఖముగా కాలము గడుపుచుండెను. అతిథులను చక్కగా ఆదరించుచు అన్నప్రదాతయన్న కీర్తి సంపాదించెను. అతని భార్య నిరూబాయి అతి సౌందర్యవతి, సద్గుణరాశి. సంసారభారమును చక్కగా నిర్వహించుచు భర్తకు అనుకూలవతియై ఉండెను. వారిరువురు ఆ గ్రామమునందున్న గైనీనాథ సత్పురుషుని ఆశ్రయించి తత్త్వోపదేశమును పొంది నిరంతరము సజ్జన సాంగత్యమును, తత్త్వ విద్యా రహస్యమును విచారించుచు సంతసించుచుండిరి.

ఒకనాడు గైనీనాథులవారు వారి ఇంటికి వచ్చి, వారి సుగుణ సంపదను మెచ్చి, సంతానము లేకుండుటకు విచారపడి, వారిని తన సమీపమున కూర్చుండపెట్టుకొని, "పుణ్యాత్ములారా ! అపుత్రస్య గతిర్నాస్తి అను స్మృతివచనమును మీరు వినియుందురు. ఎంత భాగ్యమున్నను సంతానము లేకున్న సుఖముండదు. పుత్రులు లేనివారికి పుణ్యలోకములు సిద్ధింపవనియు, సంతాన రహితమగు గృహము శూన్యమనియు శాస్త్రములు తెలుపుచున్నవి. కుమారుని కౌగిలించుట వలన కలుగు ఆనందమంత యింత కాదు. మీరు పండరిపురమునకు వెళ్ళి పాండురంగమూర్తిని దర్శించినచో సుపుత్రుడు కలుగును" అని చెప్పెను.

మరునాడు ఆ దంపతులు గురు ఆజ్ఞానుసారము పండరిపురమునకు ప్రయాణమై, కొన్నిదినములకు పండరీపురం చేరి, చంద్రభాగనదిలో స్నానముచేసి, పాండురంగని దర్శించి, అక్కడ మూడు దినములుండిరి. మూడవ నాటి రాత్రి తెల్లవారుఝామున గోవిందపంతునకు స్వప్నమునందు పుండరీక వరదుడు బ్రాహ్మణ రూపమున కనబడి, "సుపుత్రుడు కలుగు"నని పలికి, ఒక దివ్యఫలమును చేతియందుంచి అదృశ్యుడయ్యెను. గోవిందపంతు వెంటనే మేల్కొని తాను కన్న కలను తలచుకుంటూ పరమానందముచే ఆ సంగతిని నిరూబాయికి తెలిపెను. భగవత్ప్రీతిగా సమారాధనలు, సంతర్పణలు, దానధర్మములు చేసి అక్కడి నుండి బయలుదేరి వారు కొన్ని దినములకు తమ గ్రామము చేరిరి.

రుక్మాబాయి సహిత శ్రీ పాండురంగమూర్తి

2. శ్రీజ్ఞానేశ్వర్ మహారాజ్ తల్లితండ్రులు

భగవానుని అపారకరుణచే నిరూబాయి గర్భము ధరించి నవ మాసములు నిండిన పిదప ఒక శుభలగ్నమున ఒక కుమారుని కనెను. గోవిందపంతు భాగవతులకును, పేదసాదలకును దానధర్మము లాచరించి, జాతకర్మము జరిపించెను. పాండురంగమూర్తి అనుగ్రహమున జన్మించుటచే ఆ బాలునకు విఠోభాయని పేరుపెట్టెను. ఆ బాలుడు దిన దిన ప్రవర్ధన మానుడై తల్లిదండ్రులకు ఆనందము కలిగించుచుండెను.

గోవిందపంతు తన కుమారునకు యుక్తకాలమున ఉపనయనం చేసి వేదశాస్త్ర పురాణాది విద్యల నన్నీ చక్కగా చదివించెను. తన కుమారునకు చిన్న వయస్సుననే పెండ్లి చేయవలెనని ప్రయత్నించు చుండెను.

శ్రీ విఠోభా ఆకాంక్ష మరియు తీర్థయాత్ర

విఠోభాకు ఆ విషయము తెలిసి తండ్రి వద్దకు వచ్చి “తండ్రీ ! మీరిప్పుడే నాకు వివాహము చేయ ప్రయత్నించుచున్నారు. కాని నాకు చాల దినముల నుండియు తీర్థయాత్ర చేయవలెనను కోరిక కలదు. సెలవిచ్చినచో తీర్థయాత్ర చేసికొనివచ్చి వివాహము చేసుకొందు” నని పలికెను. గోవిందపంతు చింతాక్రాంతుడై యింత చిన్న వయసులో తీర్థయాత్ర పనికిరాదనియు, చతురాశ్రములలో గృహస్థ్యమే ప్రశస్తము గనుక ఆ ప్రయత్నమును మానుమనియు తెలిపెను.

అందుకు విఠోభా సంసారసాగరము అందలి దుఃఖములెల్ల వివరించి, అంత చిన్న వయస్సులో భార్య అను బండరాయి భారమగుననియు, తీర్థయాత్ర ముగించి వచ్చిన వెంటనే వివాహ చేసుకుంటానని తెలిపెను. గోవిందపంతు విధిలేక సమ్మతించి ఒక సంవత్సరం లోపల తీర్థయాత్ర ముగించి తిరిగి రమ్మని కొడుకుతో బాధతో మాట్లాడెను.

విఠోభా తల్లిదండ్రుల ఆశీస్సులు తీసుకొని, మెల్లగా బయలుదేరి హరినామస్మరణ చేయుచు, భగద్విలాసములను తలంచుచు నడచి, ద్వారవతికి పోయి, అచ్చట వెలసియున్న శ్రీకృష్ణుని దర్శించి, సుధామపురికేగి స్వామిని సందర్శించి, రుక్మిణీ కృష్ణులకు వివాహ మహోత్సవము జరిగిన మూల మాధవమునకు వెళ్ళి శ్రీకృష్ణుడు పరమపదము చెందిన స్థలమున నున్న వాలుకా తీర్థమును సేవించి, సోమనాథమునకేగి ముచికుందు నివాసస్థానమును వీక్షించి, కాలయవనుడు భస్మమైన గుహను చూసి, అచట నుండి బయలుదేరి పురాణ ప్రసిద్ధములగు తీర్థక్షేత్రములను సందర్శించి, గోదావరీ తీరముకు చేరి కపాలేశ్వరుని దర్శించి, నాసికా త్ర్యంబకమునకు పోయి ఉషోదయానికి ముందే స్నానమొనర్చి, గంగాద్వారము బ్రహ్మగిరి మొదలగు దివ్య స్థలములన్నీ సందర్శించి, అలకాపురమునకు పోయి ఒక పొదచాటున కూర్చుండి దేవతార్చన చేసుకొనుచుండెను.

అలకాపుర నివాసి, కులకర్ణ సిద్ధోపంతుడు ఒక బ్రాహ్మణ అతిథి కొరకు వెదకుచు విఠోభాను చూచి, అతనిని సమీపించి, అతడు పూజ

ముగించి లేచిన వెంటనే నమస్కరించి, "స్వామీ! నీవెవరు?" అని అడిగెను. విఠోభా తన విషయమును వివరముగా తెలిపెను. సిద్ధోపంతు "స్వామీ ! నే నీపురమున నివసిస్తున్న బ్రాహ్మణుడను. చక్రతీర్థమునకు స్నానమునకు వచ్చు బ్రాహ్మణులను ప్రతిదినము ఇంటికి తీసుకొనిపోయి ఉన్నంతలో భోజనము పెట్టి పంపుచుందును. ఈ రోజు నీవొక్కడివే కనబడితివి. దయచేసి యీ పూట మా యింటికి భోజనమునకు రావలె" నని వేడెను.

విఠోభా సంతసించి అతని యింటికి వెళ్ళెను. సిద్ధోపంతు విఠోభాను దైవస్వరూపునిగా భావించి, పంచభక్ష్య పరమాన్నములను వడ్డించి అతనితో గూడ తానును సంతుష్టిగా భుజించెను. విశ్రాంతిగా కూర్చుండి అతనితో తత్వ విషయములను ముచ్చటింప సాగెను. విఠోభా అతని సంశయములన్నీ తీర్చెను. అతని అఖండ పాండిత్యమునకును, ప్రజ్ఞకును, సత్ప్రవర్తనముకును సిద్ధోపంతు సంతసించెను. సిద్ధోపంతు బలవంతపెట్టి విఠోబాను నాటి రాత్రి వారి ఇంట్లోనే విశ్రంతి తీసుకొమ్మనెను. విఠోబా అంగీకరించెను. తెల్లవాఱు ఝామున సిద్ధోపంతునకు స్వప్నమున పుండరీక వరదుడు కనబడి, విఠోభా మహాపురుషుడనియు అతనికి తన కుమార్తె నిచ్చి పెండ్లి చేయమనియు ఆమెయందు దైవాంశ సంభూతులగు బిడ్డలు నలుగురు పుట్టెదరనియు తెలిపి, అదృశ్యుడయ్యెను.

అతడు వెంటనే మేల్కొని, ఆశ్చర్య చకితుడై, విఠోభా మేలుకొన్న వెంటనే తాను కన్న కలను గూర్చి తెలిపి, తన కుమార్తెను వివాహమాడ మనెను. విఠోభా ఉలికిపడి "అయ్యా! మంచి మాట సెలవిచ్చితివి. బావి త్రవ్వబోయి భూతమును జూచినట్లును, పుత్రవరమునకు బోయి

పురుషుని బలి యిచ్చినట్లును తటస్థించినది. ఇందులకే కాబోలు నయవినయములతో నన్నిచ్చటికి తీసికొని వచ్చినది ! ఆహా ! ఎంత సమర్థుడవు !

పూర్వ మెప్పుడో వేశ్య లరణ్యములకు వెళ్ళి మధుర పదార్థములను పెట్టి మోహింపజేసి మహనీయుడగు ఋష్యశృంగుని మాయలో ముంచినదని పురాణము లందు విని ఆశ్చర్య పడుచుంటిని గాని యిప్పుడది మీ చేష్టల వలన ప్రత్యక్ష మగుచున్నది. నీవింత గొప్పవాడవై నా కులగోత్రములనైనను విచారింపక చిక్కినదే చాలునని మెల్లగా దక్కించుకొన చూచుచుంటివి. నీవంటి వానికి ఇట్టి పని మంచిది కాదు. నేనెవ్వడను ? మీరెవ్వరు ? నాకును మీకును సంబంధమేమి ? ఈ ప్రస్తావము ఇంతటితో చాలించుము. నేను పోయెదనని పలికెను.

సిద్ధోపంతు "అయ్యా ! తొందరపడకుము. మీ గోత్ర సూత్రములు సరిపోకున్న భగవంతుడు మా పిల్లను నీకిమ్మని ఎలా నా కలలో చెప్పెను. గోత్రములు సరిపోయిన మారు మాట్లాడక యిప్పుడే మా పిల్లను పెండ్లియాడవలెను. లేనిచో నీ ఇష్టప్రకారం వెళ్ళవచ్చును. మీ యింటి పేరును గోత్రసూత్రములను తల్లివంక వారి గోత్రసూత్రములను తెలియచేయ" మనెను. అందుకు విఠోభా సిద్ధోపంతు ప్రశ్నలకెల్ల సమాధానములు చెప్పి, మీకును మాకును సంబంధమెట్లు సరిపడునో తెలియజేయు" మనెను.

సిద్ధోపంతు తన భార్యను పిలిచి, తమకును వానికి గల బంధుత్వమును వివరముగా తెలిపి ఆతడు వరుసలో మేనల్లుడగు ననెను.

విఠోభాతో "నాయనా ! ఇంకనైన పెండ్లి చేసికొనుము. బంధుత్వమును గూర్చి వింటివి గదా ? అని పలికి, కొందరు బంధువులను పిలిచి, వారికి జరిగిన సంగతి తెలియజేసెను. విఠోభాను అతడు మరింత బలవంతపెట్ట సాగెను.

విఠోభా వ్యధచెంది, అక్కడినుండి తప్పించుకొనిపోవుటకు ఉపాయము కనిపించక సిద్ధోపంతుతో "స్వామీ ! నా మనవి వినుము. నేను బ్రహ్మచర్య అవలంబించి యాత్ర చేయుచున్నాను. నాకు వ్రతభంగ మొనర్చుట మీకు ధర్మము కాదు. మోయలేని బరువును మోయుమన్న ఎట్లు మోయవచ్చును ? నాకీ పెండ్లి అక్కర లేదు. ఒకవేళ మీరు బలవంతముగా నాకీ పెండ్లి చేసినచో మీకు తీరని దుఃఖము ప్రాప్తించు" నని పలికెను.

సిద్ధోపంతు చిరునవ్వు నవ్వి, "నాయనా ! నిన్ను మోసగింపవలెనని మేమనుకోలేదు. ఇది భగవదాజ్ఞ. మా మాట విని వివాహము చేసికొని తరువాత నీ యిష్టప్రకారము కొంతకాలము తీర్థయాత్ర చేసిరావచ్చును. నీ తీర్థయాత్రకు ఆటంక ముండ"దని పలికెను.

విఠోభా ఆ రాత్రి ఎలాగైనా గడిపి తెల్లవారగనే తప్పించుకొని పోవలెనని నిశ్చయించెను. ఆ రాత్రి మూడవ జామున భగవానుడు విఠోభాకు స్వప్నమున కనబడి "నాయనా ! నేను సిద్ధోపంతునకు కలలో కనిపించి చెప్పినదంతా నిజమే. అతని కుమార్తె నీకన్ని విధముల యోగ్యమైనది. మీ వలన లోకోపకారమగు పనులెన్నియో కావలసి ఉన్నవి. అందువలన సిద్ధోపంతు యిష్టానుసారముగా నడచు కొమ్ము, నీకు సకల

శ్రేయములు గలుగు"నని పలికి మాయమయ్యెను.

విఠోభా ఉలికిపడి లేచి, భగవత్ప్రేరణకు చింతించి, ఇంకా ఇక్కడ ఉన్న దుఃఖపడ వలసివచ్చునని తలచి, కాలికి పని చెప్పదలచి మెల్లగా లేచి, చప్పుడుకాకుండ ముందుకు బోయి, వీధి తలుపు దీసి, వెలుపలికి వెళ్ళెను.

శ్రీ విఠోభా-రుక్మాబాయిల వాదన

కంటికి నిద్ర పట్టక నిమిష మొక యుగముగా గడుపుచు పడక మీదనే కూర్చొనిఉన్న సిద్ధోపంతు కుమార్తె రుక్మాబాయి అతనిని చూచెను. ఆమె తన తండ్రి అనుమతి ప్రకారము తనకు నిరుపమాన సౌందర్య సుజ్ఞాన సంపన్నుడగు వరుడు లభించుటకై మహాలక్ష్మి వ్రతం ఆచరించుచుండెను. విఠోభా విషయమై భగవంతుడు ఆజ్ఞాపించిన సంగతి విన్నప్పటి నుంచి తన వ్రతము ఫలించి తగిన వరుడు లభించెనని సంతోషించు చుండెను. ఎప్పుడు వివాహమగును ? ఎప్పు డతని సేవ సంప్రాప్తించు ? అని తలస్తు నిద్రపట్టక కూర్చొని యుండెను. దొంగవలె వెళ్ళుచున్న విఠోభాను చూచెను. "నా తల్లిదండ్రులు నన్నితనికిచ్చి వివాహము చేయ నిశ్చయించినప్పటి నుండి నేనితని సొమ్మయితిని. నేనితనిని తప్ప మరి ఒక్కని భర్తగా వరించలేను. ఇప్పుడితనికి స్వప్నమున భగవంతుడు పెండ్లి విషయమై ఆజ్ఞాపించి ఉండవచ్చును. లేకున్న ఇతడిట్లు లేచి పోవుటకు కారణము ఏమి?. తల్లిదండ్రులు, భగవానుడు ఆజ్ఞప్రకారం ఇతడే నాకు భర్త. ఇతని యిష్టానుసారము వర్తించుట నాకు ముఖ్య

ధర్మ” మని నిశ్చయించి, లేచి, పరుగెత్తుకుపోయి, విఠోభా ముందు నిలిచి, భక్తి ప్రపత్తులతో అతనికి నమస్కరించి, ‘స్వామీ ! ఇంతరాత్రి వేళ ఎవ్వరికి తెలుపకుండ ఎక్కడికి వెళుతున్నావు ? నీకు ఇక్కడ ఉండుట ఇష్టము లేకున్న మా తండ్రికి తెలిపి, అతని వద్ద సెలవొంది, నన్ను గూడ వెంట తీసుకొని మీ ఊరికి వెళ్ళవచ్చును” పలికెను.

విఠోభా ఉలికిపడి, ఈ వెన్నెల కాంతిలో రుక్మాబాయిని జూచి, ఆశ్చర్యచకితుడై “నీవు ఎవరు ? ఒంటరిగా రాత్రివేళ వచ్చి నన్నాటంక పరచుచున్నావు ? అని అడిగెను. రుక్మాబాయి “స్వామీ ! నేను సిద్ధోపంతు కుమార్తెను. భగవదాజ్ఞ ప్రకారము నీకిచ్చి వివాహము చేయుటకు నిశ్చయింప బడిన దానను. తప్పించుకొని పోవుటకై ప్రయత్నించు చున్న నిన్ను మరల ఇంటికి పిలుచుకు పోవటానికై వచ్చితిని. దయచేసి లోనికి రమ్మని వినయముతో పలికెను.

విఠోభా కొంత ఆలోచించి, “నీవు గొప్ప తప్పు చేసితివి. స్త్రీలకు ఎప్పుడును స్వాతంత్ర్యము లేదు. తల్లిదండ్రు లెవ్వని కిత్తురో వానినే వరింపవలెను. ఇంత రాత్రివేళ బయటికి వచ్చి పరపురుషులను బలవంత పెట్టుట మంచిది కాదు. అభిమాన మెంత మాత్రమును లేని నీవంటి వారిని ఎవరైన వివాహ మాడునా ? స్వతంత్రించి పురుషునితో సంభాషింప దలచిన వనిత వ్యభిచారిణి అని చెప్పవచ్చును. ఇచ్చుట నిలువక వెడలి పో” మ్మని కసరుకొనెను.

రుక్మాబాయి “స్వామీ ! నన్నూరక నిరాకరింపకుము. న్యాయమును విచారించుము. పెండ్లి చేసుకొనరాదన్న పట్టుదలతో నాయందు దోషము

ఆరోపించుచుంటివిగాని న్యాయమును విచారించుట లేదు. భగవానుని ఆజ్ఞమేరకు నా తల్లిదండ్రులు నన్ను నీకే ఇవ్వవలెనని నిశ్చయించుట వల్ల నేను నా మనస్సునందు నిన్నే వివాహమాడ నిశ్చయించితిని. అందువలన నీకు భార్యనైతిని. సందేహము లేదు. సర్వ విషయములకు మనస్సే ప్రధానముగదా! మనః పూర్వకముగా చేసుకొన్న వివాహమే విహవాము కాని యితరములు వివాహములు కావు. నా మనస్సు నీకర్పించినప్పుడే నేను నీకు భార్యనైతిని. ఇతరులను కన్నెత్తి చూడను. నన్ను పెండ్లాడకున్నచో నా ప్రాణముల నిప్పుడే నీపదముల కర్పణచేయుదును. ఇది నిశ్చయ" మని పలికెను.

విఠోభాకు విసుగువచ్చి "చాల బాగున్నది. ఎవరి ముక్కునకు సూటిగా వారు చెప్పుట సహజము. నీ పలుకులు యుక్తమైనవి కావు. ఇతరులు విన్న నవ్వుదురు. వచ్చిన దారిబట్టి వెళ్ళుము. నిలిచినచో నీ పరువు దక్కదు. నేను తీర్థయాత్రాపరుడను. సంసారమునందిచ్ఛ లేనివాడను. నీవు నన్ను పీడించుటవలన ప్రయోజనము లేదు. నా మాట విని యింటికి వెళ్ళుము. ఇక్కడ ఉండవద్దని పలికెను.

అందుకు రుక్మాబాయి, "స్వామీ ! నీవు నాకు భర్త అని, నేను నీకు భార్య అని మనశుద్ధిగా నిశ్చయించినాను. ఇప్పుడు వ్యతిరేకంగా నడుచుకొమ్మంటారా? మిమ్మల్ని తిరస్కరించి మరొకరిని పెళ్ళి చేసుకొనేంత పాపాత్మురాలని కాను అని జవాబు ఇచ్చెను.

విఠోభా "వివేకహీనురాలా! నోటికి వచ్చినట్లు మాట్లాడుచున్నావు. నీ సుఖమును నీవు తలంచుచున్నావు. ఆత్మబుద్ధి సుఖకరమనియు,

గురుబుద్ధి అధిక సుఖకరమనియు, పరబుద్ధి వినాశకరమనియు, స్త్రీ బుద్ధి ప్రళయంకరమనియు పెద్దలంటారు. తల్లిదండ్రులను మోసగించి దారిని పోవువానితో దొంగతనముగా దేశాంతరము లేచిపోవుటకు ప్రయత్నించు నీ వంటి పాపాత్మురాలితో మాటాడినను పాపమే. ఇక తిరిగిచూడక వెడలిపో"మ్మని గట్టిగా అరచెను.

రుక్మాబాయి "స్వామీ ! నీవు నేను చెప్పిన విషయములో న్యాయమును చూడటం లేదు. భగవంతుని వాక్యముకంటె విశేషమున్నదా ? అతని ఆజ్ఞ మీరవచ్చునా ? నీవు నన్ను తిట్టినను కొట్టినను సంతోషమే. నేను నీదాన"ననెను.

అందుకు విఠోబా మిక్కిలి విచారపడి, ఆమె బారినుండి తొలగిపోవుట కష్టమని తలచి, మంచిమాటలతో బుజ్జగింపతలచి, "సుందరీమణి ! నీ అందచందములు వర్ణించుట అసాధ్యము, అసమాన సౌందర్యరాశివి. నిన్ను వివాహం చేసుకోవాలన్నచో ఎంతయో పుణ్యము చేసియుండవలయును. నీవంటి సౌభాగ్యవతికి నావంటి వాడు పనికిరాడు. తల్లి ధనవంతుని, తండ్రి బుద్ధిమంతుని, బంధువులు కులవంతుని, కన్య సౌందర్యవంతుని కాంక్షించుట సహజము. అందువల్ల వికృత రూపముగల నన్ను వివాహమాడినచో నలుగురు నవ్వుదురు. నీ చక్కదనమునకు దగిన పురుషుని వెదకి పెళ్ళి చేసుకోమని, నన్ను తొందరపెట్టుట వలన ప్రయోజనము లే"దని పలికెను.

విఠోబా తప్పించుకొని పోవుటకు వీలుగాక అనేక విధముల చింతించుచు, కోపావేశపరుడై "ఓసీ ! మూర్ఖురాలా ! నాతో

ప్రతిఘటింతువా ? ఇప్పటికైన నామాటవిని ఇంటికి వెళ్ళుము. లేకున్న నిన్ను శపింతును" అని పలికెను. రుక్మాబాయి భయపడి గజ గజ వణకుచు కంటికి మంటికి ఏకధారగా పెద్దపెట్టున ఏడ్వసాగెను.

శ్రీవిఠోభా రుక్మాబాయిల వివాహము

ఇంతలో సిద్ధోపంతును, నిరూబాయిలు మేల్కొని, కుమార్తె ఏడ్పు ధ్వని విని, పరుగెత్తుకొనివచ్చి, రుక్మాబాయికి చెంతచేరి విఠోభాను జూచి "అయ్యా ! ఎంతటి నాటకమాడితివి ? పిల్ల నిచ్చుట లేదని మేమేమయిన చిక్కులు కలిగించినగదా నీవిట్టి దుష్కృత్యమును చేయవలసినది? దొంగతనముగా ఆమెను తీసుకొని పోవలసినంత పనియే"మని అనేక విధముల నిందించిరి.

విఠోబా సిద్ధోపంతుతో "అయ్యా ! నన్ను దూషింపకుడు. నేను మీ కుమార్తెను మోసగించి తీసికొని వెళ్ళాలనుకోలేదు. గ్రహచారము చాలక మీయింటికి అతిథినై వచ్చినందుకు మంచి బుద్ధిచెప్పినారు. ఇక్కడ ఒక్క నిమిషమైన ఉండకూడదు. మీవంటి మోసగాళ్ళ మొహం అసలు చూడకూడదని అచటినుండి వేగముగా నడవసాగెను.

సిద్ధోపంతు తన కుమార్తెను భార్యను లోపలికి పంపి, అక్కడ విఠోభా చేతిని పట్టుకొని "అయ్యా ! కోపింపకుము. పెళ్ళి విషయమేమియు తెలుపకయే నీవు వెళ్లుట మంచిదికాదు. ఆలోచింతము ర" మ్మనెను. అందుకు విఠోభా కోపించి భగవంతుడే స్వయముగా వచ్చి చెప్పినను నే నీవివాహమాడను. మీదారి మీరు చూచుకొను"డని పలికి చేయి వదిలించుకొని వేగముగా నడువసాగెను. సిద్ధోపంతు ఎంతయో

బతిమాలెను. ఎంత చెప్పినను వినకపోగా విఠోబాతో “మా కుమార్తె నీయందే బద్ధానురాగమై ఉన్నది. నీవు వివాహ మాడనిచో నామె ముందు వెనుక చూడక తక్షణమే ప్రాణములు విడుచును. అందువలన మేము బ్రతికినంతకాలము పుత్రికాశోకము అనుభవింపవలసివచ్చును. క్రమముగా మా కుమార్తె గతియే మాకునుబట్టును. ఇందువలన నీకు స్త్రీహత్యా పాతకముతో బాటు బ్రహ్మహత్యాపాపము కూడా సంభవించును. అట్టి పాపము సంభవించిన తదుపరి యాత్రాఫలము దక్కదు. జపతపములు ఫలింపవు. అవి ఫలింపనిచో మోక్షము సిద్ధింపదు మామాట వినకున్న ఇన్ని అనర్ధములు జరుగును ఆలోచించుము”అని పలికెను.

విఠోబాకు గుండెల్లు జల్లుమనెను. ఆ ఆపదనుండి కాపాడుమని భగవానుని ప్రార్థించెను. భగవానుడు అదృశ్యముగా నుండి “విఠోబా ! విచారించకుము. నీవు సిద్ధోపంతు కుమార్తెను వివాహమాడుము. నీకు సకలార్ధ సిద్ధిఅగు”నని పలికెను. విఠోబా విస్మయమందెను.

సిద్ధోపంతు “అయ్యా ! ఇప్పుడేమందువు. ఇకనైన వివాహము చేసుకుంటావా?”యని పలికి అతనిని వెంటబెట్టుకొని యింటికి వచ్చి, తెల్లవారగనే బంధువులను పిలిపించి పరమ సంతోషముతో తన కుమార్తెను అతనికిచ్చి విధివిధానముగా, వివాహ మహోత్సవముచేసి, బంధుమిత్రులను ఉచితరీతిన సత్కరించెను.

మరునాడు విఠోబా సిద్ధోపంతుకు భక్తితో నమస్కరించి “అయ్యా ! బలవంతముగా పెండ్లిచేసి నీయిష్టప్రకారముగా పొందవలసిన ఆనందం పొందితివిగదా ? ఇప్పుడైన దయచేసి సెలవిచ్చిన మిగిలినయాత్ర

పూర్తిచేయుదు"ననెను. సిద్ధోపంతు భార్యకి ఆ విషయమును తెలిపి తానుగూడ విఠోభావెంట బయలుదేరెను. వారిరువురును దివ్య స్థలములను, దివ్యతీర్థములను సేవించుచు అహోబిలము, శ్రీశైలము, పండరిపురము, శ్రీరంగము, గోకర్ణము, రామేశ్వరము మున్నగు పుణ్యస్థలములను సేవించి పుణ్యతీర్థములలో స్నానమాడి, వెనుకకు మరలి సుఖముగా కొన్నిదినములో అలకాపురి చేరిరి.

శ్రీ విఠోభా తల్లిదండ్రులవద్దకు వెళ్ళుట

ఒకనాడు విఠోభా సిద్ధోపంతుతో "ఇక నేను తల్లిదండ్రుల వద్దకు వెళ్ళాలి. వారు నా రాకకై ఎదురుచూస్తూ ఉంటారు. దయచేసి సెలవి"మ్మని వేడెను. అందుకు సిద్ధోపంతు సమ్మతించి, మరుసటి దినం ఉదయమున సకుటుంబముగా అతనితో ప్రయాణమై కొన్ని రోజుల తరువాత యింటికి పోయెను.

విఠోబా తన తల్లిదండ్రులకు నమస్కరించెను. సిద్ధోపంతు వారికి నమస్కరించి కుమార్తెను తీసికొనివచ్చి మ్రొక్కించెను. గోవిందపంతు కుమారునిచూచి ఆనందించి "నాయనా ! వీరెవ్వ"రని అడిగెను. సిద్ధోపంతు అందుకు సమాధానంగా విఠోభా తన యింటికి వచ్చినప్పటి నుండి జరిగిన విషయములు తెలిపి, వివాహ విషయమై తెలుపుటకు వీలుగా లేదని, అందుకు మన్నించుమనియు వేడెను. నిరూబాయి రుక్మాబాయిని చూచి ఎంతో సంతసించెను. కోడలిని వియ్యపురాలిని శ్రద్ధగా ఆదరించెను. గోవిందపంతు సిద్ధోపంతుకు నమస్కరించి "స్వామీ ! మీ అనుగ్రహమువలన

నా కుమారుని కన్నులార కనుగొనుభాగ్యము గలిగినది. వీని వైరాగ్య వృత్తిని తలచినచో గుండెలు తల్లడిల్లును. మీ దయవలన మాకా విచారము తీరిపోయిన”దనెను. సిద్ధోపంతు తమ కంత మంచి సంబంధము లభించినందులకు సంతసించెను. సిద్ధోపంతు కొన్ని దినములుండి వారివద్ద సెలవుతీసుకొని, కుమార్తెకు చెప్పవలసిన బుద్ధులజెప్పి, భార్యతో గూడ బయలుదేరి, స్వస్థలము చేరి భగవంతుని ఆరాధించుచు సుఖముగా నుండెను.

కాలక్రమమున విఠోభాకు వైరాగ్యము అధికమయ్యెను. రుక్మాబాయి యవ్వనము లోకి వచ్చిన ఒక్కనాడైన ఆమెను కన్నెత్తి చూడలేదు. దైవవశమున అతని తల్లిదండ్రులు యోగనిష్ఠ అవలంబించియుండి పరమపదించిరి. విఠోబా వారికి విధ్యుక్త కర్మలనెల్ల జరిపెను. ఒకనాడు తన భార్యతో “నా తల్లిదండ్రుల అస్థికలను తీసికొనివెళ్ళి గంగానదిలో కలుపవలెను. కనుక నేనిపుడు కాశికి వెళ్ళాలనుకుంటున్నాను. నిన్ను ఒంటరిగా ఇక్కడ వదలి వెళ్ళటం మంచిది కాదు. నిన్ను తీసికొని వెళ్ళి నీపుట్టినింట దిగబెట్టెదను. మన యింట నున్న ధనంలో నీకు వలసినంత తీసికొని మిగిలిన దానిని భగవత్ప్రీతిగా పేదసాదలకు పంచిపెట్టు”మనెను. రుక్మాబాయి తనకొరకేమియు ఉంచుకొనక సమస్తమును బీదసాదలకు పంచిపెట్టెను.

విఠోభా ఆమెను వెంటతీసికొని బయలుదేరుటకు సిద్ధపడెను. ఇంతలో సిద్ధోపంతు తన వియ్యంకులు పరలోకగతులగుట విని తన అల్లుని ఓదార్చుటకు అచ్చటికి వచ్చెను. తన అల్లుని చర్యలకు ఆశ్చర్యపడి,

తన కుమార్తెవలన విషయమంతయు విని, తన గ్రామమునకు, తీసికొనిపోవ నిశ్చయించెను. వారిని వెంట తీసికొని కొన్ని దినములకు అలకావతి చేరెను. విఠోబా తనకు కాశికి వెళ్ళవలసిన అవసరం తెలియచేసి, వెళ్ళుటకు సెలవిమ్మని అడిగెను. సిద్ధోపంతు కొన్ని రోజులు విశ్రాంతి తీర్చుకొని వెళ్ళవచ్చునని అక్కడే ఉండమనెను. రుక్మాబాయి రహస్యముగా తల్లిదండ్రులకు అతని వైరాగ్యమును విశదముగా తెలిపి, వెళ్ళిపోయిన మళ్ళీ రాడని, ఎట్లయిన సంసారమునందు మెలగునట్లు చేయమని అడిగెను. సిద్ధోపంతు మిక్కిలి జాగ్రత్తగా అల్లుని నీడవలె అనుసరించి కంటికి రెప్పవలె కనిపెట్టుకొని ఉండెను.

ఒకనాడు విఠోభా గంగాయత్రకు సెలవిమ్మని సిద్ధోపంతును నిర్బంధపెట్టెను. సిద్ధోపంతు తానుకూడ వచ్చెదను అనెను. విఠోభా తన స్వేచ్ఛకు భంగము కలిగినందులకు మిక్కిలి బాధపడి, భార్యను పిలిచి "ఈ సంసారనరకము అనుభవించుటకు నాకు ఇష్టము లేదు. సన్యాసము తీసికొని స్వేచ్ఛగా ఉండుటకు నిర్ణయించుకున్నాను. నీకు చెప్పకుండా వెళ్ళటం నాకు ఇష్టము లేదు కనుక నిజము తెలుపుచున్నాను. నీ తల్లిదండ్రులకు ఈ విషయమును తెలుపుము. ఆలస్యము చేయకుండా నన్ను పంపించుము" అని పలికెను. రుక్మాబాయి పిడుగువంటి ఆ పలుకులకు ఉలిక్కిపడి, తల్లితండ్రులతో ఆ విషయమును తెలిపెను.

సిద్ధోపంతు బాధపడి అల్లుని వద్దకు పోయి, "నాయనా ! నీవు ఇంకా చిన్నవాడవు. విషయసుఖములను కాస్తైనా అనుభవించలేదు.

ఈ వయసున ఇంద్రియములు వశపడవు. కాయగూరలు తిని వనములలో నివసించు మునులకు సైతము ఇంద్రియములు వశము కాకపోగా షడ్రసోపేతములగు పదార్ధములను భుజించుచు యౌవనావస్థలో నున్నవారి కవి వశమగునా ? సంసార సన్యాసముల రెంటికి చెడి ఇహపరములకు కాదు. సన్యాసము ఇప్పటికి సుఖముగా అనిపించినా ఇంద్రియాలకు చిక్కి అందులో పడినప్పుడు కష్టముగా అనిపించును. అనుభవించునప్పటికిగాని దాని స్వభావము తెలియదు. అందువలన పెద్దలు బ్రహ్మచర్య, గృహస్థ, వానప్రస్థ సన్యాసములను క్రమముగా ఏర్పరచి, అనుష్ఠింపవలెనని విధించిరి. సన్యాసము సన్యాసమని ఊరక తల్లిడిల్లుచున్నావు. సన్యాసమనగా తల బోడి చేసికొని కాషాయవస్త్రములను ధరించుట కాదు. సంకల్ప వికల్పముల త్రుంచివేసి జాగ్రత్తయందు సుషుప్తిని పొంది ఆనందమాత్రముగా ఉండుటయే సన్యాసము. ఇది సామాన్యులకు సాధ్యముకాదు. తలబోడియైన మాత్రమున తలపులు బోడివి కాదు. నారదుడు, విశ్వామిత్రుడు, బృహస్పతి, శుక్రుడు, త్రిమూర్తులు సామాన్యులా ? అంతటివారే స్త్రీ వ్యామోహమునకు చిక్కగా, ఇంకా ఇతరులమాట చెప్పనేల ? కాలుడయిన వశమగునుగాని కాముడు వశుడుగాడు. సంసారమున ఉన్నను పద్మపత్రమువలె సంగముల నంటక ప్రవర్తించువాడే పండితుడు కాని, సన్యాస మవలంబించి సాధింపలేక పతనమగువాడు పండితుడు కాడు. ఈ విషయము లన్నియును నీకు తెలియనివి కావు. తొందరపడి సన్యాసము తీసికొనుట యుక్తముకాదు.

నామాట విని గృహస్థధర్మము అవలంబింపుము. అట్లుగాక నీకు ఇష్టము లేనిచో ఒక్క కుమారుడు కలుగుదాకనయిన నీభార్యతో కలిసి మెలసి యుండు" అని బోధించెను.

విఠోభా తన మామకు నమస్కరించి, "స్వామీ ! సింహము ఎంత ఆకలిగా ఉన్నను సమీపమున తిరుగాడు నక్కలమీద చేయి వేయక మదగజ కుంభస్థలములకే వేచియుండునట్లు విరక్తు డెప్పుడును విషయములు తనంతన పైబడి వచ్చినను లెక్కింపక పరమానందమునే కోరుచుండును తనంతన పైబడి వచ్చినను లెక్కింపక పరమానందమునే కోరుచుండును. యుక్తాయుక్త పరిజ్ఞానముగల వివేకి ఎప్పుడును స్త్రీసుఖము అపేక్షింపడు. సంతత దుఃఖములకు మూలమగు సంతానము నాకేల ? మీరుకాదు భగవంతుడే వచ్చి నన్ను అడ్డగించినను నేనిచట ఉండను. ఆశ మానుము"అని పలికి, వారెంత బతిమాలినను వినక, తల్లిదండ్రుల అస్థికలను తీసుకొని కాశికి నడువబోయెను. రుక్మాబాయి ఏడ్చుచు అతని పాదములను గట్టిగా పట్టుకొనెను. విఠోబా వారిని మోసగించిపోవ నిశ్చయించి అప్పటికి తాత్కాలికముగా ప్రయాణము మానివేసెను.

కొంతకాలము గడచినపిదప విఠోబా ఒకనాడు ప్రాతఃకాలమున భార్యవద్దకు పోయి, "స్నానముకై వెళ్ళెద"నని ద్వంద్వార్థముగా చెప్పెను. రుక్మాబాయి అతని కపటము తెలియక "చిత్త"మని పలికెను. వెంటనే విఠోబా సంతోషాంతరంగుడై, శని వదలినదని యెంచి, పంజరమునుండి బయటకు వచ్చిన చిలుకవలెను, రంభ యొక్క చిక్కునుండి విముక్తి

పొందిన శుకమహర్షివలెను, సంసార గహనమునుండి తప్పించుకొని, వాయువేగమున పరుగెత్తుచు నిద్రాహారములు మాని రాత్రింబవళ్ళు ప్రయాణముచేసి కొన్ని దినములకు కాశిచేరెను. గంగానదిలో స్నానముచేసి, జననీ, జనకుల అస్థికలను గంగలోగలిపి, పిండప్రదానాది కార్యములను పూర్తిచేసి ప్రయాగకు పోయెను. అచటినుండి పుష్కరమునకు పోయి ఒకచోట బసచేసి, సత్పురుషులతో నిరంతరము వేదాంతశ్రవణము చేయుచు సుఖముగా ఉండెను.

తన భర్త ఎంతకు రాకపోవుటచే రుక్మాబాయి తన తల్లిదండ్రులకు ఆ విషయమును తెలిపి, ఏడ్వసాగెను. సిద్ధోపంతు విఠోబా చెప్పిన మాటలలోని గూఢార్థములను గ్రహించి, మోసగించి వెళ్ళెనని నిశ్చయించి, పలువురు మనుష్యులను పంపి వెదకించెను. కాని అల్లునిజాడ తెలియలేదు. రుక్మాబాయి యేడ్చి యేడ్చి ఆహారపానీయములను తినుట మానుకొనెను. తల్లిదండ్రులు ఆమెను ఓదార్చిరి. అగ్ని ప్రవేశము చేయుదునని పలుకగా సిద్ధోపంతు "తల్లీ ! కొన్ని దినములు గౌరీవ్రతము చేయుము. నీ భర్తే నీదగ్గరకు వస్తాడు" అని ధైర్యము చెప్పెను. తొల్లి పరమశివుని భర్తనుగా వరింపగోరి పార్వతీదేవియు, శ్రీకృష్ణుని భర్తనుగా వరింపగోరి రుక్మిణీదేవియు, నీవ్రతమునే చేసి తమ యిష్టాపూర్తి చేసికొని సంతుష్టి నొంది"రని పలికి, సమ్మతింపజేసెను. వ్రతవిధానమును తెలియచేసెను. రుక్మాబాయి తండ్రి ఉపదేశించినట్లు భక్తిశ్రద్ధలతో ఆ వ్రతము రుక్మాబాయి చేసినది.

శ్రీ విఠోభా సన్యాసము స్వీకరించుట

ఒకనాడు విఠోబా సాధువులతోగూడి వేదాంత ప్రసంగము చేయుచున్న ఒక సత్పురుషుని వద్దకుపోయి అతడు ఉపన్యసించు విషయములు శ్రద్ధగా వినుచుండెను. ఆ పురుషుడు "అయ్యలారా ! అన్ని యోగములలో సన్యాసము శ్రేష్ఠమైనది. సమస్తప్రాణుల యందు సమదర్శనము కలిగి వర్తించువానికి సులభముగా సద్భక్తి లభించును. భక్తివలన పరమాత్మదర్శనము, పరమాత్మ దర్శనము వలన బ్రహ్మానందమును కలుగును. భగవంతునియందు మనస్సు పెట్టి సుఖించువానికి ఎప్పుడును దుఃఖములు కలుగదు. అహంకార మమకారములకు లోబడినవాడు తప్పక చెడిపోవును. సంసారబంధము నుండి విడుదలచెందుటకు ముఖ్యసాధనము రాగద్వేషములను విడుచుటయే. విషయ సుఖానుభవము విషముతో కలిసిన పాలవలె తాత్కాలికముగా ఆనందము కలిగించిన అప్పటికి అది ఎంతో దుః ఖములకు పాత్రముగా చేయును. కావున విషయ సుఖములను స్మరింపరాదు. శోత్రాది ద్వారములగుండ బుద్ధియందు ప్రవేశించు శబ్దాది విషయుములను నిగ్రహించి దృష్టిని భ్రూమధ్యమున నిలిపి ప్రాణాపానములను రెంటిని సమముగా నాసికములోపల చరింపజేసి, మనోబుద్ధీంద్రియములను వశపరచుకొని అరిషడ్వర్గమును జయించి కేవల ముముక్షుత్వమును వహించి మెలగువాడు ఒక్కడే బ్రహ్మానందము అనుభవింప పాత్రుడు. తక్కినవారు పాత్రులు కారు" అని చెప్పెను.

విఠోబాకు ఆ విషయము విన్నప్పటి నుండి సన్యాసముపై ఆశ పెరిగెను. యోగ్యుడగు ఆచార్యుని కొరకు వెదుకసాగెను. ఒకనాడు అనుకోకుండా అక్కడ నివసిస్తున్న శ్రీపాదస్వామి అను పరమహంస అతనికి కనబడెను. విఠోబా అతని లక్షణములనెల్ల పరీక్షించి, తనకు తగిన ఆచార్యుడని నిశ్చయించి, అతనిని సమీపించి, నమస్కరించి, చేతులు జోడించుకొని వినయముతో నిలుచుండి, అతని అనేక విధముల కొనియాడెను.

శ్రీపాదస్వామి విఠోబాను దగ్గరకి పిలిచి, “నాయనా ! నీ వెవ్వడవు? నా వద్దకు ఎందుకు వచ్చావు?” అని ప్రశ్నించెను. అందుకు విఠోబా “స్వామీ ! సంసార బాధనుండి తప్పించుకొని సుఖింపవలెనను కోరికచే నిన్నాశ్రయించితిని. కరుణించి నన్ను నీదాసునిగా చేసుకొని నను రక్షింపవలెను” అని ప్రార్థించెను. శ్రీపాదస్వామి “ఎల్లవారికి సంతోషము కలిగించుచున్న సంసారము నీకెట్లు బాధ కలిగించినదో తెలుప”మనెను. అందుకు విఠోబా “స్వామీ ! విషయ సుఖములను గొప్ప గానెంచి దానివలననెట్టి సంతోషమనుభవింతురో తెలియదు గాని నేను మాత్రము సంసారమను భయంకరమైన అరణ్యమున చిక్కువడి త్రోవగానక తిరుగుచున్నాను. దయచేసి దారి చూపి కాపాడు“ అని అడిగెను.

శ్రీపాదస్వామి మందహాసముచేసి, “నాయనా ! అర్ధమైనది. విషయములను ఘోరమృగములను చంపుటకు దగిన చంద్రహాసము కొఱకు నేను నీ వలెనే వెదకుచున్నాను గాని నాకు ఇంతవరకది లభింపలేదు. ఈ విషయము తప్ప తక్కిన విషయము ఏవి కావలసియున్నను

నిరాటంకముగా ఇచ్చెదను" అని పలికెను. అందుకు విఠోబా "స్వామీ ! నన్నూరక పరీక్షించుట వలన ప్రయోజనము లేదు. నాపై దయయుంచి నన్ను శిష్యునిగా పరిగ్రహించి తత్త్వమార్గమును బోధించి అహంకార మమకారములను తొలగించి అజ్ఞానమును తెలిపి ఆనంద రసపానముచేత చిక్కునట్లుగా అనుగ్రహించి రక్షింపవలె"నని పలువిధముల ప్రార్థించెను.

స్వామి అతని తీవ్ర పరిపాకమునకు మెచ్చి, విఠోబాను ఆదరించి, తన సమీపమున కూర్చుండబెట్టి, "నాయనా ! ఇంతటి వైరాగ్యసంపన్నుని నే నింతవరకు చూడలేదు. నీ చిత్తస్థైర్యము శ్లాఘింపదగినది. ఇంత చిన్న వయస్సులో ఇంతటి వైరాగ్యము ఉండుట నీ అదృష్ట"మని పలికి, "నీవు బ్రహ్మచారివా ? గృహస్థుడవా ? తల్లిదండ్రులున్నారా లేరా ?" అని అడిగెను. విఠోబా తనకు వివాహమైన సంగతి తెలిపినచో అక్కడి నుండి పంపివేస్తారని తాను బ్రహ్మచారి అని, కొన్ని దినముల క్రింద తన తల్లిదండ్రులు కాలధర్మము చెందిరనియు పలికెను. శ్రీపాదస్వామి సంతోషించి అతని శిరము మీద తన హస్తముంచి, శ్రద్ధతో వినుమనిచెప్పి, ప్రణవాది మంత్రములలో అగ్రగణ్యమైనదియు, సమస్తసిద్ధులను సులభముగా సమకూర్చునదియు, సద్వితీయ భావమును స్థాపించునదియు, వేదాంతములలోని సారాంశమైనదియు, మనశ్చలనమును నిరోధించునదియు, సచ్చిదానందభావమును ప్రసాదించునదియు, నిత్యానందప్రదమైనదియు, పదార్ధత్రయ యుక్తమైనదియు, ఐక్యాను సంధానమును వెల్లడించునదియు, మతభేదరహితమైనదియు, సంశయములను అన్ని ఖండించునదియు,

అహంకార మమకారములను నశింపజేయునదియు, అఖండానందము అనుగ్రహించునదియునై వెలయుచున్న 'తత్త్వమసి'అను మహావాక్యమును బోధించి భవబంధ విముక్తునిగా చేసెను.

విఠోబా పరమానందముతో గురువునకు నమస్కరించి, ఆ మహావాక్యము యొక్క రహస్యార్థమును వివరము తెలియచేయుమని ప్రార్థించెను. శ్రీ పాదస్వామి అధిక సంతోషముతో "నాయనా ! ఈ మహావాక్య రహస్యార్థకమును తెలిసికొనుటకు నీవు అర్హుడవై ఉన్నావు సావధాన చిత్తుడవై వినుము.

ఋగ్వేదమునందు ప్రజ్ఞానం బ్రహ్మయనియు, యజుర్వేదము అందు అయమాత్మా బ్రహ్మమనియు, సామవేదమునందు తత్వమసి అనియు, అధర్వణ వేదమందు అహం బ్రహ్మోస్మి అనియు చెప్పబడు ఈ మహావాక్యములు శిరోభూషణములై ఉన్నవి. వాని అర్థమును విశదముగా తెలియజేయు అంతటి శక్తి నాకు లేదుగాని, పెద్దలవలన విన్నంతవరకు నీకు తెలియచేసెదను.

ప్రజ్ఞానమనగా ఆత్మ; బ్రహ్మమనగా పరమాత్మ; ప్రజ్ఞాన స్వరూపమే బ్రహ్మమని తెలియచేయుటయే మొదటి వాక్యము యొక్క అంతరార్థము శబ్ద స్పర్శరూప రసగంథములను విషయములను తెలిసికొను ఇంద్రియములను, ఆ ఇంద్రియములను తెలిసికొను అంతఃకరణములను, ఆ అంతఃకరణములను తెలిసికొను చిదాభాసుని, వీని అన్నిటిని కప్పివేయు అవిద్యను తెలిసికొనుచు సాక్షిమాత్రముగా వెలయుచున్న పదార్థమే ప్రజ్ఞాసమనియు, ఇట్లు సమస్త పదార్థములలోపల నివసించి వానినెల్ల

తెలిసికొను సర్వసాక్షియే బ్రహ్మమనియు, వేదములు పలుకుచున్నవి. బహువిధ నామములకు ఆధారమై సాక్షిమాత్రముగా వెలయుచున్న జ్ఞానమే ఆత్మయనియు, బహువిధ నామములకు ఆథేయమై సర్వసాక్షిగా వెలయుచున్న బ్రహ్మమే పరమాత్మఅనియు వేదాంత శాస్త్రములు తెలుపుచున్నవి" అని చెప్పెను.

అందుకు విఠోబా "స్వామీ ! ఒక్క దేహముకు సాక్షిగా ఉన్న ఆత్మ సర్వసాక్షియగు పరమాత్మ ఎట్లు కాగలడు" అని అడిగెను. స్వామి "నాయనా ! దీపము దివిటీ అనుపేర్లు వేరుగా నున్నను వానిప్రకాశము మాత్రము భిన్నము కానట్లు ఆత్మ పరమాత్మ అను నామములు భిన్నములుగా నున్నను స్వభావము మాత్రమొక్కటిగానే ఉండును. పెద్దదిగా నున్నందున చెరువనియు చిన్నదిగా ఉన్నందున కాలువ అనియు, ఒక్కడున్న మనుష్యుడనియు అనేకులున్న సంఘమనియు, నామభేదములు కలిగియున్నను జలముల యొక్కయు, మనుజుల యొక్కయు స్వభావము మాత్రము వేరుపడక ఒక్క విధముగా ఉండునట్లు ఒక్క దేహమునకు సాక్షిగా ఉండుట వలన ఆత్మఅనియు, సకల దేహములకు సాక్షిగా ఉండుటవలన పరమాత్మఅనియు ఉపాది భేదములచేత నామము లేర్పడినవి గాని విచారింపగా ఆత్మ పరమాత్మలకు భేదములేదు" అని చెప్పెను.

విఠోబా "ఆత్మస్వరూపము ఎట్టి"దని అడిగెను. స్వామి "ఇంద్రియ మనోవికారములను నిగ్రహించి, మానావ మానములను దూరముచేసి, మౌనముద్ర ధరించి, సంకల్ప వికల్పములను అణచి, నిర్వికల్ప సమాధి

అందు నిశ్చలమై సుఖముగా ఉండుటయే బ్రహ్మానుసంధానము. ఇదియే ఆత్మస్వరూపము" అని చెప్పెను. అతనికి పూర్ణాభిషేకమునుచేసి చైతన్యస్వామియని నామముంచి, తాను నిర్వికల్పసమాధి నిష్ఠబూని, బ్రహ్మానందము అనుభవించుచుండెను. గురు కరుణా కటాక్షముచే సంకల్పములెల్ల తొలగిపోయి చిత్తస్థైర్యము కలుగగా విఠోబా బ్రహ్మధ్యానమునకు పూనుకొని బ్రహ్మానందము అనుభవించుచుండెను.

శ్రీపాదస్వామి అలకావతికి వచ్చుట

సిద్ధోపంతు తన కుమార్తెకు కలిగిన దుర్దశకు మిక్కిలి చింతించి, తమకు కలిగిన కష్టములను తొలగించి రక్షింపుమని నిరంతరము పాండురంగని ప్రార్థించుచుండెను. అతని భార్య తన కూతురిని అల్లునినిచేర్చి సంతోషమును కలిగించుమని నిరంతరము రుక్మిణీదేవిని ప్రార్థించుచుండెను. రుక్మాబాయి తండ్రి ఉపదేశించినట్లు గౌరిపూజ చేయుచుండెను. తల చిక్కుతీయకపోవుటచే వెంట్రుకలు జడలు గట్టి ముఖమున ఒకవిధమైన దివ్యతేజమును కలిగించుచుండగా చూచినవా రెల్లరు పరాశక్తి అని భావించి భక్తితో ఆమెకు నమస్కరించుచుండిరి. ఇట్లు సంవత్సరకాలము గడచెను.

వారి తపోమహిమ శ్రీ పాదస్వామి యొక్క మనస్సును వికలపరచి సంచార సమాధియందు విశేషాసక్తిని పుట్టించి అచటినుండి అతనిని కదిపెను. స్వామి కాశినుండి బయలుదేరి గ్రామములు తిరుగుచు ఒకనాడు ఉదయమున అలకావతికి వచ్చి చక్రతీర్థ సమీపమున అశ్వత్థ

వృక్షముక్రింద పద్మాసనము వేసికొని కూర్చుండి బ్రహ్మానందరసమున మునిగి పరవశత పొందియుండెను.

రుక్మాబాయి ఎప్పటివలె చక్రతీర్థమునందు స్నానముచేసి, అశ్వత్థ ప్రదక్షిణమునకై అచటికివచ్చి, చెట్టు క్రిందనున్న శ్రీపాద స్వామిని చూచి, అతడు గొప్పవాడై ఉండునని తలచి, త్వరగా ఇంటికి వెళ్లి, భోజనపదార్థముల తెచ్చి, అతనికి నమస్కరించి "స్వామీ ! నీవు మిక్కిలి అలసియున్నావు. దయచేసి యీ పదార్థములను స్వీకరించి కొంత విశ్రాంతి పొందు"మని ప్రార్థించెను. శ్రీ పాదస్వామి రుక్మాబాయి యొక్క మృదుమధుర వచనములు విని కన్నులువిచ్చి ఆమె ముఖమువైపు చూచి, ఆమె వినయ విధేయతలకు సంతసించి, "సౌభాగ్యవతివై ముగ్గురు కుమారులను ఒక్క కూతురును కలిగి సంతోషముగా సుఖింతువుగాక" అని ఆశీర్వదించెను. రుక్మాబాయి అద్భుత ఆనందములతో చిరునవ్వుతో ఆ సన్యాసిని చూచుచు నిశ్చేష్టయై నిలువబడెను. స్వామి ఆమె చిరునవ్వునకు ఏదైన కారణ ముండవచ్చునని యెంచి "అమ్మా ! నవ్వుచుంటివేల ? నా ఆశీర్వాదము నిష్ఫలమగునని యెంచితివేమో ! అట్లు తలచకు. నా ఆశీర్వాదము ఎంతమాత్రము వ్యర్థముకా"దని పలికెను. రుక్మాబాయి తానుదెచ్చిన పదార్థములనెల్ల వడ్డించి స్వామి సంతుష్టిగా భుజించి, విశ్రమించిన పిదప "స్వామీ ! చవిటి నేలపడిన విత్తనమును, అపాత్రుని అందు వినియోగించిన దానమును, చెవిటివాని ఎదుట పాడిన సంగీతమును, మూర్ఖునకు బోధించిన ధర్మోపదేశమును నిష్ఫలమైనట్లు,

దురదృష్టవతినగు నాయందు నీవు అనుగ్రహించిన ఆశీర్వాదము నిష్ఫలమైనది అని బాధతో నవ్వితి” ననెను.

శ్రీపాదస్వామి “హరిహర బ్రహ్మాదులు అడ్డుపడినను నా ఆశీర్వాదము నిష్ఫలముకాదు. సందేహింప పనిలే”దనెను. రుక్మాబాయి “స్వామీ! నీమాట వాస్తవమేకాని అది నెరవేరుటకు గొప్ప ప్రతిబంధకము ఒకటి ఉన్నది. పురుషుడు లేక పుత్రులు కలుగనేరరు గదా” అనెను. అందుకు స్వామి “నీ భర్త ఎక్కడికి వెళ్ళెనో తెలియజేయు”మనెను. రుక్మాబాయి “నాభర్త సంసారమును వదలి ఎవ్వరికిని చెప్పక సంవత్సరముక్రింద దేశాంతరమునకు వెళ్ళిపోయెను. సన్యాసము తీసికొని కాశిలో ఉన్నాడన్నవార్త ఇప్పుడే తెలిసినది. సంసారములో ఉన్నప్పుడే నన్ను స్పృశించుట ఇష్టములేక ఉన్నవాడు నాతో సంసారం ఎలా చేస్తాడు? విషయము ఎట్లు ఊహింపుము. నీ ఆశీర్వాదము ఫలింపవలెనన్న నా భర్త సన్యాసమును వదలి మరి సంసారి కావలెనుగదా ? ఈ విషయమై నాకు సంశయము కలుగుచున్నది. దైవ సంకల్పము ఎట్లున్నదో తెలియదు” అనెను. శ్రీ పాదస్వామి కొంతసేపు ఆలోచించి “నీ భర్త గృహస్థుడై ఉండుటగాక అపుత్రవంతుడై ఉండగా యుక్తాయుక్తములను విచారించక అతనికి సన్యాస మిచ్చినవా డెవ్వడై ఉండును ? సంతానము కలుగుటకు ముందు సన్యసించినవాడును, యుక్తాయుక్తములను విచారింపక అట్టివానికి సన్యాసమిచ్చినవాడును తప్పక నరకమునకు పోవుదురు. నీ భర్తకి సన్యాసమిచ్చిన వాడెవ్వడో కొంత తెలియజేయు”మనెను. రుక్మాబాయి

"సన్యాసమిచ్చిన ఎవరో తెలియ"దనెను. స్వామి ఆమెతో "నీ భర్త నిన్ను వదలి వెళ్ళుటకు కారణమేమి ? అతడట్లు వెళ్ళుతుండగా నీవు పరమపతివ్రతమయ్యు అతనివెంట పోకుండుటకు కారణమే?మని అడిగెను.

రుక్మాబాయి తన భర్త తీర్థయాత్రలకై బయలుదేరి వచ్చి తన్ను వివాహమాడినది మొదలు తన్ను విడిచి వెళ్ళువరకు జరిగిన సంగతి అంతయు వివరించి, తన దుస్థితికి మిగుల దుఃఖించెను. శ్రీపాదస్వామి తనలో కొంత అనుమానపడి అతనిని విచారించి, తన శిష్యుడగు చైతన్యస్వామియే ఆమె భర్తయై ఉండునని ఊహించి, ప్రమాదవశమున తనకు కలిగిన పాపమునకు పశ్చాత్తాపపడి, తన అజాగ్రత్త వలన జరిగిన అకార్యమును గూర్చి చింతించి, ఆమెను "భర్త పేరే?"మని అడిగెను. ఆమె తన భర్త పేరును క్రింద వ్రాసి చూపెట్టెను. స్వామి విఠోబా జరిపిన అకార్యమున అతని మీద ఆగ్రహించి ఆతని అనేక విధముల దూషించుచు "ఇట్టి దుష్కృత్యమున కొడిగట్టిన ఆ దుర్మార్గుడిని ఇప్పుడే శపించి భస్మమొనర్చి ఉందును గాని నీకు చేసిన వాగ్దానము వలన వానిని క్షమింపవలసివచ్చినది.

పరమ పతివ్రతయగు భార్యను విడిచిపెట్టి దుఃఖసాగరమున ముంచినది గాక అబద్ధమాడి నన్ను గూడ గొప్ప దోషమునకు గురి చేసినాడు. నీ తల్లిదండ్రుల ఇచ్చటికి తీసికొని ర"మ్మనెను. వెంటనే రుక్మాబాయి ఇంటికి వెళ్లి తల్లిదండ్రులకు ఆ విషయములు అన్ని తెలిపి, వారిని అచటికి తీసికొనివచ్చెను. సిద్ధోపంతు దివ్య తేజస్వియగు సన్యాసిని

చూడగానే భక్తిప్రపత్తులతో సాష్టాంగముగా నమస్కరించి, అతనిని తన ఇంటికి తీసికొనివచ్చి, ఉచితాసనమున కూర్చుండబెట్టి, అర్ఘపాద్యములతో పూజించి, అతని రాకకు కారణము అడిగెను. పరమహంస "అయ్యా ! నేను కాశి నుండి ఆకస్మికముగా రామేశ్వర యాత్రకై బయలుదేరితిని. రుక్మాబాయి తెలిపిన విషయమును బట్టి మరల కాశికి పోవలసిన పరిస్థితి వచ్చింది. నీ కుమార్తెను వెంట తీసికొని నాతో కాశికి బయలు దేరవలయు"ననెను. సిద్ధోపంతు సంతోషించి రుక్మాబాయిని తీసికొని పరమహంసతో కాశికి బయలుదేరెను.

శ్రీవిఠోభా గృహస్థాశ్రమ స్వీకారము

వారు అందరూ రాత్రింబగళ్ళు ప్రయాణము చేసి కొన్ని రోజులలో కాశీ చేరిరి. శ్రీపాదస్వామి సిద్ధోపంతును రుక్మాబాయిని తన మఠములో ఒకచోట రహస్యముగా ఉండమని, ఒక శిష్యుని పంపి, విఠోబాను పిలిపించి, "ఓరీ ! చైతన్యా ! నీవు బ్రహ్మచారివా ? గృహస్థుడవా ? వాస్తవముగా చెప్పుము. నిజము దాచితివా నిన్నిప్పుడే శపింతు"నని కోపముతో పలికెను. విఠోబా ఉలిక్కిపడి గజగజ వణుకుచు, అబద్ధమాడ భయపడి, వాస్తవస్థితిని తెలుపుట మంచిదని అనుకొని, వాస్తవమును వినిపించి, "స్వామీ ! నా మనోధనముల నెల్ల నీ కెప్పుడో ధారపోసితిని గాన నీవేమి చేసినను చేయవచ్చును. నీ ఆజ్ఞానుసారము నడచుకొనుటకు సిద్ధముగా ఉన్నా"నని పలికి, "శరణాగతుని రక్షింపు"మని మొరపెట్టుచు అతని పాదములను పట్టుకొని ఏడ్వసాగెను. అటనున్న శిష్యులందరును "స్వామీ ! దయచేసి చైతన్యస్వామి తప్పును మన్నించి రక్షింపవలె" నని

దీనత్వముతో ప్రార్థించిరి. శ్రీపాదస్వామి కనికరించి వారి ప్రార్ధనను అంగీకరించి, చైతన్యస్వామిని కరుణా కటాక్షముల కనుగొని ఆదరించి, "నాయనా ! భయపడకుము అలకావతిలో నీ విషయము అంతయు వివరముగా విన్నాను. నీవిపుడు వాస్తవమునే పలికితివి భగవద్వాక్యమును మీరరాదన్న అభిప్రాయము చేతనే కదా నీవు వివాహమాడినది ? పరమ పతివ్రతను విడిచిపెట్టి నీవు ఇట్లుండుట యుక్తము కాదు. గృహస్థుడనన్నచో నేను ఉపదేశింపనన్న సంశయము చేత వాస్తవస్థితిని దాచి నాతో బ్రహ్మచారినని అబద్ధమాడితివి. అయిన ఆ విషయమై ఎంత మాత్రము చింతింపకు" మని పలికి, లోపలనున్న రుక్మాబాయిని పిలిచెను. రుక్మాబాయి వచ్చి వినయముతో భర్త పాదములమీద వ్రాలి ఏడ్వసాగెను. విఠోభా ఆశ్చర్యముతో ఏమియు మాటాడుటకు తోచక తలవంచుకొని నిలిచియుండెను. శ్రీ పాదస్వామి "ఈమె ఎవరో తెలుపు" మనెను ? విఠోభా మాట్లాడకుండా ఉండిపోయాడు.

శ్రీపాదస్వామి చిరునవ్వు నవ్వి "కుమారా ! ఎందుకు ఆలోచిస్తున్నావు? అరుంధతి, అనసూయ, చంద్రమతి, దమయంతి మొదలగు పతివ్రతా రత్నములతో తులదూగ కలిగిన ధర్మపత్నిని వదలివేసి పైకి సన్యాసివేషము వేసికొన్నందున ప్రయోజనమేమి ? ఈ పరమ పతివ్రత యొక్క మన స్సెంతమాత్రము నొచ్చినను నీ బ్రహ్మోపాసన అంతయము నిరర్థక మగును వేయిమంది సన్యాసులైనను సంసారియగు జ్ఞానికొక్కనికి సమానులు కాలేరు. ఇట్టి ప్రతివ్రతా రత్నముతో సంతత సాంగత్యము కలిగినచో సులభముగా కైవల్యము చూరగొనవచ్చును. ఈమె బాధపడిన

నీవెన్నటికిని వృద్ధిచెందలేవు. సృష్టి స్థితిలయ కర్తలగు బ్రహ్మవిష్ణు మహేశ్వరులు సహితము పరమ పతివ్రత అగు అనసూయాదేవి మహత్త్వమునకు ఆశ్చర్యపడి ఆమెకు పుత్రులైరని వినుచున్నాము.

పతివ్రతల మనసు నొప్పించుట రౌరవాది నరకములకు కారణముసుమా ! నీకు తెలియని ధర్మములు లేవు. నీవు పాండురంగని అనుగ్రహమున జన్మించినవాడవు. ఆచార్యుడు ఒక్కడే రక్షకుడని ఆశ్రయించినవాడవు. ఆధ్యాత్మికతను అంతయు ఆమూలాగ్రముగా నెరిగినవాడవు. నీవంటి ప్రజ్ఞావంతుడు మరియొకడుండడు. ఇట్టివాడవగు నీతో అగ్ని సాక్షిగా వివాహమాడిన భార్యను నిష్కారణముగా విడిచిపెట్టి సన్యాసము పుచ్చుకొన్నావన్న దోషము వ్యర్థముగా ఆరోపింపబడుట మంచిదికాదు. నా మాట విని ఈమెను అంగీకరించి, గృహస్థ ధర్మము అవలంబించి, నాకు సంభవించిన అపవాదమును తొలగించి, కృతార్థుడవై, బ్రహ్మానందమును అనుభవింపుము. అంతర వైరాగ్యవే ప్రయోజనకారిగాని, బాహ్యవైరాగ్యమేమాత్రమును ప్రయోజనకారి కాదు. ఇతర చింత మాని నేను చెప్పినట్లు నడచుకొనుము. నీకు సమస్త శ్రేయములు కలుగును" అని అనేక విధముల బోధించి, అతనిని సమాధానపరచి, అతని జడలను, కాలి గుడ్డలను తీయించివేసి, గృహస్థవేషమునకు తగిన వస్త్రములు కట్టించి తనవద్ద కూర్చుండ బెట్టుకొనెను.

ఇంతలో సిద్ధోపంతు వెలుపలికివచ్చి శ్రీపాదస్వామికి నమస్కరించి "స్వామీ ! నీ కటాక్షమువలన నేడు కృతార్థుడనైతిని. నా పూర్వులెల్లరు

తరించి"రని పలికి అతని గుణములను కొనియాడెను. రుక్మాబాయి స్వామి అనుమతి ప్రకారము తన వికారవేషమును తీసివేసి సముచితప్రకారముగా వస్త్రభూషణముల అలంకరించి, సాక్షాత్తు లక్ష్మీదేవివలె వచ్చి భక్తి ప్రపత్తులతో అచ్చట గూర్చున్న భర్తకును, గురునకును, పితృదేవునకును నమస్కరించెను.

శ్రీపాదస్వామి ఆమెకు బ్రహ్మోపదేశముచేసి, నడవవలసిన పద్ధతులు విశదముగా తెలిపి, వారిని రెండుమూడు దినములచ్చటనే నిలుపుకొని, తరువాత విఠోబాకు చెప్పవలసిన బుద్ధులను అన్నిటిని చెప్పి, ఆశీర్వదించి, వారిని స్వస్థలమునకు వెళ్ళుటకు సెలవిచ్చెను.

విఠోబా గురువును విడిచి వెళ్ళుటకు మనసొప్పక చేతులు జోడించి "స్వామీ ! నన్ను సంసారసాగరములో పడవేయుచున్నారు. భార్య ఉన్నదన్న సంగతిని చెప్పక బ్రహ్మోపదేశమును పొందినందులకు ఈ శిక్ష నాకు విధించితివి కాబోలు ! లేకున్న నన్నిట్లు చేయరు. ఇది తప్పుగా భావించి నాకీశిక్ష విధించుట వాస్తవమయిన, దయచేసి ఈ నేరము ఒక్కదానిని మన్నించి ఏ విధముగానైన నన్ను రక్షింపవలె"నని బతిమాలుచు కంటికి మంటికి ఏకధారగా ఏడ్వసాగెను.

శ్రీ పాదస్వామి ! "నాయనా ! విచారింపకుము. నాకు నీయందు గల ప్రేమాతిశయముతో నీకు నా తపము అంతయు ధారపోసితిని గదా ! దీనివలన నీవొక్కడవే కాక నీపూర్వులందరు సద్గతిని చెందిరి. నీకు త్రిమూర్తుల అంశమున ముగ్గురు కుమారులు, పరాశక్తి అంశమున ఒక్క కుమార్తె జన్మించును. వారివలన నువ్వు ఆనందము పొందుదువు.

నీ భార్యకు నేను పలువురు బిడ్డలు కలుగునట్లు వరమిచ్చితిని కనుక నా మాటను నెరవేర్చుము. పురాకృత సుకృత విశేషముచే నాకు నీవంటి సత్పురుషుని శిష్యునిగా పరిగ్రహింపగలిగిన భాగ్యము లభించినది. నా మాట విని నీవు మెల్లగా స్వస్థలముచేరి నీ భార్యతో కలిసి కాపురము చేయుచుందుము. ఇంతలో నేనును సంచార సమాధిని పూర్తిచేసి నీ వద్దకు వచ్చెదను"నని చెప్పి అతనిని సమాధాన పరచెను.

విఠోబా స్వామికి నమస్కరించి "స్వామీ ! చపల స్వభావము గల సంసార ప్రతిబంధము ఒకవేళ సమాధి నిష్ఠను చెడగొట్ట తలపెట్టినచో బ్రహ్మమన్న దృఢప్రజ్ఞ పోయి అజ్ఞానముచేత గప్పబడి మాయాంధకారమున చిక్కి త్రోవగానక త్రొక్కడ పడవలసి వచ్చునుగదా ? దాని ఏమిచేయవలయునో సెలవి"మ్మని అడిగెను.

స్వామి చిరునవ్వుతో "నాయనా! ఆ విషయమై సందేహింప పనిలేదు. అఖండమై, అవ్యయమై, అవాఙ్మానస గోచరమై, ఆనందమయమై, అద్వితీయమై, సగుణ నిర్గుణమై, అణువై, మహత్తై స్వయంప్రకాశమై, సర్వవ్యాపియై, సర్వాంతర్యామియై, మహావాక్యముల అంతమున వెలుగుచున్నదై, అంతట బ్రహ్మానందదాయకమై వెలయుచున్న పరబ్రహ్మమును నిరంతర తైలధారవలె సవిచ్ఛిన్నమగు నిశ్చలధ్యానముతో హృదయమునందు సంస్మరించుచు, పరమశివుడు సనక సనంద నాదులకును, జనకుడు శుక నారదాదులకును, వసిష్ఠులు శ్రీరామునకును ఉపదేశించిన మహామంత్రమును నిరంతరము జపించుచు, జ్ఞానమే మౌనమనియు, మౌనమే జ్ఞానమనియు తెలిసికొని, సచ్చిదానంద

సామ్రాజ్యము అనుగ్రహించు మహావాక్యము యొక్క ముఖ్యార్థమును విడువక మననము చేయుచున్న ఎడల భవబంధం ఎప్పుడును తలచూప”దని విశదముగా తెలిపి, మాయావరణమును తొలగించి మౌన నిష్ఠాగరిష్ఠుడవై ఉండుమని ఆశీర్వదించి, గురుతుర్యమార్గమును బోధించెను. స్వస్థలమునకు పోవుటకు సెలవిచ్చి, వారిని ఊరిబయటవరకు సాగనంపి వెనుకకు మరలెను. తాను సంచార సమాధిని సాధించుటకై స్వేచ్ఛగా పోయెను.

విఠోబా తన భార్య రుక్మాబాయి, మామ సిద్ధోపంతుతోగూడ పుణ్యక్షేత్రముల దర్శించుచు, పుణ్యతీర్థములను దర్శించి, సత్పురుషులను సేవించుచు కొద్దిరోజులలో అలకావతి చేరెను. రుక్మాబాయి ఆచార్యుడు ఉపదేశించిన ప్రకారము మహావాక్య తాత్పర్యమును గ్రహించి వాటిని పాటించుచు, ఆనందముతో భర్తను సేవించుచుండెను.

శ్రీ విఠోభా రుక్మాబాయి అడవికి ప్రయాణము

సిద్ధోపంతు తన అల్లుడు ఇల్లుచేరుటచే సంతోషమున ఒకనాడు బ్రాహ్మణ సంతర్పణ చేయతలచి, ఆ గ్రామములో నున్న వైదికులకు భోజనమునకు పిలిచెను. విఠోబా సన్యాసము నుండి గృహస్థుడగుటకు అతని అవివేకమును గూర్చి వారు అనేకవిధముల నిందించినారు. అందువలన సిద్ధోపంతు భోజనమునకు చెప్పగానే వారందరూ ఒకచోట సభచేసి, అతనితో “అయ్యా ! నీ అల్లుడు సన్యాసము తీసికొనుట అందరికిని

తెలిసిన విషయమేగదా ! అతడిప్పుడు ఆశ్రమమును వదలి మరల గృహస్థాశ్రమమునకు వచ్చుట శాస్త్రవిరుద్ధముగా ఉన్నది. అమృతస్నానము చేసిన పిదప మద్యపానము చేసినట్లును, వేదాంతశాస్త్రము అభ్యసించిన పిదప కొక్కోకశాస్త్రము అధిగమించినట్లును, బ్రాహ్మణత్వమును పొందినపిదప చండాలత్వమును పొందినట్లును, సర్వోత్కృష్టమగు సన్యాసమును వదలి మరల సంసారకుడయినాడు. అతనితో కూడి మీరును బ్రాహ్మణ్యమునే ముంచుటకు ప్రయత్నించినారు. ఈ ఆచారము శ్రుతి, స్మృతి విరుద్ధమైనది. కావున మేము ఇప్పుడు మీయింట భోజనము చేయుటకు వీలుపడదు. మీ అల్లుని కూతురును మీయింటినుండి వెళ్ళగొట్టి ప్రాయశ్చిత్తము చేసికొన్నచో మీ ఇంట భోజనము చేయుదుము. లేకున్న మిమ్ముగూడ కులమునుండి వెలివేయుదుము. అల్లుడును కూతురును కావలసియున్న నీయిష్టము వచ్చినట్లు నడచుకొనవచ్చు"నని పలికిరి.

సిద్ధోపంతు ఆలోచించి వారితో "అయ్యలారా ! నా అల్లుడు విషయవాంఛల చేత గృహస్థాశ్రమమును స్వీకరించలేదు. గురువుగారి ఆజ్ఞ మేరకు అలా ప్రవర్తించినారు. కనుక అతని అందు దోషము లేదు మీకు తెలియని ధర్మములు లేవు. కనుక దయకల్గి కొంత ఆలోచింపుడు"అని ప్రార్థించెను. వైదికులు కోపావేశపరులై "బాగున్నది, భ్రష్టునితో చేర్చి మమ్మందరను భ్రష్టులను చేయనున్నావు. ఇక ఎప్పుడును మా ఎదుట ఈ ప్రస్తావము ఎత్తకు" అని అతని ప్రార్థనమును నిరాకరించి, విఠోభాను వెలివేసినట్లుగా, ఆవేశముగా తెలిపి అక్కడి నుండి వెళ్ళిపోయిరి.

విఠోభా ఆ విషయమును విని ఎంత మాత్రము విచారపడక ప్రళయకాల వర్షమునకు చలింపని పర్వతమువలె ధైర్యముతో సిద్ధోపంతును చూచి "స్వామీ ! నేనిచ్చటికివచ్చి రాక మునుపే ఇట్టి ఆపదలు సంభవించుట మంచిదికాదు. జీవితాంతం ఈ గ్రామమున ఎట్లుండవలెనో ఆలోచింపుము. ఒక్క నిమిషమయిన ఇక్కడ ఉండుటకు నాకు ఇష్టము లేదు. దయచేసి నాకు సెలవిచ్చినచో అరణ్యమునకు వెళ్ళి నివసింతును. నేను లేకున్న మీకెట్టి యిబ్బందులు లేక ఉండవచ్చు" నని అడిగెను. రుక్మాబాయి "తండ్రి ! మా వలన మీకు అనేక కష్టములు కలుగును. మే మీ సమీపారణ్యమున నివసించుచు, అప్పుడప్పుడు వచ్చి మిమ్ము చూసిపోగలను. దయచేసి మమ్ము పంపుము" అని ప్రార్థించెను. అందుకు సిద్ధోపంతు సమ్మతించెను. విఠోభా తన భార్యయగు రుక్మాబాయితో గూడ బయలుదేరి, కొంత దూరమున నున్న యొక అడవి చేరి అందొక కొండ గుహలో నివాసం ఏర్పరుచుకుని, సర్వదా సమాధి నిష్ఠ అందు మనస్సును నిలిపి బ్రహ్మానందము అనుభవించుచుండెను. రుక్మాబాయి అలకావతికి వచ్చి తల్లిదండ్రులను దర్శించి తమకు కావలసిన భోజన పదార్థములను తీసికొనిపోవుచుండెను.

3. శ్రీ జ్ఞానేశ్వర్‌మహారాజ్ జననం

శ్రీపాదస్వామి కాశికి తిరిగివచ్చి, తన శిష్యుడగు విఠోభాను తలచి, అతనికి ఆదిశక్తి త్రిమూర్తులు బిడ్డలగునట్లు వరమిచ్చుట తలచి, వారు తనకు ప్రసన్నులగుటకై ఏకాగ్రచిత్తతతో ఒక ముహూర్త మాత్రము ధ్యానము చేసెను. వారు ప్రసన్నులై అతని ముందు నిలిచి “పరమహంసోత్తమా ! మా వలన నీకు కావలసిన పనియేమో తెలియచేయు”మనిరి. శ్రీపాదస్వామి కన్నులు తెరచి, వారిని దర్శించి, భక్తితో నమస్కరించి, వారికి అనేక విధముల స్తుతించి, “జగద్రక్షకులారా! సర్వజ్ఞులగు మీకు తెలియని విషయము లేదు. ప్రమాదవశమున స్పృహలు మరచి నా శిష్యుడగు విఠోభాకు తమరు నలువురును బిడ్డలగునట్లుగా వరమిచ్చితిని. ఆ వరము ఎట్లయిన సార్ధకపరచి నన్ను కృతార్ధుని చేయుము” అని ప్రార్థించెను.

విష్ణుమూర్తి చిరునవ్వు నవ్వి, “పరమహంస శిఖామణీ ! ఈ సంకల్పము నీ ప్రయత్నము వలన కలిగినది కాదు. లోకమున ధర్మము నిర్మూలమై జనులు పాపకర్మాచరణము అందు ప్రోత్సాహము కలవారై దుర్మార్గ వర్తనులగుటచే వారిని చక్కపరచి సన్మార్గమునకు తెచ్చి ధర్మము ఉద్ధరించుటకై ముందే మేము నలువురము భూలోకమున అవతరింప నిశ్చయించి యుంటిమి. అందువలన నీకిట్టి సంకల్పమును కలిగించితిమి. విఠోభా సామాన్యుడు గాడు. సాక్షాద్వసిష్టాంశ సంభూతుడు.

పూర్వము దశరథమహారాజునకు లోకరక్షణార్థమై నేనును ఆదిశేషుడును, శంఖచక్రములును కుమారులుగా అవతరించినప్పుడు ఒకనాడు దశరథు అంతఃపురమున తన భార్యలతో సల్లాప సుఖము అనుభవించుచు ఉల్లాసముగా కూర్చుండి యుండెను. అతని తొడ మీద కూర్చుండి నానావిధములగు లీలలు గావించుచు అతనికి ఆనందము కలిగించుచుంటిని. భరత లక్ష్మణ శత్రుఘ్నులును తండ్రి తొడమీద గూర్చుండవలెనన్న అభిలాషచే ఉండిరి. అతడు పరమానంద భరితుడై ఇరువురను తొడలమీదను ఇరువురను వీపు మీదను కూర్చుండబెట్టుకొనెను. నేనును (రాముడు) లక్ష్మణుడు వీపుపై కూర్చుండ తలచి భరత శత్రుఘ్నులను క్రిందికి లాగటానికి ప్రయత్నించితిమి. వారిరువురును తండ్రిని గట్టిగా పట్టుకొని దిగకపోయిరి. మేమిరువురము లేచి ముందు వెనుకల నిలిచి అతని కంఠమును లాగ ప్రయత్నించితిమి. కౌసల్య, కైక సుమిత్రలు సంతోషమును పట్టలేక చప్పట్లు కొట్టి నవ్వసాగిరి. దశరథుడు తనువు పులకరించి, కనుల వెంట ఆనంద భాష్పములు వచ్చెను. ఈ వినోదమును చూచి వసిష్ఠ మహర్షి పరమానందభరితుడై, పుత్రభాగ్యము కంటె అత్యుత్తమ భాగ్యములేదని తలచి, నన్నును లక్ష్మణుని తన వీపులపై కూర్చుండ బెట్టుకుని రాజునకు కలిగిన ఆయాసమును కొంత తగ్గించునట్లు చేసి, తన మనస్సులో దాగి ఉన్న పుత్రకాంక్ష ఒక్క విధముగా చెప్పాలని ఉంది.

నా పాద స్పర్శ వలన అతని కోరిక బయటపడలేదు. “రామా ! నిన్ను పుత్రునిగా పొందు భాగ్యమెన్నడు సమకూడునో ఆనాడు కదా నా

జన్మము కృతార్థతగను" అని ఆనందభాష్పములతో కోరికను తెలిపెను. నేను అతనికి హరి హర బ్రహ్మ రూపములతో దర్శనమిచ్చితిని. అతడు "దేవా ! నీవొక్కడవయ్యు మూడు రూపములతో అగుపడుచున్నావు. పరమపవిత్రుడగు అత్రిమునికి మీరు ముప్వురును పుత్రులై అతనిని స్తుతిపాత్రు ఒనర్చినట్లు నా యందు అనుగ్రహకలిగి ఈ రాజు అనుభవించుచున్న బ్రహ్మానందమును వారును కొంత ప్రసాదించి కృతార్థుని చేయు" మని వినయముతో పలికి, ఆ చెంపలను ముద్దాడెను. అతనికి దివ్యజ్ఞానము ఉదయించెను. అదివరకు తనలో మాటాడుకొన్న మాటలను మరచిపోయి దశరథుని చూచి, "ప్రభూ ! నీ భాగ్యమే భాగ్యము. నీవు మిక్కిలి పుణ్యవంతుడ"వని పొగిడి, మా ఇద్దరిని రాజు తొడమీద కూర్చుండబెట్టి, అతని వద్ద సెలవు తీసుకుని తన ఆశ్రమమునకు పోయెను. తన భార్యతో 'నాకెందులకో పుత్రవ్యామోహము కలిగినది. త్రిమూర్తులను పుత్రులుగా పొందాలన్న కోరిక నన్ను విశేషముగా బాధించుచున్నది. నా మనస్థైర్యమును హరించి వేసిన"దని చెప్పి ఆశ్చర్యపడెను. అరుంధతీదేవి సంతసించి, "స్వామీ ! దేవసభయందు నారదుడు అనసూయాదేవి యొక్క మహత్త్వమును వర్ణించుట విన్నప్పటినుండి త్రిమూర్తులను పుత్రులుగా పొందవలెనని, పార్వతీదేవి హిమవంతునకు పుట్టి పరమశివుని వివాహము చేసికొన్న వైభవమును చూచినప్పటి నుండియు పరాశక్తిని పుత్రికగా పొందవలెనని మిక్కిలి కోరిక కలిగియున్నది. నీతో విన్నవించుటకు భయపడి ఇన్ని దినము మాట్లాడలేద"ని పలికెను.

వారిట్లు సంభాషించుచుండగా దేవలోకమునుండి నారదుడు అక్కడికి వచ్చి, వారి కోరికకు మెచ్చి, "మీ సంకల్పమును, ఇంకను చాలామంది మునుల సంకల్పములును కలియుగమున ఫలించును. ఈ విషయమును బ్రహ్మ బ్రహ్మర్షులతో చెప్పుచుండగా వింటిని. మీ కోరిక నెరవేరును. సంశయము లేదు" అని చెప్పెను. వసిష్ఠుడు నారదునకు తమగుట్టు తెలిసినదనియు అతడు లోకమున కనబడకుండా తగిన సదుపాయమును వెదుకవలెననియు నాలోచించి "స్వామీ ! మే మాదిశక్తి, త్రిమూర్తులను బిడ్డలనుగా కనుటకై కలియుగమున ఉదయించినప్పుడు మాకు తత్వోపదేశము చేయుటకు నీవాచార్యుడవై అవతరించునట్లును అంతవరకు ఈ రహస్యము ఎక్కడను బయట పడకుండునట్లును వరమును అగ్రహింపుము"మని ప్రార్థించెను. నారదుడు అనుగ్రహించితి అనెను.

ఆ కారణముచే నీవిప్పుడు నారదాంశమున అవతరించితివి. అరుంధతీ వసిష్ఠుల అంశమున రుక్మాబాయియు చైతన్యస్వామియును పుట్టిరి కావున నీ సంకల్ప ప్రకారమే మేము నలువురము ఇప్పుడా దంపతులకు బిడ్డలుగా అవతరింప పోయెదము సంశయింప పనిలే"దని చెప్పి అదృశ్యమైరి. శ్రీపాదస్వామి పరమానంద భరితుడై బ్రహ్మానుసంధానము చేయుచుండెను.

విష్ణుమూర్తి పరమశివునితోను, చతుర్ముఖునితోను, పరాశక్తితోను భూలోకమున ధర్మము నశించి ప్రజలజ్ఞానాంధకారములో ఉన్నారని తాము రుక్మాబాయి విఠోబాలకు బిడ్డలుగా అవతరించి జనులకు తత్వోపదేశ యొనర్చి ధర్మమును కాపాడాలని భూమి మీద

అవతరిస్తున్నామని చెప్పిరి. వెంటనే మన్మథుడు విఠోబా మనస్సును కలతపరచి, బ్రహ్మనిష్ఠనుండి మరలించి రుక్మాబాయియందు వ్యామోహమును కలిగించెను. క్రమముగా త్రిమూర్తులును పరాశక్తియును రుక్మాబాయి గర్భమునందు జన్మించిరి.

ఆ దంపతులకు క్రమముగా ఈశ్వరాంశమున అవతరించిన కుమారునకు నివృత్తి దేవుడని పేరు పెట్టిరి. పరమాత్మ విష్ణుమూర్తి అంశమున శ్రీ జ్ఞానేశ్వర్ మహారాజ్ రూపంలో 1197వ సంవత్సరం శ్రావణమాసంలో కృష్ణాష్టమి పుణ్యస్థలమైన ఆళందిలో జన్మించినారు. బ్రహ్మాంశమున అవతరించిన పిల్లవానికి సోపానదేవుడనియు, పరాశక్తి అంశమున ఉదయించిన పాపకు ముక్తాబాయి అని నామకరణములుచేసి, వారిని అనురాగమున పెంచుచు, వారి ముద్దు మురిపములు చూచి మిక్కిలి సంతోషించుచుండిరి.



శ్రీజ్ఞానేశ్వర్ మహారాజ్

శ్రీ నివృత్తినాథ్ మహారాజ్

శ్రీ ముక్తాబాయి

4.శ్రీ జ్ఞానేశ్వర్ మహారాజ్ చిన్నతనము

బ్రహ్మవిద్య అభ్యసించి, అఖండ బ్రహ్మానంద సాగరమున తేలియాడుచు అభేద ప్రతిపత్తియు స్థిరచిత్తయు కలిగి సమాధి అందు ఉన్న చైతన్యస్వామి సృష్టిస్థితి లయములకు కారణకర్తలైయున్న త్రిమూర్తులను, పరాశక్తిని బిడ్డలనుగా కని వారి అందుగల ప్రేమానుబంధముచే బ్రహ్మానందమునుకూడ మరచి ఉండెను. పుత్రవాత్సల్యము అంత పని చేసినది. రుక్మాబాయి వారమునకు ఒక పర్యాయము అలకాపురమునకు పోవుచు పుట్టినింటినుండి తమ భోజనమునకు కావలసిన వస్తువులను తెచ్చుకొనుచు భర్తను, పుత్రులను పోషించుచుండెను. ఆరు సంవత్సరములు ఇట్లు గడచెను. విఠోబా కుటుంబము అభివృద్ధి అగుకొలది సిద్ధోపంతు యొక్క ఆస్తి తరగిపోయి జీవనమునకు ఇబ్బంది అయ్యెను.

ఒకనాడు ఉదయమున నలువురు బిడ్డలును విచ్చలవిడిగా ఆడుకొనుచుండిరి. రుక్మాబాయి చైతన్యస్వామి వారి ముచ్చటలను చూచి ఆనందించుచుండిరి. రుక్మాబాయి భర్తతో తనతండ్రికి సంభవించిన దుర్దశను తెలిపి, తను ఇంక అచ్చట నుండి సరిపడదనియు పట్టణమునకు వెళ్ళినచో ఏదైన కాయకష్టముచేసి జీవనము చేయ వచ్చుననియు తెలిపెను. అతడు సంసారభారమువలన సమాధినిష్ట చెడినదని తలచి “నీవు నీ బిడ్డలను తీసికొని పట్టణమునకు పోయి అచ్చట సుఖముగా ఉండుము. నేను వచ్చినచో మన వారికి కొన్ని కష్టములు కలుగను. కావున నాకు అచ్చటికి వచ్చుటకు ఇష్టము లే”దని చెప్పెను. రుక్మాబాయి “స్వామీ !

ప్రత్యక్ష సుఖానుభవమును ప్రసాదించు భర్తను విడిచిపెట్టివెళ్ళుట, ధర్మపత్నికి యుక్తము కాదు ఒక్క నిముషమైనను నిన్ను వదలి ఉండలేను. ఈ బిడ్డలను తీసికొని వెళ్ళి నా తల్లిదండ్రులవద్ద విడిచి వచ్చెదను. మనకు కొంత భారము తగ్గు"నని పలికెను. విఠోబా సంతసించి, ఆమె బిడ్డలను పట్టణమును విడిచివచ్చు లోపల ఇంకొక వనమునకు వెళ్ళిపోవచ్చునని ఆమె తిరిగివచ్చి చింతాక్రాంతియై పుత్రవాత్సల్యముచేత మరల పుట్టినింటికి పోవుననియు నిశ్చయించి, "నీవు చెప్పిన విషయము యుక్తముగా నున్నది. అట్లే విడిచిర"మ్మనెను. రుక్మాబాయి బిడ్డలను తీసికొని పట్టణమునకు వెళ్ళెను.

చైతన్యస్వామి సంసారమును అనేక విధముల నిందించి, గురుదేవుని స్మరించి, అచటనుండి బయలుదేరి, మరియొక అడవిచేరి, యొక రహస్యస్థలమున కూర్చుండి, కన్నులు మూసికొని, ఇంద్రియము"ను చెదరకుండ నిలిపి, అంతర్నేత్రమును తెరచి, ఆనందమాత్రముగా ఉన్న పరబ్రహ్మమునందు కలిసి, సంకల్ప వికల్పములను అన్నియు నాశనముచేసి, మాయాంధకారము అణచి, మహదానందమున చూసి నివాతదీపమువలె బ్రహ్మనిష్టయగు నిశ్చలత పొంది ఉండెను.

రుక్మాబాయి పట్టణముజేరి తల్లిదండ్రులకు నమస్కరించి, భర్త చెప్పిన విషయమును వారికి తెలిపి, వారికి నచ్చజెప్పి, బిడ్డలను అచట విడిచివెళ్ళుటకు కాళ్ళురాక, విధిలేక వారిని అక్కడ విడిచి, తిరిగిపోయి అడవి నడుమనున్న అడవికి చేరెను. తన భర్త కనబడలేదు. ఏదైన కార్యార్థ ఎక్కడికైనా వెళ్లి ఉండవచ్చునని అనుకొని అతనిరాకకు

నిరీక్షించుచుండెను. సూర్యాస్తమయమయ్యెను. చీకటి పడినప్పటినుండి తెల్లవారువరకు ఆ అడవిలో భర్తకొరకు వెతికెను. కాని భర్త జాడ కనబడలేదు. అతనినిగూర్చి చింతించి, దిక్కుదోచక గట్టిగా ఏడ్చినది. అంతలో సూర్యోదయమయ్యెను. రుక్మాబాయి ఆకాశమువైపు జూచుచు "పరమేశ్వరా ! దీనబంధూ ! నన్ను ఆ ఆపదనుండి రక్షింప నీవుతప్ప సమర్థు లెవ్వరును లేరు. కరుణించి" రక్షింపుమని ప్రార్థించి, అరణ్యమున భర్తని వెదుకసాగెను.

సిద్ధోపంతు ఇంట్లో బిడ్డలు తల్లిదండ్రులను తలచుచు, వెక్కి వెక్కి ఏడ్చుచు, తల్లిబోయిన దారినే చూచుచు, తాత ఎంత బుజ్జగించినను సమ్మతింపక తమ తల్లివద్దకు పోవలెనని చెప్పుచు, ఒకరివెంట ఒకరు తల్లిపోయిన దారిని నడువసాగిరి. అమ్మమ్మ తాతయ్యలు పరుగెత్తిపోయి వారినందరిని తీసికొనివచ్చి, అనేకవిధముల లాలించి, బలవంతముగా అన్నము తినిపించి, నిద్రపుచ్చిరి. బిడ్డలు నిద్రయందును తల్లిదండ్రులను తలంచుకొని కలవరించుచు ఉలికి పడుచుండిరి. సిద్ధోపంతు, అతని భార్య వారికి కలిగిన దుఃఖమునకు చూచి మిక్కిలి బాధపడిరి.

మహారణ్య మధ్యమున ఏకాంతముగా కూర్చుండి బ్రహ్మానుసంధానము చేసికొనుచున్న విఠోభాకు చిత్తవైకల్యము కలిగి సమాధిని చెడగొట్టుటచే అతడు బహిర్ముఖమునకు తిరిగి మనస్సున ఎన్నోరకాలుగా కలవరపడెను. బిడ్డలు జ్ఞప్తివచ్చి, కంటతడిపెట్టి, బిడ్డల ముచ్చటనెల్ల తలచి విచారపడుచు "భగవంతుడా ! నన్నెంతటి దురవస్థల పాలుచేసితివి ? బిడ్డలు బిడ్డలు అను బాధపడువారికి ఒకబిడ్డనైనా ఇవ్వవు

కాని వద్దు అన్నవారికిమాత్రము బలవంతముగా అనేకుల నిచ్చెదవు. ఆహా ! నీ కఠినత్వము ఏమనవలె” ? నని పశ్చాత్తాపపడి, తన బిడ్డలను గూర్చి –

“హా ! నివృత్తిదేవా ! నీచేయిసోకగనే చిత్తము నిశ్చలతపొంది బ్రహ్మానందమును ప్రసాదించునుగదా ?

హా ! జ్ఞానదేవా ! నీపదము సోకినంతమాత్రమున అమోఘములగు మాయాభ్రమలెల్ల తొలగిపోయి దుఃఖములు నశించి అవాఙ్మానస గోచరమగు ఆనంద ఉదయించి పరవశత పొందించునుగదా ?

హా ! సోపానదేవా ! నీతనువు సోకగనే పరమరహస్యమగు తత్త్వమంతయు బయటపడి ఆత్మాస్వరూపము కరతలామలక అగునుగదా?

హా ! ముక్తాబాయీ ! నిన్ను తొడమీద కూర్చుండ బెట్టుకొన్న అణిమాది సిద్ధులెల్ల సులభముగా సిద్ధించుటయేగాక మనస్సు నిర్మల బ్రహ్మానందమును పొందుచుండునుగదా ?

అయ్యో ! ఇట్టిబిడ్డలను పట్టణమున విడిచిపెట్టి రమ్మని ఎందుకు చెప్పితిని. నా అంతటి పాపాత్ముడుండునా ? వారిని చూడకున్న నా ప్రాణములు నిలుచునా ?” అని తలచుకుంటూ , భార్య యొక్క సుగుణసంపదను తలచి బాధపడుతు తనవలన జరిగిన తప్పుకు తన్ను తాను దూషించుకుంటూ, ఏమిచేయుటకును తోచక భక్తిప్రపత్తులతో పరబ్రహ్మమును తలచి, “నాలుగు వేదములకును, ఆరు శాస్త్రములకును, పదునెనిమిది పురాణములకును, ఇరువది ఎనిమిది యాగములకును అందనిదై తత్వవేత్తల ఎరుగ దగి ఉండి లోకములకు సృష్టి

స్థితిలయకారణమై సకల జంతువుల హృదయములందు నివసించునదియు సర్వభూతములకు ఆశ్రయభూతమై నిరంతరము జీవకోటిచేత ఆచరింపబడు పుణ్యపాప మిశ్రకర్మములకెల్ల సాక్షిగా ఉన్న సత్పదార్థమునకు నమస్కరించుచున్నాను.

మాయకు ఆశ్రయమై మాయయందు ప్రతిఫలించిన వైరాజ హిరణ్యగర్భ అవ్యాకృతులకు నియంతయై కల్పనా రూపమగు మనుష్య పశుపక్ష్యాదులచేతను ఇంద్రియములచేతను స్థావర రూపమగు పర్వతవృక్ష గుల్మాదులచేతను విషయములచేతను కలుగుచున్న ప్రపంచ రూపసంసారమునెల్ల భరించిన జీవునకును కూటస్థునకును విలక్షణమై సచ్చిదానంద నిత్యనిర్మలత్వములను పంచలక్షణములు కలదై జ్ఞానజ్ఞానములకు అతీతమై ఉన్న పరమాత్ముని స్మరించుచున్నాను.

గాయత్రి మొదలగు మహామంత్రముల ఆశ్రయమై సకల వికల్ప రహితమై షడ్భావ వికార శూన్యమై గుణాతీతమై ద్వైతవృత్తియు సాక్షివృత్తియు అఖండాకారవృత్తియు లేనిదై వెలయుచున్న పరబ్రహ్మమును సేవించుచున్నాను. నిత్యమై నిర్మలమై జ్ఞానస్వరూపమై మాయాతీతమై శుద్ధ సత్వమై ప్రకాశించుచున్న పరమాత్మను ధ్యానించుచున్నాను.

పరమేశ్వరా ! నేను సంసారమను బంధమున అడవిలో కనిపించక బాధపడుతున్నాను. నన్ను రక్షింపగల పరమదయాళుడవు నీవే. నీవు దాక్షిణ్యనిధివి; సదానందుడవు; సర్వార్థప్రదుడవు; నిర్వికల్పుడవు; నిర్గుణుడవు; నిరామయుడవు; నిశ్చలుడవు; నిరంజనుడవు; నిర్మలుడవు; నిన్ను సేవించువారి కెట్టి ఆపదలును రావు. నన్ను రక్షింపు"అని అనేక

విధముల ప్రార్థించెను.

ఆకస్మికముగా అశరీరవాణి "విఠోబా ! విచారపడకుము. కష్టములు తొలగిపోయి సుఖము అనుభవింపగల"వని చెప్పెను. విఠోబా ఉలిక్కిపడి పులకరించి ఆనందాతిశయమున విస్మృతినొంది కూర్చొనిఉండెను. రుక్మాబాయి అతని వెదకుచు దైవయోగమున ఆచ్చటికి వచ్చి, పరమానంద భరతియై "ప్రాణనాథా ! నన్నిట్లు మోసపుచ్చి రావచ్చునా !"అని అతని పాదములు మీదబడి ఏడ్వసాగెను. విఠోబా ఉలికిపడి లేచి, భార్యను చూచి, ఆమె యోగక్షేమములను విచారించి, బిడ్డల మంచిచెడ్డలను గూర్చి విచారించెను. బిడ్డల వద్దకు వెళ్ళి, వారి విషయము చూడమని చెప్పెను. కాని ఆమె అతనికి కందమూలాదులను తెచ్చి సమర్పించుచు తప్పించుకొని పోవునను భయముచే అతనిని కనిపెట్టుకొని ఉండెను. ఇట్లు మూడుదినములు గడిచెను. నాల్గవదినమున విఠోభా "సతీమణి ! మనల చూడకుండుటవలన బిడ్డలు బాధపడుచుందురు. నీతల్లిదండ్రులు బాధపడుతుంటారు. నేను పూర్వమున్న పర్వత గుహకు వచ్చెదను. నీవుపోయి బిడ్డలను చూచి ఆదరించిరమ్ము. నే నచ్చటనే ఉండెదను. మోసపుచ్చి వెళ్ళుదునని ఎంతమాత్రము సంశయింపవల"దని ఆమెను సమాధానపరచి ప్రయాణముచేసెను. రుక్మాబాయి అచటినుండి బయలుదేరి అలకావతి చేరి తల్లిదండ్రులకు నమస్కరించి, అత్యంత ప్రీతితో బిడ్డలను ముద్దాడి, అడవి నుండి తెచ్చిన మధుర ఫలములను వారికిచ్చి, మంచిమాటలతో బుజ్జగించి, మరలిపోయి, భర్తకావిషయమును తెలిపి సంతసింపజేసెను. చైతన్యస్వామి అభ్యాసయోగము

వృద్ధియగు కొలది పుత్రవ్యామోహమును దగ్గించుచు బ్రహ్మానందము అనుభవించుచుండెను.”

అలకాపురమున సిద్ధోపంతునకు వార్ధక్యదశ ఎక్కువయ్యెను. ఆస్తియంతయు కరిగిపోయెను. భిక్షాటనము ఆరంభించి దొరికినదానితో సంతుష్టి చెంది కాలము గడిపెను. జ్ఞానదేవు ఒకనాడు తన తాత పడుచున్న కష్టములను చూచి అతనితో తానును భిక్షాటనమునకు బయలుదేరి, ఊరులోని ప్రజలను చూసెను. అసమాన సౌందర్య సౌకుమార్యములతో అలరుచున్న జ్ఞానదేవునియొక్క ముఖమును చూచినవారు అందరు జాలిపడుచుండిరి. అతనిని ఎత్తుకొని చెక్కులు ముద్దాడుచుండిరి. కావలసిన పదార్థములనెల్ల తెచ్చియిచ్చుచుండిరి. సిద్ధోపంతు ఎక్కువగా తిరిగి అలసిపోవలసిన లేక దొరకుచున్న అన్నాన్ని మూటలుగట్టి మోసికొనిపోయి యిల్లు చేర్చుచుండెను.

ఒకనాడు సిద్ధోపంతు పదార్థములు ఎక్కువగుటచే మోయలేక ఒకవీధి అరుగుమీద కూర్చుండి విచారపడుచుండెను. జ్ఞానదేవుడు “తాతా ! విచారించుట ఎందుకు ? నేను సగము మోసికొని వత్తును మూటగట్టి యి”మ్మని బలవంతపెట్టెను. సగము సామగ్రి వేయించుకొని మూటగట్టి నెత్తిమీద ఉంచుకొని మోయుచు అతనివెంట నడచుచుండెను. కొంతదూరము పోగా కాలికి దెబ్బతగిలి క్రిందబడెను. మూట విడిపోయి పదార్థములు వీధిపొడుగునను పడెను. అతడు తన తాత చూచిన కోపించునని, క్రిందబడిన పదార్థములను తొందర తొందరగా ప్రోగుచేయుచుండెను. సిద్ధోపంతు కొంతదూరము పోయి, వెనుదిరిగి

చూచి, పదార్థముల ప్రోగు చేయుచున్న మనుమని చూచి, కోపించి, "ఓరీ ! చేతగాని పనికి ముందుకు వచ్చితివి. పదార్థములను మట్టిపాలు చేసితి"వని గద్దించి, గట్టిగా, నెత్తిమీద ఒకదెబ్బ కొట్టెను. జ్ఞానదేవునకు కోపమువచ్చి సిద్ధోపంతును చేతితోబట్టి వెనుకకు ద్రోసెను. వృద్ధుడగు సిద్ధోపంతు బాలుని త్రోపునకు నిలువలేక మూటమీద వేసికొని వెల్లకిలబడి మెల్లగా లేచి "ఓరి దుర్మార్గుడా ! కష్టపడి పెంచిన నన్నింతపని చేయుదువా?" అని కోపంగా చూచి బాలుని సమీపించపోయెను. బాలుడు పరుగెత్తసాగెను. సిద్ధోపంతు వానివెంటబడి జుట్టుబట్టి నోటికి వచ్చినట్లు తిట్టుచు వంగదీసి వీపుమీద నాలుగైదు దెబ్బలు వేసెను. జ్ఞానదేవు ఆ దెబ్బలకు తాళలేక పెద్దపెట్టున ఏడ్వసాగెను.

ఆకాశమార్గమున విమానము లెక్కిపోవుచున్న దేవత లీ దృశ్యమును చూచి భగవానుని కపటనాటకమునకు ఆశ్చర్యపడి "భక్తవత్సలా ! ఈ వృద్ధుని బాధనుండి తప్పించు కొనలేక చిక్కినది చూడగా ఆశ్చర్యకరముగా ఉన్నది. ఈ వృద్ధుడు కాలయవనునకంటె సమర్థుడా ? కువల యాపీడనముకంటె బలిష్ఠుడా ? ఈ పదార్థముల మూట గోవర్ధన పర్వతమునకంటె బరువైనదా ? నిన్ను నీవైమైన మరిచి ఉన్నావా? లేక లీలా వినోదములను చేయుచుంటివా ? కాదు నీశక్తి నీభక్తుల విషయమై సాగదని తెలియుచున్నది. ఆహా ! నీవు కపట నాటక సూత్రధారి"వని అతని మహత్త్వమును కొనియాడిరి.

జ్ఞానదేవుడు తాతకు భయపడి తన తప్పుకు క్షమించమని అడిగెను. ఆ దారిని పోవుచున్న జనులచ్చుటికివచ్చి సిద్ధోపంతుతో "ఏమయ్యా !

ముసలివాడవే ! కొంచమైనను కనికరము లేక బాలునిట్లు బాదుచున్నావే ! ఎంత కఠినుడవు ! ఇక చాలింపు”మని పలికి జ్ఞానదేవుని విడపించిరి. సిద్ధోపంతు క్రిందబడిన సామగ్రినెల్ల ప్రోగుచేసి మూటగట్టి యొక్క కూలివానితో మోపించుకొని ఇంటికి వెళ్ళెను. జ్ఞానదేవుని తప్పుకు తాను శిక్షించిన విధమును భార్యతో జెప్పి, పశ్చాత్తప్తుడై, వంటయైన వెంటనే స్నాన సంధ్యాదు లొనర్చి, బిడ్డలనందరను తనప్రక్క కూర్చుండపెట్టుకొని భోజనము చేసెను.

5. జ్ఞానదేవుడు బ్రాహ్మణుల గర్వము అణచుట

ఒకనాడు పట్టణమున ఒక ధనికుడు బ్రాహ్మణ సంతర్పణము చేయించెను. సిద్ధోపంతు నలువురు బిడ్డలతో కూడ అక్కడికి పోయెను. బ్రాహ్మణులు వారిని చూచి కోపావేశపరులై సిద్ధోపంతుతో "ఏమయ్యా ! నీకు తెలివియున్నదా ? లేదా ? కులభ్రష్టునకు పుట్టిన బిడ్డలను వెంటబెట్టుకొనివచ్చి బ్రాహ్మణపంక్తిలో కూర్చున్నావు. వీరిని పంపివేయుము. లేకున్న నిన్నేమిచేయుదుమో చూడు"మని బెదరించిరి. చిన్నపిల్లలను బలవంతముగా చేతులుపట్టి లాగి బయటికి తోసివేసి, తక్కిన బ్రాహ్మణులను విస్తళ్ళముందు కూర్చుండపెట్టి, పదార్థములను వడ్డించిరి. వారు భోజనము చేయుటకు సిద్ధపడిన సమయమున నివృత్తి దేవుడు వద్దని వారించుచున్నను వినక జ్ఞానదేవుడు మెల్లగా లోపలికి వెళ్లి పంక్తి మధ్య ఒకవిస్తరిముందు కూర్చుండెను. బ్రాహ్మణులెల్ల సంసర్గదోషము సంభవించినదని అవపోశనములను క్రింద వదలివేసి లేచిరి. కొందరు జ్ఞానదేవుని కొట్టి, తిట్టుచుండిరి. సిద్ధోపంతు ముందుకువచ్చి, "అయ్యలారా ! కోపించనేల ? మంచిచెడ్డలు ఎరుగని పసిపిల్లవాడు లోనికి వచ్చినంతనే దోషము కలుగునా ? తొందరపడి పసిపిల్లవానిని కొట్టి తిట్టుటవలన ప్రయోజనమేమి ? అన్యాయముగా ప్రవర్తించినచో తప్పక హాని సంభవించు"నని చెప్పెను.

బ్రాహ్మణులు అందుకు మండిపడి, "ఓహో ! పోనిమ్మని నీ విషయమై ఉపేక్ష చేసినందువలన ఇంతవరకు వచ్చినది. కుల భ్రష్టునకు పుట్టిన పిల్లల ఇంట ఉంచుకొని వారితో కలిసిమెలసి ఉన్నందున నిన్ను

జాతిలోనుండి వెలివేసితిమి. ఇచటినుండి వెడలిపొ”మ్మని పలుకుచు మెడపట్టి బయటకి నెట్టసాగిరి. సిద్ధోపంతు కోపించి తన చేతనున్న పంచపాత్రను వారిమీద విసిరివేసెను. విప్రులు యమకింకరులవలె సిద్ధోపంతును కొట్టి నేల పడద్రోసిరి. జ్ఞానదేవుడు కోపావేశపరుడై బ్రాహ్మణులతో “దుర్మార్గులారా ! బ్రహ్మజ్ఞానము కలవారుకదా బ్రాహ్మణులు ? మీవంటి భ్రష్టులు బ్రాహ్మణు లెట్లగుదురు ? మీ అందు కిరాత ధర్మము లున్నవే కాని బ్రాహ్మణధర్మము ఒక్కటైనను లేదు. ‘అహింసయే పరమధర్మ’మను వచనము ఎంతమాత్రమును పాటింపని పాపాత్ములకు బ్రాహ్మణత్వము ఎట్లుదక్కును ? పెద్దవాడన్న కనికరముగూడ లేక జంతువును కొట్టినట్లు కొట్టితిరి. మీకు తగినశాస్తి చేయుదు”నని పలికి యొక దుడ్డుకఱ్ఱ తీసికొని ఎవ్వరిని దగ్గర చేరనీక బిసబిస విసరసాగెను. బ్రాహ్మణులు విజృంభించి, అట్టహాసము చేయుచు, కఱ్ఱలుదీసికొని జ్ఞానదేవుని చుట్టి కొట్టుటకు ప్రయత్నించిరి.

నివృత్తి దేవుడు వెంటనే వచ్చి, “అయ్యలారా ! శాంతించి, అక్రమమును మాని న్యాయమును విచారింపు”డనెను. విప్రులు కోపావేశపరులై “యధాబీజం తధాంకుర” మన్న లోకోక్తితప్పునా ? పిల్లవాండ్రని వీరి ఉపేక్షంపచేసినచో మన కులములు భ్రష్టుపట్టును. కావున ముందు వెనుక చూడక వీరిపని పూర్తి చేయవలయును. లేనిచో మన బ్రాహ్మణ్యము మునిగి పోవు”నని నిశ్చయించి, నివృత్తి దేవునిమీదను జ్ఞానదేవునిమీదను పడి కొట్టబోయిరి. జ్ఞానదేవుడు కండ్లెఱ్ఱజేసి, రక్కసులమూకతో జొచ్చిన ఆంజనేయునివలె బ్రాహ్మణసంఘములో జొచ్చి

చేతయున్న కఱ్ఱతో వారిని కొట్టెను. ఆ దెబ్బలకు కొందరికి తలలు, మొలలు, ముక్కులు, చెవులు, పక్కలు, పిక్కలు, రొమ్ములు, కాళ్ళు, చేతులు, మూతులు పగిలి అతనియెదుట నిలువలేక చీకాకుపడి పారిపోయెను. కొందఱు శరణాగతులై రక్షింపుమని ప్రార్థించిరి. కొందరు పరుగెత్తిపోయిరి. కొందరు క్రిందబడి విలవిల తన్నుకొనుచుండిరి. కొందరు మాటున తలదాచుకొనుచుండిరి. కొందరు పశ్చాత్తాపపడుచుండిరి. అతడిట్లు కొలది నిమిషములలో పొగరుబోతు బ్రాహ్మణులయొక్క పొగరు అణచివేసి సింహముపిల్లవలె అటు నిటు తిరుగసాగెను.

నివృత్తి దేవుడువచ్చి జ్ఞానదేవుని చేయిపట్టుకొని “సర్వజ్ఞమూర్తీ ! మనము ఇప్పుడు ఈ లోకములో నీ విధముగా అవతరించుటకు కారణమేమి ? ఇప్పుడు నీవు చేసిన పనియేమి ? ఇది అధర్మములకెల్ల పుట్టినిల్లయిన కలియుగము కాదా? ఈ యుగమునందు ధర్మము ఉండదని తెలియదా ? పైకి వేషము వేసికొని బ్రాహ్మణులమని పేరుపెట్టుకొని లోకమును భ్రమింపచేయు వంచకులే తరచుగా అంతటను నిండియున్నారు. నిజమైన బ్రహ్మవేత్తలు లేరు. కావున మన మీవేషధారులకు తగినట్లుగా ఆషాఢభూతి వేషము వేసికొని మెలకువగా కార్యమును నెరవేర్చవలయును. మన మహత్త్వమును బయటపరచుటకు ఇది సమయము కాదు. ఇంకను కొంతకాలము నిరీక్షింపవలెను. లేకున్న కార్యము చెడిపోవును. చెడిన తరువాత చక్కపరచుట మిక్కిలి కష్టము. లోకతంత్రము అంతయు జరుపుటయందు అఖండ పాండిత్యమునగల మహాత్ముడవగు నీకు నేను చెప్పగలిగినంతటి సమర్థుడనా?”అని పలికి,

కోపమును తగ్గించుకొమ్మని, అందరిని తీసికొని ఇల్లుచేరెను.

బ్రాహ్మణులందరు తమని బాధించిన దుష్టులకు తగిన శాస్తి చెయ్యాలని, ఆ పట్టణపురాజు సముఖమునకు వెళ్లి తమకు కలిగిన ఆపదను విన్నవించుకొని, సిద్ధోపంతును అతని మనుమలను శిక్షించి సకుటుంబముగా అతనిని దేశమునుండి బహిష్కరించి తమని రక్షించుమని ప్రార్థించిరి. రాజు వారి దేహములనుండి కారుచున్న రక్తమును చూచి, కోపించి, బ్రాహ్మణులను హింసించిన దుర్మార్గులను శిక్షించుట న్యాయమని, సిద్ధోపంతును మనుమలతో సహా తనవద్దకు తెమ్మని రాజభటులకు ఉత్తరువు లిచ్చిపంపెను. వారు సిద్ధోపంతు ఇంటికి వెళ్లి రాజాజ్ఞ తెలియజేసి, లేచి రావలసినదని తొందరపెట్టిరి.

జ్ఞానదేవుడు బయటికివచ్చి భటులను జూచి, తమ తాత, బ్రాహ్మణులు కొట్టిన దెబ్బలచేత నడువ శక్తిలేక ఉన్నాడు. కనుక అంతదూరము నడచి రాలేడనియు, ఇప్పుడు వారిని విడిచి తక్కిన వారు వచ్చుటకు వీలు లేదనియు, అందరికి బదులుగా తానొక్కడనే వచ్చెదననియు చెప్పి, వారితో బయలుదేరుటకు సిద్ధపడెను. రాజభటులు లోనికివెళ్ళి సిద్ధోపంతు స్థితినిజూచి చేయునది లేక జ్ఞానదేవునిని మాత్రము తీసికొనివెళ్ళిరి.

జ్ఞానదేవుడు నిండుకొలువున్న రాజునుచూచి, ఎంతమాత్రము భయపడక అతనిముందు నిలుచుండి, గంభీరముగా "సముఖమునకు పిలిపించిన కారణమే"మని అడిగెను. రాజు అతని నిర్లక్ష్యమునకు కోపించి, తగినశాస్తి చెయ్యాలని "నీవును నీసోదరులును కలిసి అక్రమముగా ఈ

బ్రాహ్మణుల మీదబడి బాధపెట్టిన విషయమును విచారించి శిక్షించుటకే పిలిపించితి” అనెను. జ్ఞానదేవుడు “రాజా ! నీవీవిషయమును నెమ్మదిగా ఆలోచింపవలెను. మావలన ఏదైనా నేరమున్న మమ్ము శిక్షింపవచ్చును. వీరివలన నేరమున్న వీరిని శిక్షింపవచ్చును. మేము సంతర్పణమునకు వెళ్ళగానే వీరు మమ్ము చూచి నిష్కారణముగా పంక్తిలో కూర్చుండబెట్టమని వాదించి నిరపరాధియు, వృద్ధుడునగు మా తాతను ప్రాణము పోవునట్లుగా గొట్టి, న్యాయము చెప్పవచ్చిన మా అన్నను నిష్కారుణముగా కొట్టి, మమ్మందరిని పూర్ణాహుతిలో వేయ తలపెట్టిరి. విషయమును విచారించి తెలిసికొనక మునుపే శిక్షింప ఎంచు కోపస్వభావముగల నీ సుముఖమున వాస్తవస్థితిని తెలియచేయుటకు వచ్చితిని.

రాజులకు నీతి, మంత్రులకు ఆలోచన, గురువులకు జ్ఞానమును, స్త్రీలకు మానమును ముఖ్యమైనవి. కోప స్వభావముగల రాజును, తప్పులు చెప్పెడి బ్రాహ్మణుడు తప్పక నరక అనుభవింతురు. వాది ప్రతివాదనలు విని విచారించి నిశ్చయించి నిశ్చయస్థితి తెలిసికొనక మునుపే చెప్పుడు మాటలు విని కోపబడుట రాజులకు మంచిది కాదు. కోపమువలన సత్యా సత్యముల ఎరుగగలిగిన వివేకము నశించును. వివేకము లేకున్న న్యాయము చెడును, న్యాయము చెడిన ప్రజలకు ప్రభువుపై ద్వేషము కలుగును. ద్వేషము వలన దేశ క్షోభ కలుగును. దేశక్షోభ గలిగిన ప్రతిపక్షులు దేశము ఆక్రమింతురు. కావున రాజు ఎప్పుడును న్యాయవిచారణవ అందు శాంతము వహింపవలె”నని పలికి అతని మాటలు విని రాజు మనస్సును నిమిషమాత్రమున కరగించెను.

రాజు జ్ఞానదేవుని మాటలు విని, కోపం తగ్గించుకొని ప్రసన్నవదనుడై బ్రాహ్మణులవైపు తిరిగి "అయ్యలారా ! వీరిని మీపంక్తిలో ఉంచుకొనక త్రోసిపుచ్చుటకు కారణమే"మని అడిగెను. కొందరు బ్రాహ్మణులు లేచి "ప్రభూ ! మా మనవి చిత్తగించవలెను. ఈ పిల్లవాండ్ర తండ్రి విఠోభా అనునతడు సిద్ధోపంతు యొక్క కుమార్తెను వివాహము చేసికొని కొంత కాలమునకు సంసారమును ఇష్టపడక భార్యను విడిచి కాశీకిపోయి అక్కడ ఒక పరమహంస ఆశ్రయించి సన్యాసము దీసికొని అభక్ష్య భక్షణముజేసి జాతి భ్రష్టుడైనది గాక ఇంద్రియ వికారములకు లోనై సన్యాసమును వదలి మరల సంసారమున ప్రవేశించి ఆశ్రమభ్రష్టతనుగూడ పొంది కొన్నిదినముల క్రిందట ఇచ్చటికి వచ్చినాడు. మేము వాని సంగతులనెల్ల విచారించి, ధర్మశాస్త్రములనెల్ల పరిశీలించి, అతనిదోషమునకు ప్రాయశ్చిత్తము లేనందున అతనిని జాతి నుండి వెలివేసితిమి. అతడు ఉన్న పట్టణమును వదలి తనభార్యతో గూడ సమీపారణ్యమునకు వెళ్ళి అక్కడ నివాసము చేయుచుండగా అక్కడ అతనికీ పిల్లలు పుట్టిరి. కావున వీరిని మా పంక్తిలో కూర్చుండ పెట్టుకొని భోజనము చేయుటకు వీలులేకపోయినది. వీరి తండ్రికి ప్రాయశ్చిత్తము విధింపబడనప్పుడు వీరికి ఎక్కడనుండి కలుగును. అందువలన వీరిని మేము త్రోసివేసితిమి. ఈ విషయమున సంశయము కలిగినచో ఆస్థానపండితులను విచారించిన వీరు దోషులైనదియు, నిర్దోషులైనదియు వారే వివరముగా తెలియచెప్ప గల"రని పలికిరి.

జ్ఞానదేవుడు అందులకు “మహాప్రభూ ! బ్రహ్మజ్ఞానసంపన్నుడే బ్రాహ్మణుడనియు ఇతరులగు, బాహ్యవేషధారులెల్ల బ్రాహ్మణులు కారనియు వేదము విధించుచున్నది. అట్టి వేదవచనము అనుసరించి మా తండ్రి పరమహంస ఆశ్రయించి, బ్రహ్మజ్ఞానమును సంపాదించి, ఆచార్యుని ఆజ్ఞానుసారము మరల గృహస్థాశ్రమము అవలంబించిన విషయమున అతనికి వర్ణాశ్రమ భ్రష్టతగలిగిన అనుట విశ్వసించుటెట్లో విచారింపవచ్చు”అనెను. అందుకు బ్రాహ్మణులు సన్యాసమును పరిత్యజించి సంసారవృత్తి అవలంబించుట గొప్ప దోషమనియు దీనికి ప్రాయశ్చిత్తమే లేదనియు శాస్త్రములందు విధింపబడియున్నది. అట్టి విధికి వ్యతిరేకముగా నడచినవాడు నిర్దోషి కాక మానడు, సన్యాసికి విధినిషేధములు లేకపోవుటచే చిక్కినచోట స్వేచ్ఛగా యభక్ష్య భక్షణము చేయవచ్చును. గనుక కర్మిష్ఠులను బ్రాహ్మణ శ్రేష్ఠుల పంక్తికు అతడు యోగ్యుడు కాకపోయినా”డని పలికిరి.

జ్ఞానదేవుడు “పరమహంస అభక్ష్య భక్షణము చేసినను బ్రాహ్మణులు పంక్తిలో కూర్చుండబెట్టుకొని భుజింపవచ్చుననియు, అట్లు భుజించుట వలన అందఱును పవిత్రులగుదురనియు శాస్త్రములు చెప్పుచున్నవి. నియమము తప్పక ఆశ్రమధర్మము అనుష్ఠించిన మా తండ్రి ఎట్లు ధర్మభ్రష్టుడయ్యెనో తెలియకున్నది. పూర్వము గొప్పవారు అనేకులు చాలకాలము అరణ్యములందు నివసించియు దేశాటన మొనర్చియు సన్యాసము స్వీకరించియు మరల సంసారధర్మము అవలంబించి లోకమున గౌరవింపబడలేదా ? పరమహంసయై పరమోత్కృష్టతను వహించిన

ఋష్యశృంగుడొక రాజకూతురును వివాహమాడలేదా ? సన్యాసము తీసికొని చాలాకాలము అరణ్యములో తపమాచరించిన అగస్త్యుడు లోపాముద్రను పెండ్లాడలేదా ? అంతటి గొప్పవారట్లు నడచియుండగా మాతండ్రి అందలి దోషమేమి ? బ్రహ్మవేత్తలకు జాతిభేదములు కలవని ఏ శాస్త్రములందు విధింపబడినది ? అట్లు విధింపబడి ఉన్నచో చండాలస్త్రీని వివాహమాడిన వసిష్ఠుడును, బోయకాంతను వివాహమాడిన వాల్మీకియు, పల్లెవాని కడుపునపుట్టిన వ్యాసుడును, చండాలునకు శిష్యుడై అతని యుచ్ఛిష్టమును స్వీకరించిన నారదుడును వర్ణభ్రష్టులై ఉండవలసిన వారే కదా ? వారి కెవ్వరికిని సంభవింపని దోషము మా తండ్రికెట్లు సంభవించినది ? మాతండ్రి అభక్ష్య భక్షణము చేయగా చూచినవారెవ్వరు ? వ్యర్థమైన అపవాదమును మోపి పరమసాధువునకు అన్యాయము చేయతలపెట్టిన దేవుడు తప్పక శిక్షిస్తాడు ?

మహారాజా ! మా తండ్రి బ్రహ్మజ్ఞానము సంపాదించుటకై కాశికిబోయి, అచట కొన్నిదినములుండి, తగిన ఆచార్యుని వెదకుచు, బ్రాహ్మణోత్తముడగు శ్రీపాదస్వామి అను పరమహంసను ఆశ్రయించి, అతనివద్ద తత్వోపదేశముపొంది, సర్వసంగ పరిత్యాగము చేసికొని, సన్యాసము స్వీకరించి, సచ్చిదానంద వస్తువునందు కలిసి సదా ఆనందము అనుభవించుచు, గురును ఆజ్ఞ అతిక్రమింపలేక మరల గృహస్థాశ్రమమున ప్రవేశించినాడు. కాని విషయవాంఛ చేత ఎంతమాత్రమును సన్యాసమును విసర్జించి సంసారి కాలేదు. ఈ విషయములు తెలియక వీరు మా తండ్రిమీద నిర్నిమిత్తముగా దోషారోపణము చేయుచున్నారు. గుణమొక్కటే

ప్రధాన మనియు కులము ప్రధానము కాదనియు వేదాంత శాస్త్రములందు చెప్పబడిన వచనములను పరాశర వ్యాస వసిష్ఠాది మహర్షుల చరిత్రములే ప్రత్యక్ష నిదర్శనములు. ఇక మీ ఇష్టం వచ్చినట్లుగా చేయవచ్చు"అని రాజుతో చెప్పెను.

జ్ఞానదేవు మాటలను విని, సంతసించి, అతనికి సవినయముగా నమస్కరించి, కౌగిలించి, అతని ఉచితాసనమున కూర్చుండబెట్టి "స్వామీ! నీవు దైవాంశ సంభూతుడవు. కానిచో అయిదేండ్ల వయస్సులో ఇంతటి తెలివితేటలుండవు. ఇక పెద్దవాడవైనచో నీతో ప్రతిఘటించి మాటాడునంతటి ధీరు లీలోకమున ఉండరు. తోటి బ్రాహ్మణులైనను నీ కాలిగోటికి సాటికారు. నేడు నా అదృష్టంచే నీ దర్శనము లభించినది. అజ్ఞానవశమున వీరి మాటలు విని మీకు ఆజ్ఞ చేసితిని. నాయందు పరిపూర్ణ కటాక్షముంచి నా నేరమును క్షమింపుము" అని ప్రార్థించెను. కొందరు భటులను పిలిచి, పసిడి పల్లకీలని తీసుకొని వెళ్ళి, జ్ఞానదేవుని సోదరి సోదరులను వానిలో కూర్చుండ పెట్టుకొని తీసికొని రావలసినదని ఉత్తరువు చేసి పంపెను. రాజభటులు పోయి నివృత్తి దేవుని, సోపాన దేవుని, ముక్తాబాయిని పసిడి పల్లకీల మీద కూర్చుండబెట్టుకొని సగౌరముగా రాజసభకు తీసికొనివచ్చిరి. రాజు లేచి నమస్కరించి వారిని ఉచితాసనములపై కూర్చుండబెట్టి వారు ఉపన్యసించిన నీతి విషయములను విని పరమానందమును పొంది "ఇట్టి మహానుభావులు ఇక్కడ ఉండుట నా భాగ్యము. మీ దర్శనమువల్ల నాజన్మము పవిత్రమైన"దని వారిని కొనియాడి, వారికి ధన కనక వస్తువాహనాదులను ఇచ్చి, బ్రాహ్మణులను

చూచి “అయ్యలారా ! మీరు నాపై దయకలిగి నిర్దోషులగు ఈ సత్పురుషులను మీలో చేర్చుకొని ద్వేషమును వదలిపెట్టి నన్ను కృతార్థునిగా చేయవలయు”నని వేడి, వారికి కొన్ని వరహాలిచ్చి వారిని సత్కరించిపంపెను.

నివృత్తిదేవుడు మొదలగువారు బంగారు పల్లకీలమీద ఇల్లుచేరి, తమకొరకు ఎదురుచూస్తూ సిద్ధోపంతునకు నమస్కరించి, జరిగిన విషయమును వివరముగా తెలిపిరి. సిద్ధోపంతు వారి ధైర్యస్థైర్యములకు మెచ్చి వారిని ఆశీర్వదించి వారి వైభవమును చూచి సంతోషింపసాగెను.

మరునాడు బ్రాహ్మణులందఱు రాజు సముఖమునకుపోయి, పైఠణపురిలో తమ ప్రధానాచార్యుడు ఉన్నాడనియు, ఆయన సముఖమునకు విఠోబాను సకుటుంబముగా పంపి ప్రాయశ్చిత్తము చేయించుకొని అతనివద్దనుండి సమాధాన శ్రీ ముఖమును తీసికొని వచ్చునట్లు చేయవలెననియు, అట్లు చేసినచో నిరాటంకముగా అతడు కులములో చేరవచ్చుననియు తెలిపిరి.

రాజు సిద్ధోపంతును పిలిపించి, బ్రాహ్మణులు చెప్పిన సంగతిని వినిపించి, విఠోబాను అతనిభార్యను తీసికొని రావలసినదనిచెప్పి, రెండు పల్లకీలనిచ్చి – కొందరు భటులను అతనివెంట పంపెను. సిద్ధోపంతు తన మనుమలను మనుమరాలిని వెంటబెట్టుకొని బయలుదేరి అడవిలో ఉన్న విఠోబాను కనుగొని, తన మనుమలు విజృంభించి బ్రాహ్మణుల గర్వభంగముచేసి గౌరవము పొంది అఖండ సంపదను పొందిన విషయములను వివరించెను. “మహారాజు నిన్ను చూడదలచి పిలుచుకొని

రమ్మనెను. గనుక దయచేసి నా వెంట రావలె"నని చెప్పెను. విఠోబా నవ్వి, "వనములో నివసించువారికి పట్టణమున నివసించుట ఇష్టముండదు. కావున నన్ను నిర్బంధపరచుటవలన ప్రయోజనము లేదు. నామాటవిని యెట్టి విచారమును మనస్సున నుంచక పిల్లవాండ్రతోగూడ అలకాపురమునకు పోయి, దైవానుగ్రహము వలన కలిగిన భాగ్యము అనుభవించుచు సుఖముగా నుండు"మని చెప్పి, కుమారులను చూడక మౌననిష్ఠ వహించి బ్రహ్మానందమున మునిగి యుండెను. సిద్ధోపంతుకు ఏమి తోచక బాధపడెను. జ్ఞానదేవుడు అతనితో "తాతా ! ఈ విషయమై బాధపడవద్దు. నీవు భటులను తీసికొని మెల్లగా పట్టణమునకు వెళ్ళుము. నేను నాలుగు దినములలో మా తండ్రిని ఒప్పించి సమాధానపరచి రాజ సముఖమునకు పిలుచుకొని వత్తు"నని పలికి అతనిని సమ్మతింపజేసి పంపెను. సిద్ధోపంతు రాజువద్దకు వెళ్ళి "చైతన్యస్వామి నాలుగు దినములలో వచ్చు"నని చెప్పెను.

6. శ్రీ జ్ఞానేశ్వర్ మహారాజ్ - విఠోభాల మధ్య వాదన

జ్ఞానదేవుడు తనతండ్రితో కొన్ని విషయములు చర్చింపదలచి, బ్రహ్మానందమున చేరి తన్మయుడైన విఠోభా యొక్క తొడ ఎక్కి కూర్చుండెను. జ్ఞానదేవుని శరీరము సోకగనే నిర్వికల్ప సమాధి వికల్పమై తెలివిరాగా, చైతన్యస్వామి మౌనము వీడి, కన్నులు విచ్చి, ప్రియకుమారుని చూచి, కౌగిలించుకొని, ముద్దాడి, నివృత్తి దేవుని, సోపానదేవుని, ముక్తాబాయిని కూడా దగ్గరకు తీసుకొని, వారి తనువుల చేతితో తడవుచు పరమానందభరితుడై "నాయనలారా ! హాయిగా తాతతోగూడ వెళ్ళి పట్టణమున ఉండుట మాని ఈ అడవిలో ఎందుకు ? పట్టణమునకు వెళ్ళి రాజు మనస్సును సంతోషపెట్టుచు ప్రశాంతంగా ఉండు"దని చెప్పెను.

జ్ఞానదేవుడు "తండ్రీ ! మనం అందరం ఒకచోట నివాసము చేయవలెనన్న కాంక్ష ఎక్కువగా ఉన్నది. దయచేసి మా కోరిక నెరవేర్చుము. మేము పట్టణమున సుఖముగా ఉండుట నీవు అడవిలో కష్టపడుచుండగా కొడుకులు ఎలా నిర్విచారముగా సుఖపడుతూ ఉండగలరు? నీవు మా పట్టణమునకు రాక తప్పదు. మీరు వచ్చువరకు మేము కదల"మని చెప్పెను. నివృత్తి దేవుడును, సోపాన దేవుడును, ముక్తాబాయియు అదేవిధముగా పలికిరి. బయలుదేరవలెనని తొందర పెట్టిరి. చైతన్యస్వామి, నాయనలారా ! నన్ను తొందరపెట్టనేల ? పట్టణమును విడిచి అరణ్యమునకు వచ్చిన పిదప కష్టమో సుఖమో పడితీరవలయునే కాని మళ్ళీ పట్టణమునకు వచ్చుట మంచిది కాదు. వివేకములేని నరపశువులతో కలిసి అలకాపురమున బాధలు, గొడవలు

అనుభవించుటకంటె నోరులేని జంతువులతో అడవిలో నిశ్చింతగా కాలము వెళ్ళబుచ్చుట మేలు. పరమేశ్వరుని సేవించుట మాని ఒక అల్పుడగు రాజును సేవించుట వలన ప్రయోజనమేమి ? నాకు పట్టణమునకు వచ్చుటకు ఇష్టము లేదు" అనెను.

జ్ఞానదేవుడు : మంచిది. అరణ్యములోనే నివసింపవలెననియు పట్టణములో నివసింప కూడదనియు జ్ఞాని కేమైన విధియున్నదా ?

విఠోభా : అలా అని విధిలేదుగాని పట్టణమునకు వచ్చినచో నిష్ఠకు అనేక విఘ్నములు సంభవించును. మౌన నిష్ఠకెల్ల నిజస్థలమే వాసయోగ్యము.

జ్ఞానదేవుడు : ఇది పట్టణమిది అడవి అని భేదభావము కలిగినప్పుడే బ్రహ్మజ్ఞానమునకు ప్రతిబంధము కలుగును. భేదభావము గల బ్రహ్మనిష్ఠ నిష్ప్రయోజనము. అభేద ప్రతిపత్తి విషయమై భేద ప్రతిపత్తి కలుగుట యుక్తమేమో ఆలోచింపుము.

విఠోభా : నావి అన్న పదార్థములు ఉన్నంతవరకు అహంకారమును, అది యిది అను ద్వైతభావములు నాశనముకావు. ఇట్టి భేదభావములు మూలమట్టుగ తొలగించుటే నిర్వికల్ప సమాధి అనబడును. ఇది కేవలము నిస్సంకల్ప విస్సంగముల వలన కలుగవలసినదే కాని ఇతరములచేత కలుగదు. కావున నిస్సంగమునకు ఉనికి పట్టయిన అడవిలో ప్రవేసించితిని.

జ్ఞానదేవుడు: తన్ను తాను తెలిసికొని తన్మయముగా ఉండుటే బ్రహ్మ నిష్ఠగాని అరణ్యములో వసించుట కాదు.

విఠోభా :సద్గురుని వలన ఆత్మతత్వమును అర్థవంతముగా తెలిసికొన్న తన్మయముగా నుండి దాని అనుభవించుటకు ఏకాంతస్థలము ముఖ్యముగా కావలసియుండును.

జ్ఞానదేవుడు:ఏకాంతస్థల మొక్కటి కావలెననెడి అభిప్రాయముచేత ఒంటరిగా అరణ్యములో నివసించి తప మాచరించుచో అజ్ఞానము నివర్తింపదనియు, అహంకార మమకారము ఉండడగవనియు నిశ్చయించి, సుజ్ఞాను అనేకులు వనమనియు, పురమనియు సన్యాసమనియు, సంసారమనియు ఎంచక, నిశ్చలచిత్తముతో నిర్వకల్ప నిష్ఠాపరుల ఉండగా నీవు సంసారమును వదిలి అరణ్యములో ఒంటరిగా ఉండుటకు కారణమేమి ?

విఠోభా: సాక్షి ఎఱిగి సర్వసాక్షియు ఏకీభవించినవారైనను సంసారమున ఉన్నచో సమాధిసాధనమునకు విఘ్నముకలిగి సాక్షాత్కారమదశను వ్యర్థముగా పోగొట్టుకొందురు. కావున సహజానంద సంపద అనుభవించువారికి స్వప్నమందైనను సంసార అపేక్షింప తగినది కాదు.

జ్ఞానదేవుడు: ఇది కావాలనన్న సంకల్పమును అది వద్దన్న వికల్పమును లేక నిర్మలముగా ఉండుటే సహజానంద నిష్ఠకాని అడవిని ఇష్టపడి, పట్టణాన్ని అసహ్యించుకొనుటం కాదు.

విఠోభా: సంకల్ప వికల్పములు లేక స్వస్థచిత్తుడై ఉన్నవానికి ప్రపంచంతో సంబంధము ఎలాఉండును ? ప్రపంచంతో సంబంధం లేక నిశ్చలచిత్తుడై ఉన్నవానికి పట్టణములో నివసింపవలసిన పనియేమి ? దుఃఖముకెల్ల

మూలమైయున్న శరీరమును పోషించుకొని సంతోషించుటకా దురవస్థలకు జన్మస్థానమగు పట్టణములో నివసింపవలసినది ? ఇది యుక్తమైనది కాదు.

జ్ఞానదేవుడు : సమాధిసాధనమన్నవ్యాపారము ఒకటి ఉన్న, పక్షమున సంసార వ్యాపారమన్న బాధ ఏమి?

విఠోభా: సమాధిసాధన ఒక్క వ్యాపారమే యైనను సంకల్ప వికల్పాది వ్యాపారములు మూలమట్టుగ నశింప చేయుచున్నది. సంసార వ్యాపార మన్ననో సంకల్ప వికల్పాది సర్వవికారములనెల్ల వృద్ధిజేసి సంకటమునకు లోబరచుచున్నది. కావున సర్వానర్థములకు మూలమగు సంసార వ్యాపారము ఎప్పటికిని కూడదు.

జ్ఞానదేవుడు : సచ్చిదానంద స్వరూప సాక్షాత్కారదశను పొందినపిదప సమాధి సాధనముతో పనియేమి ?

విఠోభా: జాగ్రత్తయందు సుషుప్తిని పొందుటయేకదా బ్రహ్మనిష్ఠ అనబడును ? అది రాకున్న పరిపూర్ణ బ్రహ్మానంద మెట్లు సిద్ధించును ?

జ్ఞానదేవుడు : జాగ్రదవస్థయందు ఇంద్రియ వ్యాపారమును స్వప్నావస్థయందు మనోవ్యాపారమును సుషుప్త్యవస్థయందు శూన్యతను కనుగొని భ్రమింపక ఉండుటే బ్రహ్మానందమనియు, ఎందును అంటియు అంటక వెలయుచుండుటే జాగ్రత్సుషుప్తి అని వేదములు ఘోషించుచుండ శుద్ధ శూన్యమగు సుషుప్తివలె ఉండుటయే ఆనందమని, సిద్ధియే జాగ్రత్సుషుప్తి అని నీవెంచుట పొరపాటని తోచుచున్నది.

విఠోభా: జాగ్రత్స్వప్నావస్థ ఎప్పుడును ప్రపంచ వ్యాపారములను ధాన్యమును జల్లి విషయములను గొప్ప యురులొడ్డి జనులను మృగములనుబట్టి వివిధ దుఃఖముల అనుభవింపజేయును. కావున ప్రపంచ వ్యాపారమును అందక శుద్ధ శూన్యమై వెలయుచున్న సుషుప్తితో సమానమగు సమాధియే ఉత్తమమైనది.

జ్ఞానదేవుడు : పూర్వము జనకుడు మొదలగు మహానుభావులు ప్రపంచ వ్యాపారములో ప్రవేశించియుండియు విషయములను దుష్ట మృగములను ఎల్ల ఎరుకయను ఖడ్గముచే నరికివేసి సుఖదుఃఖముల ఎంతమాత్రము లక్ష్యపెట్టక తటస్థులై ఉండిన స్థితియే సమాధిగాని శుద్ధశూన్యము కాదు.

విఠోభా: అనేక జన్మసంచిత వాసనా విశేషముచేత వెట్టియెత్తి విచ్చలవిడిగా పరుగెత్తుచున్న చపలచిత్తమను మర్కటము సకల బంధములనుండి విడిపడిన శుకమహర్షి ఒక్కనికి మాత్రమే స్వాధీనపడినది కాని సుషుప్తిస్థితి లేక తన్ను బ్రహ్మమాత్రముగా తెలిసికొన్న జనకునకు స్వాధీన పడలేదు.

జ్ఞానదేవుడు: దృఢప్రజ్ఞకలిగి మెలగుచున్న జనక చక్రవర్తికే మనోలయమైనది కాని బాహ్యబంధములను వదలి అరణ్యములో నివసించిన శుకమహర్షికి ఏమాత్రమును మనోలయము కాలేదు.

విఠోభా: దృఙ్మాత్రముగా నుండి దృశ్యప్రపంచమును నిరసింప వలసినదేకాని దృశ్యములో ఉండియే దృశ్యమును నిరసింపవలె నన్న సాధ్యముకాదు విషదోషమును హరించుటకై మరల విషమే త్రాగినచో మరింత శీఘ్రముగా మరణమే సిద్ధించును గాని దోషనివృత్తి యగునా?

జ్ఞానదేవుడు: విషదోషములను హరింపవలెనన్న వేరొక విషస్వభావము

గల ఔషధమును ప్రయోగించినట్లు భయంకరములగు ఇంద్రియవికారముల ఎల్లను దృఢ ప్రజ్ఞచేత జయించువాడే ధీరుడుకాని, ఎల్లప్పుడు నిష్ఠలో నుండి విషయ మృగములు ఎక్కడ వచ్చి బాధించునో అని భయపడువాడు ధీరుడు కాడు. అట్టివానికి భయమే సిద్ధించునుగాని బ్రహ్మానందము సిద్ధింపదు.

విఠోభా: సర్వసంగ పరిత్యాగమొనర్చి సర్వదా సమాధి నిష్ఠలో నున్న వానినే విషయములు చలింపచేయు అనగా, సంసార వ్యాపారములోనే సంతతము మునిగియున్న వానిని ఎంత చేయలేవు ? గొప్ప ప్రవాహములో పడి కొట్టుకొని పోవుచున్న గడ్డిపోచ ఎట్లు స్థిరముగా నిలువగలుగును?

జ్ఞానదేవుడు:దృఢ ప్రజ్ఞలేని వాడెంతకాల అంతర్ముఖముగా ఉన్నను బలవంతములైన ఇంద్రియములు ఏ విధముగా నైన వానిని బహిర్ముఖమునకు దిప్పి ముప్పతిప్పలు పెట్టకమానవు. ప్రవాహమునందు పడిన గొప్ప బండరాయి ఎట్లు చలింపదో అట్లు విషయవికారములును తత్సంబంధములగు విచారములు ఎన్ని సంభవించినను నిశ్చలచిత్తుడై ఉన్నవాడే బ్రహ్మానందమునకు పాత్రుడగునుగాని చపలచిత్తుడు పాత్రుడుగా లేడు.

విఠోభా: ఎంతటి దృఢ ప్రజ్ఞగలవాడైనను సర్వసంగములను పరిత్యజించి సంతతము సచ్చిదానంద పరబ్రహ్మము ఉపాసింపక పోయినచో మాయాంధకూపములోబడి మునిగిపోవు అనుటకు సందేహము లేదు.

జ్ఞానదేవుడు:మాయ బ్రహ్మమున కంటె భిన్నమైఉన్నకదా నిరంతరము నిష్ఠలో ఉండి దానిని జయింపవలసినది ? తన నీడ తనతో ప్రతిఘటించి

యుద్ధము చేయునన్నట్లు మిధ్యాభూతమైన మాయ ఒకదానిని కల్పించుకొని, నిరంతరము నిష్ఠలో ఉండవలెనని ఊరక భ్రమపడుదురు. నీడతో పోరబూసుకున్న ఎంత ప్రయోజనమో మిధ్యాభూతమగు మాయను జయింప పూనుకొన్న అంతయే ప్రయోజనము మిధ్యయై ఉన్న మాయను' మిధ్యయనియే నిశ్చయించి మౌనముద్ర వహించి ఉండక లేనిపోని చిక్కులు తెచ్చి పెట్టుకొని కష్టపడుట వలన ప్రయోజనమేమి ?

విఠోభా :నియతి చేయక, ఏకాగ్రచిత్తత పొందకయు, సాక్షి మాత్రముగా ఉండక బ్రహ్మజ్ఞానమెట్లు కలుగునో చెప్పుము.

జ్ఞానదేవుడు:నీతియను మహావాక్యము వలన నిషేధింప మొదలుపెట్టిన కొలది చీమలపుట్టవలె విషయములు అసంఖ్యాకములుగా వెలువుడుచునే ఉండును. ఏకాగ్రచిత్తత పొంద ఆరంభించిన కొలది పుట్టచెండెగురునట్లు మనశ్చలనము ఎక్కువగ చుండును. సాక్షిమాత్రముగా ఉండుటకు ప్రయత్నముచేసిన కొలది కుక్కతోక చక్కపడనట్లు దేహాది ప్రపంచమంతయు తాననెడి భ్రాంతి ఎక్కువగుచుండును. కావున విద్యా రూపమగు అహంకారమును మిధ్యాభూతమగు మాయ ముత్తెపుచిప్ప నందు ఉన్న వెండివలె అత్యంత మిధ్యయని తలచి, తానేబ్రహ్మమని నిశ్చయించి విచారజ్ఞానముచేత నిర్విచారమును పొంది ఉండుటచే బ్రహ్మానందముగాని వేరుకాదు.

విఠోభా :సాధన సంపత్తిలేక విచారజ్ఞానముచేత తానే బ్రహ్మమని నిశ్చయించుకొన్న మాత్రమున దుఃఖమయములగు విషయములనెల్ల జయించి బ్రహ్మానందమును పొందుట ఎట్లు సాధ్యమగను ?

జ్ఞానదేవుడు: జీవముతో ఉన్నప్పుడే వ్యాఘ్రమును చంపలేని పశువు చచ్చిన తరువాత ఎట్లు చంపగలుగును ? అట్లే నిత్యమై సత్యమై నిర్మలమై నిష్కళంకమై సచ్చిదానందమై స్వయంప్రకాశమై వెలయుచున్న ఆత్మను జములైన విషయములు ఏమియు చేయజాలవు. పశువులెంత బలిసియున్నను వ్యాఘ్రము ముందునకు వచ్చుటకు భయపడునట్లు విషయము ఎంతవిఱ్ఱవీగునవైనను నిశ్చలజ్ఞాన సంపదల గల నిర్మలచిత్తుని ముందెప్పుడును తలచూప భయపడుచుండును. ఒకవేళ తలచూపినచో వ్యాఘ్రమునకు కనబడిన పశువు వలె తక్షణమే నశించును.

విఠోభా: రంకుటాలితో చేరిన ఇల్లాలుగూడ రంకుతనమునకు దిగి చెడిపోవునట్లు నిరంతరము అవివేకులతో సహవాసము చేసిన వివేకము విషయభ్రమలకు చిక్కి అనేకదుఃఖముల అనుభవించునేగాని సుఖము ఎంతమాత్రము అనుభవింపలేడు.

జ్ఞానదేవుడు:స్థిరచిత్తతగల పతివ్రత పలువురు జారస్త్రీలతో చేరియున్నను తన పాతివ్రత్యమును జాగ్రత్తగా కాపాడుకొనును గాని వారి దుర్బోధలకు లోనుగాదు. స్థిరచిత్తతలేని కాంత ఇతర సంసర్గము లేక ఒంటరిగా నున్నను తనంత తానే పాతివ్రత్యమునకు భంగము తెచ్చుకొనును. అట్లే దృఢజ్ఞాన సంపన్నుడగు పురుషుడు దురభిమాన పిశాచగ్రస్తులను సజ్జనులతో నిరంతరము సహవాసము చేయుచున్నను తన సుజ్ఞానమున ఎంతమాత్రమును లోపము కలిగించుకొనలేడు. దృఢజ్ఞానహీనుడగు పురుషుడెవ్వరితోను చేరక యింట ఒంటరిగా ఉన్నను జ్ఞానమును నశింపజేసికొని తుదకు వ్యర్థుడగును.

వితోభా: నీవెన్ని చెప్పినను సంసార వ్యాప్తిలో చిక్కి సంకట అనుభవించువానికి సహజజ్ఞాన సంపద కలుగునన్నమాట విశ్వసించుటకు వీలులేదు.

జ్ఞానదేవుడు:బ్రాహ్మణుడు నాటకరంగమున పాకీవాని వేషము వేసికొని నటించినను వాని బ్రాహ్మణత్వమున ఎట్లులోపము కలుగదో అట్లే జ్ఞానవంతుడు అజ్ఞానులతో కూడి విచ్చలవిడిగా తిరిగినా అతని ఆనందమున ఎంతమాత్రము లోపమురాదు.

వితోభా: ఎంతటి దృఢప్రజ్ఞావంతుడైనను ముహూర్తమాత్రము బ్రహ్మధ్యానము చేయక ఊరకున్నచో అతని ఆనంద స్థితికి లోపము సంభవించును.

జ్ఞానదేవుడు:పాకీవానివేషము వేసికొని నాట్యరంగమున నటించుచున్న బ్రాహ్మణుడు 'నేను బ్రాహ్మణుడను, నేను బ్రాహ్మణుడ'నని పలుమారులు చెప్పుచుండవలయునా ? చెప్పుకున్న అతడు పాకివా డగునా ? జగమెరిగిన బ్రాహ్మణునకు జందెమేల అన్నట్లుగా అహంకార గ్రంధి అడుగంట గోసిన పిదప మరల దురభిమానము ఉంచుకొని 'అహం బ్రహ్మోస్మి, అహం బ్రహ్మోస్మి' అని అనుసంధింప ఏల ? అహంకార మమకారములు అడగిన పిమ్మట బ్రహ్మోను సంధానము చేయకున్నను పరమానందమున ఎంతమాత్రమును లోపమురాదు.

వితోభా :సర్వజ్ఞామూర్తి అంతటి వాడైనను సర్వదా బ్రహ్మోనుసంధానము చేయకున్న అజ్ఞానసాగరమున మునిగిపోవును.

జ్ఞానదేవుడు: దివిటీ చేతబట్టుకొని చీకటి ఉండమన్న ఎలా ఉంటుంది ? దేహాది ప్రపంచమును తానని భావించు సజ్ఞానమును తొలగించి బ్రహ్మమే తానని తెలిసికొన్న తదుపరి అజ్ఞానము ఉండుమన్న ఎలా ఉంటుంది ?

నివృత్తిదేవుడు తండ్రితో "నాయనా ! తమ్మునితో అంత పట్టుదలగా చర్చించుట ఎందుకు ? ఏ వస్తువును స్మరించినంతమాత్రమున సమస్తపాపములు నశించునో, ఏ వస్తువును విచారించినంత మాత్రమున నిస్సంగత్వము కలుగునో, ఏ వస్తువును దర్శించినంతమాత్రమున జీవత్వము నశించునో, ఆ వస్తువునే తెలిసికొనవలెననియు, దానినే భక్తిప్రపత్తులతో ఉపాసింపవలెననియు, అదియే పరబ్రహ్మమని గ్రహింపవలెననియు వేదములు తెలుపుచున్నను స్థావర జంగమాత్మకమైన సమస్త వస్తువులయందును పృధివ్యాది పంచభూతముల యందును శబ్దాది పంచతన్మాత్రలయందును అవ్యక్తి మహదహం కారాది తత్వములందును సత్వరజస్తమోగుణములయందును వానియందు ప్రతిఫలించిన బ్రహ్మవిష్ణు మహేశ్వరులందును పరమాణువులయందును పరిపూర్ణముగా నిండియున్న పరబ్రహ్మమునకు ఎట్లు నమస్కరింపవలెనో, వాక్కుచేత చెప్పుటకును మనస్సుచేత ఊహించుటకును శక్యముగాని పదార్ధము ఎట్లు స్తుతింపవలెనో తెలిసికొనుటకు సాధ్యమగుటలేదు. అట్టి రూపనామ క్రియాతీత వస్తువును దర్శింపవలెననియు స్తుతింపవలెననియు మాటిమాటికి పలుకుటవలన ప్రయోజన మేమి ? ఆనందమాత్రముగా ఉన్న పదార్ధము యొక్క తత్వమును శ్రుతి స్మృతి పురాణేతిహాసములుగూడ నిరూపించలేక మౌన మవలంబించుచుండగా అది ఇట్టిదని నిర్ధారణ

చేయుటకు మనకు సాధ్యమగునా ? నామరూపక్రియలు మొదలగు చిహ్నము లెల్లను నశించిన పిదప శేషించియుండు వస్తువేదో అదియే తానై సమస్త పదార్థములందును సమదర్శనముగలిగి వెలయుటయే ఉత్తమమగు బ్రహ్మధ్యానమనియు, సంకల్ప వికల్పములు లేక సుఖదుఃఖముల పొందక అహంకారమును నశింపజేసి ఆనందమాత్రముగా ఉండుటే ఉత్కృష్టమగు బ్రహ్మనిష్ఠ అనియు ఉత్తమ తత్వవేత్తలు పలుకుదురు. కావున నీవు అడవిలో నివసింపవలెననియు పట్టణములో వసింపగూడదనియు పలుకుట శ్రుత్యనుభవములకు విరుద్ధముగా ఉన్నది. స్థాణువువలె ఒక స్థలమున కూర్చుండి కదలక మెదలక ఉండుటవలన ఫలమేమి ?" అని పరతత్వ రహస్యమును తెలిపెను.

ఇక విఠోబా వారిని అత్యంతప్రేమతో కౌగిలించుకొని "అన్నలారా! పూర్ణానంద బోధనములు మీవల్లనే పుట్టినవి. పరతత్వ విషయమై మీతో వాదించు 'సమర్థులు లేరు. ఇట్టివారిని పుత్రుడనుగా పొందిన నా భాగ్యమే భాగ్య"మనెను. నివృత్తిదేవ జ్ఞానదేవులు శివకేశవరూపములను ధరించిరి. విఠోబా వారినిజూచి ఆత్యాశ్చర్యమును పొంది చేతులు జోడించి– "పరమ దయాస్వరూపులారా ! మీరు భక్తులయందు గల వాత్సల్యము ఏమని కొనియాడగలను ? మీరు సకలలోకములకు ప్రభువులరు. బంధమోక్షముల అధ్యక్షులు. సృష్టిస్థితి లయకర్తలరు. మీ మహిమ కొనియాడ ఎవరితరము ? లోకమున మీ విషయమై కొందరు కలరనియు, కొందఱు లేరనియు, కొందఱు సగుణులనియు, కొందరు నిర్గుణులనియు చర్చించుచుందురు. అమోఘమగు మీరూప మందరి కన్ని విధముల

దోచుచు అచింత్యమై అద్భుతమై అవ్యయమై స్వయంప్రకాశమై వెలుగుచున్నది. పామరులు లోకత్రయమునకును కాలత్రయమునకును మూలమై భిన్నముగా దోచునట్టి మీ మూర్తిత్రయ ద్యోతితమగు దివ్యస్వరూపమును పరబ్రహ్మమని గ్రహింపలేక మీయందు భేదభావములు గల్పించి దుర్వివాదములకు ఉపక్రమించి చెడిపోవుచుందురు. వారికి విశ్రాంతి ఉండదు. యోగులు ఏకాంత స్థలమున కూర్చుండి ఇంద్రియములను జయించి మనస్సును నిగ్రహించి యోగమార్గమున జ్ఞాన నేత్రములతో పరమపవిత్రమగు మీ స్వరూపమును సందర్శించితిమని ఆనందింతురు. కాని ఇట్లు మాంసచక్షువులతో మీ స్వరూపమును తనివిదీర చూచియుండలేరు. పరమపవిత్రులగు మిమ్ము పుత్రులనుగా పొందుటకు నేను పూర్వజన్మమున ఎంతటి పుణ్యము చేసియుంటినో తెలియదు. శివకేశవులగు మిమ్ము భక్తి ప్రపత్తులతో నిత్యమును సేవచేయుచు బ్రహ్మానందము అనుభవించుట మాని ఈ అడవి మధ్యములో పడియున్న నా అవివేకమునకు ఏమందును ? అవతరించినంతనే మీ స్వరూపమును చూసి నన్ను కృతార్థుని చేయక ఇంతవఱకు గోప్యముగా నుండుటకు కారణము తెలియకున్నది. నా తపము పండినది” అని అనేక విధముల కొనియాడెను.

సోపానదేవుని జూచి “మహాత్మా ! నీ దివ్యస్వరూపమును చూపక మౌనము వహించియుండు టెందులకు ? నీసేవను ప్రసాదించి నన్ను కృతార్థుని చేయు”మని ప్రార్థించెను.

సోపానదేవుడు చతుర్ముఖములతో స్వస్వరూపదర్శనము చూపించి, సాదరముగా చైతన్యస్వామిని చూచి, “భాగవతాగ్రణీ !” తనయందు పరబ్రహ్మమును కనుగొని దుఃఖములు లేవని నిశ్చయించి పరిపూర్ణ వస్తువై ఉన్నవానికి సంసారభయ ముండదు. సంసార భయము తొలగిపోగా స్వరనరకములును నిర్బంధములును తొలగును. నిర్బంధ రహితునకు బంధమోక్షములు తల చూపలేవు. ప్రపంచములో బ్రహ్మాది స్తంభ పర్యంతమును గల సమస్త పదార్థములును బ్రహ్మమనియు, ఆ బ్రహ్మమణువునకు అణువై మహత్తునకు మహత్తై వెలయుచున్నదనియు తెలిసికొనుటయే బ్రహ్మానుభవముగాని వేరుకాదు. ఈ అనుభవమును దృఢముగా సిద్ధిచేసికొని సంసారమునందు కుమ్మరపురువువలె ప్రవర్తించువాడే బ్రహ్మవేత్త అనబడును. గృహస్థ ధర్మము అవలంబించి ఈ అనుభవమును పొందుటచేతనే పూర్వము వసిష్ఠునకు విశ్వామిత్రుడును జనకునకు శుకుడును, శ్రీకృష్ణునకు దుర్వాసుడును లోబడిరి. కావున గృహస్థధర్మమును అనుసరించు జ్ఞానవంతుడే సర్వసంగపరిత్యాగులైన సన్యాసులలో అత్యుత్తమమైనవాడు. ఇందుకు సందేహము లే”దని చెప్పెను. విఠోబా సంతోషాంతరంగుడై “దేవా ! నీవు ఎట్లా సెలవిచ్చిన అట్లు నడచుకొనుటకు సిద్ధముగా ఉన్నా”నని పలికెను.

ముక్తాబాయి వైపు తిరిగి “అమ్మా ! నీవు లక్ష్మివో, సరస్వతివో, పార్వతివో తెలియకున్నది. నీ స్వసరూపమును చూపి నన్ను ధన్యుని చేయు”మని వేడెను. ముక్తాబాయి త్రిజగన్మోహనాకార అగు తన దివ్యరూపమును చూపి ఆ దంపతులను ఆశ్చర్యంలో, ఆనందంలో

ముంచివేసెను. ఆ దంపతులిద్దరు భక్తితో ఆమెకు నమస్కరించి “అమ్మా! జగదీశ్వరీ ! జగన్మాతా ! నీ మహత్వమును కొనియాడ మేమెంతవారము! సకలలోక శరణ్యవగు నీవు మాకు కుమార్తెవై అవతరించుట మా భాగ్యము. మాకు అపరిమితానందము లభించిన”దని కొనియాడిరి. విఠోబా తన భార్యతో సతీమణి ! మన ఆచార్యుని ఆశీర్వాచన ప్రకారము త్రిమూర్తులును ఆదిశక్తియు మనకు బిడ్డలుగా అవతరించిరి. మనము వీరివెంటనుండి వీరిని సేవించుట ముఖ్య కర్తవ్య”మని పలికెను. రుక్మాబాయి మిక్కిలి సంతోషించి, తన అదృష్టమును ఏ పూర్వజన్మ ఫలమో అని అనుకున్నది.

ఆదిశక్తి సాదరముగా జననీ జనకులను జూచి “పరమభాగవతులారా ! ఈ యుగమునందు కలిపురుషుని ప్రభావ మెక్కుటచే ప్రజలెల్ల దుర్మార్గులై జిహ్వాచాపల్యముచే జీవహింస కొడిగట్టి సదాచారముల చెడగొట్టి దుర్గతికి పోవుటకు ప్రారంభించిరి. వారి దుస్థితి చూచి సహింపలేక వారినందరిని సన్మార్గమునకు త్రిప్పి కృతార్థులనుగా చేయుటకై మేము నలువురము మీగర్భమున అవతరించితిమి. మీరు సామాన్యులు కారు. పరిశుద్ధులగు అరుంధతీ వసిష్ఠులు. మీకు బ్రహ్మోపదేశముచేసిన శ్రీపాదస్వామి నారదుడు. పూర్వ జన్మమును మీరు మమ్ము నలువురను బిడ్డలనుగా బడయవలయునని మిక్కిలి కాంక్ష కలిగియుండుటచే నీ జన్మమున మీకోరిక తీర్చితిమి. ఈ రహస్యము ఇతరులకు తెలుపక మిక్కిలి గోప్యముగా నుంచవలెను. మా కార్యమును శీఘ్రముగా నెరవేర్చవలయును. అందువలన పట్టణమునకు ఇప్పుడే వెళ్ళవలెను. మీరు మా వెంట లేచిరం”డని పలికెను. విఠోబాను జూచి,

“బ్రహ్మానుసంధానమునకు ముఖ్యసాధనమగు అద్వైతజ్ఞానమునకు భేదభావము ఉండకూడదు. సుఖదుఃఖ సుగంధ యుక్తములకు మాత్రమే సాధింపగలిగిన బ్రహ్మనిష్ఠ అరణ్యమని పట్టణమని భేదబుద్ధిగల నీవంటివారికి ఎట్లు సాధ్యమగును ? సదానందమై సచ్చిదానందమై చరాచర రూపమున సమస్త వస్తువులయందు వ్యాపించి పరాత్పరమైయున్న వస్తువేదో అదియే పరబ్రహ్మము. ఏకమనికాని అనేకమని దానిని నిరూపింపకూడదు. ఆపదార్ధ మిట్టిదని నిరూపింప సాధ్యముకాదు. వాక్కుచేత ఉచ్చరింపదగిన శబ్దము ఆ వాక్కు చేతనే స్థిరపరచ వలసినట్లు పరమాత్మ యొక్క వాస్తవస్థితిని పరమాత్మ వలననే తెలుసుకొవాలి. హింసయొక్క స్వభావము హింస అనుభవించువానికిని, దప్పియొక్క కష్టము దప్పిగొన్న వానికిని, పదార్ధము యొక్క రుచి భక్షించినవానికిని తెలిసినట్లు సచ్చిదానంద పరబ్రహ్మతత్వము అనుభవముచేత ఎరుగవలయునేకాని చెప్పి చూపుటకు వీలుపడదు. ఇది మంచి యిది చెడ్డయని తలంపక గాఢాగ్ని వలె నున్న వానికిది నగర మిది వనమను భేదబుద్ధి కలుగదు. నీవీవిషయములను చక్కగా విచారింపక పోవుటచే ఇట్టి సంశయములు కలిగిన”వని ఉపన్యసించి, సంశయమునెల్ల దీర్చి, “అరణ్యమున నుండవలసిన పనిలేదు. పట్టణమునకు వెళ్ళుదము ర”మ్మనెను.

విఠోబా పరమానందముతో వారివెంట పట్టణమునకు వెళ్ళుటకు సిద్ధపడెను. త్రిమూర్తులు, ఆదిశక్తియు ఆ రూపములను విడిచి, మునుపటి రూపములను ధరించి, దంపతులకు తమయందు విశేష వాత్సల్యము కలిగించి, వారిని వెంటదీసికొని బయలుదేరి అలకావతి చేరిరి. సిద్ధోపంతు

కుమార్తెయు, అల్లుడును బిడ్డలతో గూడ వచ్చినందులకు మిక్కిలి సంతసించెను.

7. శ్రీ జ్ఞానేశ్వర్ మహారాజ్ లీలలు

జ్ఞానదేవుడు దున్నపోతుచే వేదమును చెప్పించుట

జ్ఞానదేవుడు ఒకనాడు తండ్రితో కూడ రాజువద్దకు వెళ్లి, ఆశీర్వదించి, విఠోబాను చూపి అతడు తన తండ్రి అని తెలిపెను. రాజు భక్తితో విఠోబాకు నమస్కరించి ఉచితాసనమున కూర్చుండచేసి అతనికి అనేకవిధముల కొనియాడి, అరణ్యమునకు వెళ్ళుటకు గల కారణమును తెలుపుమని ప్రార్ధించెను. విఠోబా రాజును ఆశీర్వదించి, "రాజా ! ప్రపంచమునందలి ఎనుబది నాలుగులక్షల జీవరాశులలో మానవజన్మ ఉత్తమము. అందులో పురుషుడుగా పుట్టుట దుర్లభము. అట్టి జన్మము లభించగా దానిని సద్వినియోగము చేయవలయునే కాని వ్యర్థపుచ్చ రాదు. పశువులకు మానవులకు ఆహార నిద్రా మైధున్యములు సామాన్యమేయైనను మానవులందు జ్ఞానమొక్కటి విశేషముగా ఉండుటచే వారు జంతువులలో అందరికంటె ఉత్తములుగా చెప్పబడుదురు. కావున మానవులకెల్ల ఆత్మానాత్మ వివేకము అవసరము. అట్టి వివేకము కేవలము సత్సాంగత్యము వలనను శాస్త్రవిచారము వలనను కలుగును. అది లభించిన పిదప గురుముఖముగా తానిట్టివాడనియు, మనస్సును లయింపచేయుటకు సాధన మిట్టిదనియు తెలిసికొని, దాని అర్థమును మననము చేయుచు ఏకాంతమున నిస్సంగుడై నదిధ్యానముచేత దానిని దృఢపరచవలయును. ఆ నిధి ధ్యానమునకు సదా అభ్యాసము అవశ్యము. సదాభ్యాసమునకు విజనస్థలము ముఖ్యము. కనుక వనవాసము ఉత్తమమని నిశ్చయించి అందు వాసము చేయుచుంటి" ననెను.

రాజు పరమానంద భరితుడై “స్వామీ ! పామరులగు బ్రాహ్మణులు నీ మహత్త్వమును గుర్తించలేక యుక్తాయుక్త వివేకశూన్యులై నీకవమానము గలిగించిరి. ఆ పాపములో నన్నుగూడ భాగస్వామిగా చేసిరి. కరుణించి నానేరమును మన్నించు” అని ప్రార్థించెను. “అందుకు విఠోబా మందహాసము చేసి “రాజోత్తమా ! నీవు పరిశుద్ధ చిత్తుడవు కావున సమస్త సామ్రాజ్యము పాలించుచు సుఖముగా ఉండగల”వని పలికెను.

రాజు ప్రతిష్ఠానపురమున నివసించుచున్న ఆచార్యస్వామికి ఒక విన్నపమును వ్రాసి, మంత్రిచేతికిచ్చి, వీరిని తీసికొని వెళ్ళి మఠాదిపతికీ విన్నపము ఇచ్చి ఇతనియందు దోషములేదని ఆచార్యుని వలన నిరాక్షేప నిరూపము ఒకదానిని తీసికొని రావలసినదని ఆజ్ఞాపించి పంపెను. మంత్రి విఠోబా మొదలగు వారిని వెంట తీసికొని తగిన పరివారముతో బయలుదేరి పైఠణపురమునకు పోయి మఠాదిపతిని దర్శించి కానుకలు సమర్పించి విజ్ఞాపన పత్రిక ఇచ్చెను. మఠాదిపతి అందలి సంగతులు చదివెను. అతడు బ్రాహ్మణులచే విఠోబా విషయము వినియుండుటచే నవ్వి, బ్రాహ్మణులతో “అయ్యలారా ! ఈ వినోదమును వింటిరా ? అలకావతిరాజు సన్యాసభ్రష్టుడైన వానికి పుట్టిన పిల్లలను జాతిలో చేర్చుకొని వారికి ఉపనయనాది సంస్కారములను చేసి నిరాపేక్ష నిరూపము ఇచ్చి పంపవలెనని విజ్ఞాపన పత్రము వ్రాసినాడు. దీనివిషయమై మీకేమి తోచుచున్నదో తెలియజేయు”దని అడిగెను.

ఆ బ్రాహ్మణులు నవ్వి “బాగున్నది. మంత్రములు చెప్పి గంగలో వేయిమార్లు స్నానము చేయించినను శూద్రుడు బ్రాహ్మణుడగునా ?

సన్యాసము తీసికొన్నవాడు శూద్రుని పంక్తిలో సహితము కూర్చుండుటకు యోగ్యుడు గాడని శాస్త్రములు తెలుపుచుండగా బ్రాహ్మణుల పంక్తిలో ఎట్లు కూర్చుండ అర్హుడగును ? రాజుతలంపు చూడగా పరస్త్రీని పతివ్రతగా చేయునున్నట్లున్నది. వర్ణభ్రష్టుని పిల్లలు శూద్రుల కంటె నీచులు. వీరిముఖమైనను చూడరాదు. వీరు ప్రాయశ్చిత్త విధులతో గూడ పరిశుద్ధులు కాలే"రని పలికి ధిక్కరించిరి.

ఆచార్యస్వామి మంత్రితో "అయ్యా ! విఠోబా కుటుంబములోని వారికీజన్మమున బ్రాహ్మణ పంక్తిలో కూర్చుండు యోగ్యత సిద్ధింపదు. ఈ విషయమును రాజునకు మనవిచేయు"మని చెప్పెను. మంత్రి బ్రాహ్మణుల మూఢత్వమునకు చింతించి, విఠోబా మొదలగు వారినెల్ల అచటనే విడిచి, తానొక్కడే అలకావతికేగి, రాజునకా విషయమును పూసగ్రుచ్చినట్లు దెలిపెను. రాజు వారిని ఎట్లయిన జాతిలో చేర్చవలెనని ఎంచి గొప్పగొప్ప బ్రాహ్మణులతో వాదించి వారితో ఆలోచించుచుండెను.

జ్ఞానదేవు ఆ మఠమున కూర్చున్న బ్రాహ్మణులకు నమస్కరించి, తనతండ్రి విషయమును వివరముగా తెలిపి, "అయ్యలారా ! పరమార్థమును గురించి సన్యాసము తీసికొన్న వాడెట్లు వర్ణభ్రష్టుడగును ? మీవంటి పెద్దలే ఇట్లు సెలివచ్చినచో నిక చెప్పవలసినదేమున్నది ? దయచేసి దీనులమగు మా మనవి చిత్తగించి ధర్మమును విచారించి మమ్ము రక్షింపుడు. శరణాగతులను నిరాకిరంచుట ధర్మము కా"దని పలికెను. బ్రాహ్మణు లామాటలువిని కోపావేశపరులై "ఓరీ! మిమ్ము మేము రమ్మని పిలిచితిమా ? ఎందుకు వచ్చినారు ? ఇక నోరుమూయుము.

అభక్ష్య భక్షణము చేసి వర్ణభ్రష్టుడైనవాని సంతతికి కీర్తిప్రతిష్ట ఎట్లవచ్చును? మీ ముఖము చూడరాదు. ఇచటి నుండి వెళ్ళిపొం"దని తిరస్కరించిరి. జ్ఞానదేవుడు చిరునవ్వుతో "ఆత్మ తత్వమునుమరచి కుక్షింబరులై శూద్రుల ధనముతో జీవించుచు వారి విషయమున ఎంతమాత్రమును కృతజ్ఞత లేక వారినే దూషించు మీవంటి దుర్మార్గుల ముఖమును చూడరా"దని పలికి ధిక్కరింపసాగెను. విఠోబా కుమారునితో ఇంటికి పోవుదము రమ్మనెను. బ్రాహ్మణులు పిల్లలపేర్లను తెలిసికొని వారిని పరిహాసముచేయుచు స్నానమునకై గోదావరికి బయలుదేరిరి.

జ్ఞానదేవుడు వారితో "అయ్యలారా ! ఏనుగును చూచి కుక్కలు మొరిగినట్లు సజ్జనులను చూచి దుర్జనులు నిందించుట సహజము. దాని వలన సజ్జనులకు ఎట్టి హాని లేదు. మీరు మమ్ము చూచి పండ్లికిలించినంత మాత్రమున మాకెట్టి అవమానమునులేదు అని పలికెను. బ్రాహ్మణులు కోపించి "ఏమిరా ! నీకన్నులకు మేము కుక్కల మైతిమా ? నిన్నేమి చేసెదమో చూడు"మని పలికి పండ్లు పట పట కొఱుకుతూ కండ్లెఱ్ఱజేసి కొట్టబోయిరి. నివృత్తి దేవుడు వారి అడ్డుపడి "అయ్యలారా ! కొంత శాంతింపుడు. మా విషయములనెల్ల మీకు మనవి చేసికొంటిమి. మీకిష్టమున్న మాయందు దోషములేదని నిరూపము వ్రాసి ఇవ్వవచ్చును. లేకున్న వీలుండదని చెప్పవచ్చును. అంతేకాని మమ్ము పరిహాసము చేయనేల ? మీకిది యుక్తమైన పనికాద"నెను. బ్రాహ్మణులు మరింత కోపించి "తెలివిలేని మాటలు మాటాడకుము. మిమ్మిక్కడ ఉండుమన్న

వారెవ్వరు ? ఇచటి నుండి వెళ్ళిపొం”డని ధిక్కరించిరి. నివృత్తి దేవుడు “ఆహా ! మీయోగ్యత నేమని కొనియాడ వలెను ?

పూర్వము వేదములనెల్ల చిక్కుదీసి లోకమున ప్రచురించిన వేదవ్యాసుడును, ఋషులచేత బ్రహ్మర్షియని స్తుతింపబడిన వసిష్ఠుడును, భరద్వాజునకు బ్రహ్మోపదేశము చేసిన వాల్మీకి, సృష్టికి ప్రతిసృష్టి చేసిన విశ్వామిత్రుడును, రామసేవనందు కడతేరిన గుహుడును ఏ కులమువారో, వారు బ్రాహ్మణుల ఎట్లు ప్రథమాచార్యులైరో విచారించినచో మాతండ్రి వర్ణభ్రష్టుడైనదియు వర్ణశ్రేష్టుడైనదియు తెలియగల”దని చెప్పెను. అందులకు బ్రాహ్మణులు నివృత్తిదేవుని కోపంతో చూచి “మా మాటలు పెడచెవినిబెట్టి పుక్కిటి పురాణములు మొదలు పెట్టితివి. శాపానుగ్రహ సమర్థులగు వ్యాసుడు ఎక్కడ ? ఎందులకు పనికిరాని మీతండ్రి ఎక్కడ ? ఈ విషయము ఇంతటితో చాలించి వచ్చిన దారిబట్టి వెళ్ళుట మంచిది. ఇక వెళ్ళు”డని పలికిరి. నివృత్తిదేవుడు “మీరు వ్యర్థముగా మాటాడుచున్నారు. తత్వవేత్తలిట్లు పలుకరు పరమార్థమునకై పరమహంస ఆశ్రయించి సన్యసించినవాడు భ్రష్టుడని వేదములో ఎచటనైన విధింపబడియున్న తెలియచేయ”మనెను. బ్రాహ్మణులు కోపావేశపరులై “మీతండ్రి భ్రష్టుడనుటుకు సందేహమేల ? కులభ్రష్టులగు మీ ఎదుట మేము వేదము ఉచ్చరింపము, గాని సన్యాసమును వదలి మరల గృహస్థుడైన వాడు వర్ణభ్రష్టుడని వేదమునందు విధింపబడినదని మాత్రము దృఢముగా చెప్పెద”మనిరి.

జ్ఞానదేవుడు ముందుకువచ్చి ఆ దారిని వచ్చుచున్న దున్నపోతు ఒక దానిని చూపి "ఇదిగో, దీనికిని మీకును భేదము లేదు. మీతో మాటాడుటకంటె దీనితో మాటాడుట మేలు. సూర్యుడొక్కడయ్యు అనేక ఘటములందు ప్రతిబింబించునట్లు సమస్త భూతములందు అంతర్యామియై వెలయుచున్నవాడు భగవంతుడొక్కడే అని గుర్తించలేక జాతి మతభేదములను లెక్కించుచు మాకు సమానులుగాని మాకంటె గొప్పవారుగాని లేరని తలంచి వ్యర్థముగా గర్వపడుచున్నారు. వేదములందలి నాలుగుముక్కలేవో నేర్చి ఊరక పలికినంతమాత్రమున మీరు జ్ఞానులని భావింప వలెనా ? జ్ఞానోదయమై ఉన్న ఇట్టి భేదభావము ఉండునా ? న్యాయము తెలియక ధిక్కరించుచున్నారు. ఇట్టి నడవడి మీకు సరియైనది కా"దనెను.

బ్రాహ్మణులు "జాతిభేదము లేదనుటయేగదా నీ అభిప్రాయము? భేదమున్నది లేనిది నీ కిప్పుడే తెలియజేసెద" మని పలికి ఒకకఱ్ఱతో నా దున్నపోతు వీపుమీద నొకదెబ్బ వేసిరి. 'అబ్బా' అని జ్ఞానదేవుడు మిట్టిపడెను. బ్రాహ్మణు లతని వీపున తెలియున్న వాతను జూచి "ఇప్పుడు తెలిసినది. నీకును నీ దున్నపోతునకును భేదము లేదనుట విశద మగుచున్నది. నీవు మమ్ము దున్నపోతు లంటివి. ఇపుడు దున్నపో తెవ్వరో నీవే ఆలోచింపు"మని పలికి నవ్విరి.

జ్ఞానదేవుడు వారి అవివేకమునకు విస్మయపడి" మూర్ఖులారా ! మీ అవివేకము నేమందును ? ఈ దున్నపోతునకున్న తెలివిలో సహస్రాంశ

మయిన మీకు లేదనుట విశద మగుచున్న"దని పలికెను. బ్రాహ్మణు లందులకు "ఓరీ ! మూర్ఖుడా! దున్నపోతునకు జ్ఞాన మేమున్నది ? దానికి ఎంతటి జ్ఞానమున్నదో నీకు అంతమాత్రమే ఉన్నది. పెక్కుమాట లెందులకు ? ఇప్పు డీ దున్నపోతునకు గల తెలివిని మాకు చూపితవా మంచిది. లేకున్న నిన్నిక్కడనే పాతిపెట్టెద"మనిరి. జ్ఞానదేవుడు వారిని చూచి "మూర్ఖులారా ! తొందరపడకుడు. దీనికిగల జ్ఞానమును మీకిప్పుడే తెలియజేసెదను, అంతటితోనైన దీనితో మీరు సమానులు కారని మీరే సమ్మతింపగల"రని పలికి, ఆ దున్నపోతు వీపుమీద తన కుడిచేయి పెట్టి, "మహిషేశ్వరా ! ఈ బుద్ధిలేని దురహంకారులు వినునట్లుగా వేదములను చెప్పు"మనెను.

వెంటనే ఆ మహిష ముదాత్తానుదాత్త స్వరిత భేదములతో ఘనపద క్రమము తప్పక వేదములను చెప్ప ప్రారంభించెను. కొంతసేపు తర్వాత జ్ఞానదేవుడు "మహిషరాజమా ! బ్రాహ్మణత్వము తపస్సు చేత గలుగునా ? కులముచేత గలుగునా ? జ్ఞానముచేత గలుగునా ? కర్మముచేత గలుగునా ? వీరికి వివరముగా తెలియజేయు"మనెను. ఆ దున్నపోతు "బ్రాహ్మణత్వము తపస్సుచేత గలిగెడిదేకాని కులము చేతగాని తక్కినవాని చేతగాని కలుగదు. దాసి కడుపున బుట్టిన నారదుడు, శునక గర్భమున బుట్టిన శౌనకుడు, పల్లెదాని కడుపున బుట్టిన వ్యాసుడు మొదలగు మహాత్ములు తపోమహిమచేతనే బ్రహ్మజ్ఞానమును పొంది బ్రాహ్మణులైరి. కాని కులము చేతనైనవారు కారు" అని సప్రమాణముగా చెప్పెను.

వినయముతో ముట్టికాళ్ళు వేసికొని జ్ఞానదేవునకు నమస్కరించెను. జ్ఞానదేవుని హస్తస్పర్శచే నా దున్నబోతు దుస్తరమగు అజ్ఞాన కూపమునుండి బయటపడి సుజ్ఞానమును పొందెను. ఆ బ్రాహ్మణులు ఆశ్చర్యపడి అచట నిలిచియున్న ఏమి కీడు జరుగునో అని భయపడి కాళ్ళకు బుద్ధిచెప్పిరి.

శ్రాద్ధమును నెరవేర్చి బ్రాహ్మణుని రక్షించుట

ఒక బ్రాహ్మణుడు వారి వాదములు విని దున్నపోతు వేదమును చెప్పుట విని ఆశ్చర్యపడి, ఆ బాలురు మహాపురుషులని తెలుసుకుని, వారి వద్దకు వెళ్ళి నమస్కరించి, వారిని అనేక విధముల పొగిడి, వారిని వెంటతీసికొని తనయింటికి పోయెను. వారికి తగిన ఏర్పాటు చేసెను. ఆ గ్రామములోని వైదికులు ఆ విషయమును తెలిసికొని కోపావేశపరులై ఆ బ్రాహ్మణునిమీద దోషారోపణము చేసి, అతనిని తమజాతినుండి వెలివేసిరి. నాటినుండి విప్రులెవ్వరు అతని ఇంటికి పోవుట మానివేసిరి.

ఒకనాడు ఆ బ్రాహ్మణుడు తనతండ్రికి శ్రాద్ధము చేయతలచి తనకు అత్యంత మిత్రులుగానున్న కొందరు బ్రాహ్మణులను నిమంత్రణమునకు పిలిచెను. వారు కులమువారి నిర్బంధమునకు భయపడి "అయ్యా ! నీవు వర్ణభ్రష్టుని కుటుంబమును ఇంట ఉంచుకొని ఆదరించుచుండుటచే సభాపతులు నిన్ను జాతినుండి వెలివేసిరి. కావున మేము వచ్చుటకు వీలుపడ"దని పలికిరి. ఆ బ్రాహ్మణుడు చింతించుచు ఇల్లుచేరి నిట్టూర్పులుగా పరి పరి విధముల చింతించుచుండెను. జ్ఞానదేవుడు అతన్ని చూచి "స్వామీ ! చింతాక్రాంతుడవై ఎందుకు ఉన్నావు?

నీకు కలిగిన ఆపద ఏమిటో తెలియచేయు”మని అడిగెను. ఆ బ్రాహ్మణుడు “నాయనా ! ఏమని తెలుపవలెను ? వ్యర్థముగా నా బ్రాహ్మణత్వము మునిగిపోవునట్టి కాలము వచ్చినది. మిమ్ము నా యింట ఉంచుకొని ఆదరించినందుకు ఈ మూర్ఖ బ్రాహ్మణులు నామీద కోపించి నన్ను జాతినుండి బహిష్కరించినారు. నేడు నా తండ్రి శ్రాద్ధము. బ్రాహ్మణులు రాకపోయిన శ్రాద్ధకర్మ వ్యర్థమగును. ఏమి చేయుటకు తోచక విచారించుచున్నాను” అని పలికెను.

జ్ఞానదేవుడు ఆలోచించి ఇట్టి దుష్టులను ధర్మభ్రష్టులను సర్వోత్కృష్టులనుగా భావించి పూజించుట అవివేకము అనెను. ఆ బ్రాహ్మణుడు “నీమాట వాస్తవమే కాని లోకరీతికి లోబడి ఉన్నంతవరకు లోకులు నడచినట్లే నడువవలిసియుండును. లేనిచో సన్యాసము తీసికొనవలసివచ్చును” అనెను. జ్ఞానదేవుడు “స్వామీ ! బ్రహ్మమును తెలిసికొన్నవాడే బ్రాహ్మణుడనియు, బ్రాహ్మణత్వమునకు తపస్సే కారణమనియు, గుణమే ప్రధానము కాని కులము ప్రధానము కాదనియు సప్రమాణముగా మహిషముచేత చెప్పించినను ఈ మూర్ఖ బ్రాహ్మణులకు బుద్ధి రాలేదు. ఏమిచేసిన వీరికి గుణపాఠం వచ్చునో తెలియటం లేదు. ఇనుముతో గూడిన నిప్పుగూడ సమ్మెటపోట్లు తిన్నట్లు మా సహవాసముతో నిరపరాధుడవగు నీవుగూడ దుఃఖమును అనుభవింపవలసి వచ్చిన”దని బాధపడకు.

ఆ బ్రాహ్మణుడు “పరమార్ధ విషయమై నీవన్నట్లు మనకు ఈ బ్రాహ్మణులతో పనిలేదు. కాని పితృదేవతలకు అర్పించిన అన్నమును

బ్రాహ్మణులే భుజింపవలెననియు, ఇతరులు భుజింపరాదనియు, అట్లు భుజించినచో కర్త కుటుంబ సహితముగా రౌరవాది నరకము అనుభవించుననియు కర్మకాండమునందు విధింపబడి ఉండుటవలన విచారింప వలసివచ్చినది” అనెను.

జ్ఞానదేవుడు “పితృదేవతలకు అర్పించు పదార్ధమును పితృదేవతలైనను, సద్బ్రాహ్మణులైనను భుజింపవలసినదే కాని ఇట్టి వేషధారులు భుజింపకూడదు. వేదములను అధ్యయనముచేసి వాని అర్ధముల గ్రహించి, గ్రహించిన ప్రకారముగా ప్రవర్తించుచు బ్రహ్మ జ్ఞానసంపద పొందిన బ్రాహ్మణోత్తములకే శ్రాద్ధముల యందు భోజనము పెట్టవలసినదని స్మృతులయందు విధించియుండుట చూడలేదా” అనెను. అందుకు బ్రాహ్మణుడు “లోకమున పితృదేవతలను రప్పింపగలిగిన సమర్ధులును, స్మృతులయందు చెప్పబడిన లక్షణములు గల సర్వోత్తములగు బ్రాహ్మణులను కనిపెట్టితేగల బుద్ధిమంతులును లోకములో ఉండుట అరుదు. అందులకు మనము ప్రయత్నముచేయుట వ్యర్ధ”మనెను. జ్ఞానదేవుడు “ఒకవేళ పితృదేవతలే నిమంత్రణమున ఒప్పుకొని వచ్చినచో వారిని పూజించి భోజనాదులతో సంతుష్ఠి పరచుటకు ఏదైనా ఆటంకయు ఉన్నదా ?” అనెను. బ్రాహ్మణుడు “వారికి భోజనములుపెట్టి సంతుష్టి పరచుటకు ఆటంక మేమి ? వారికొరకే గదా మన మీశ్రాద్ధ మొనర్చుట? ప్రత్యక్షముగా పితృదేవతలే వచ్చి మనపూజ అంగీకరించినచో శ్రాద్ధము సఫలత పొందుననుటకు సందేహ మున్నదా“అనెను. జ్ఞానదేవుడు“అలా అయితే పితృదేవతలను అందరిని ఇక్కడ ఇప్పుడే ప్రత్యక్షపరుస్తాను. నీవు

శ్రాద్ధముకు కావలసిన సమస్త పదార్ధములను సిద్ధము చేయుము”అని అతనిని ఒప్పించి అక్షతలని తీసికొని, పైకి చూచి, ఆ బ్రాహ్మణుని ఇంటికివచ్చి శ్రాద్ధమును నెరవేర్చునట్లు పితృదేవతలకు నిమంత్రణము చెప్పెను.

వెంటనే పితృదేవతలు దివ్య విమానములు ఎక్కి ఆకాశమార్గమున ఆ బ్రాహ్మణుని ఇంటికి వచ్చిరి. ఆ బ్రాహ్మణుడు దివ్యతేజోమూర్తులైయున్న పితృదేవతలను కనులపండువగా దర్శించి, భక్తిప్రపత్తులతో వారి అందరిని ఉచితాసనముల కూర్చుండబెట్టి, అర్ఘ్య పాద్యాది విధులతో పూజించి, విస్తళ్ళువేసి సమస్త పదార్ధములను వడ్డించి ‘పితృ రూపో జనార్ధన’యన్న వచనమును చెప్పి, అవపోశనము వేసెను. పితృదేవుత లందరును పరమానంద భరితులై భోజనములు చేయసాగిరి. ఆ గ్రామములోని వైదికులెల్ల మధ్యాహ్నవేళ అకస్మాత్తుగా నా బ్రాహ్మణుని ఇంటికి వచ్చిన దివ్య విమానములను చూచి ఆశ్చర్యపోయి, పరుగెత్తివచ్చి, తమ శరీరకాంతులతో ఆ గృహము అంతయు వెలిగించుచు వరుసగా పీటలమీద కూర్చుండి భోజనములు చేయుచున్న పితృదేవతలను చూచి, ఆశ్చర్యచకితులై, ఏమియు తోచక నిలుచుండిరి. పితృదేవతలు భుజించి సంతుష్టి చెందిన పిదప బ్రాహ్మణుడు వారికి పాదప్రక్షాళనము చేసి దక్షిణ తాంబూలములనిచ్చి భక్తిప్రపత్తులతో నమస్కరించి, స్వస్థానములకు వెళ్ళవచ్చునని వినయముతో పలికెను. పితృదేవతలు సంతసించి అతనిని “పుత్రవంతుడవై చిరాయుష్మంతుడవై సకల సంపదలతో సుఖింతువు గాక”యని ఆశీర్వదించి, విమానములెక్కి ఆకాశమార్గమున పోయిరి.

పైఠణపురవాసు లీవినోదమును చూచి పరమాశ్చర్యముతో "ఓహో! ఎంతటి ఆశ్చర్యము ! ఇట్టి వింత ఎన్నడును చూడలేదు. పితృదేవతలే వచ్చి శ్రాద్ధమును సార్ధక మొనర్చినపుడు చెప్పవలసిన దేమున్నది ? దేవుడేవచ్చి నైవేద్యము ఆరగించిన పూజారి మిడకరించినట్లు పితృదేవతలే నిమంత్రణమున ఒప్పుకొని శ్రాద్ధమును పూర్తిగావించుట చూచి ఈ బ్రాహ్మణులు గుటకలు మ్రింగుచున్నారు. వీరి మూర్ఖత్వమే వీరిని ఈ స్థితికి తెచ్చిన"దని పరి పరి విధముల పలికిరి. బ్రాహ్మణులందరికి గుణపాఠం తెచ్చుకొని "ఆహా ! ఈ నివృత్తిదేవుడును, జ్ఞానదేవుడును, సోపానదేవుడును త్రిమూర్తులు. ముక్తాబాయి సాక్షాత్పరాశక్తి. వీరే జీవన్ముక్తులు. అజ్ఞానులమై వీరి మహత్త్వమును గుర్తింపలేక మనము అపరాధముచేసి పాపము కట్టుకొంటి"మని పశ్చాత్తాపపడి, జ్ఞానదేవుడు మొదలగు వారి పాదములకు పై బడి తమ నేరమును మన్నింపవలెనని అనేక విధముల ప్రార్థించిరి.

జ్ఞానదేవుడు వారిని చూచి, "అయ్యలారా ! కులభ్రష్టులగు మాకు కులశ్రేష్ఠులని ప్రతిష్ట వహించిన మీరు నమస్కరించుట యుక్తము కాదు. మమ్ము తాకి నమస్కరించినచో మీరు అగ్ని ప్రవేశము చేసి దేహత్యాగమే చేసికొనవలసివచ్చును. మీకును మాకును ఎంతో వ్యత్యాసం కలదు. మమల్ని అన్యాయముగా పరిహాసము చేసెదరు" అని పలికెను. బ్రాహ్మణులు "తెలివి తక్కువతనం వలన మేము చేసిన తప్పుకు మన్నించి రక్షింపు"మని ప్రార్థించిరి. అందులకు జ్ఞానదేవుడు "ఆహా ! ఆషాఢభూతి విద్యలలో మిమ్ము మించినవారు లేరు. మీ పని అందిన జుట్టు, అందకున్న

కాళ్ళు పట్టుకొనుట. మీ ముఖముల చూచినను పాపమే. పితృదేవతలు ఆరగించిన పవిత్ర స్థలమున మీవంటి పాపులు ఉండుట మంచిది కాదు. ఇక్కడ నిలువక వెళ్ళిపొమ్మని కసరుకొనెను. బ్రాహ్మణులు దీనులై "స్వామీ! మావంటి పామరు లొకవేళ తెలివిలేక తప్పులను చేసిన నీ వంటి పెద్దలు మన్నింపక త్రోసిపుచ్చిన మా గతి యేమి ? ఇక మమ్ము రక్షించు వారెవ్వరు? మా అపరాధమును మన్నించి మమ్ము మీ శిష్యులుగా అనుగ్రహించి కృతార్ధులనుగా చేయవలె"నని అనేక విధముల బ్రతిమాలిరి.

జ్ఞానదేవుడు వారికి బుద్ధివచ్చినందుకు సంతోషించి, వారి నేరములను మన్నించి, భయపడవలదని ఓదార్చి, పితృదేవతలు భుజించిన స్థలమున విస్తళ్ళు వేయించి, బ్రాహ్మణులను కూర్చుండ చేసెను. వారి ప్రార్ధన ప్రకారము తన అన్నయు, తమ్ముడును, తండ్రియు, తానును వారి పంక్తిని కూర్చుండి భుజించిరి. బ్రాహ్మణులెల్ల వారి మీది యీర్ష్యను వదలి ఒకనాడు సభచేసి" ఈ పరమ పవిత్రులగు మహాత్ములకు ప్రాయశ్చిత్తమా ! వీరి పాదధూళి సోకిన స్థలమే దివ్య స్థలము. వీరు సాక్షాత్పర బ్రహ్మ స్వరూపులు, వీరిని సేవించిన మోక్షము సులభముగా ప్రాప్తించు''నని నిశ్చయించి ఒక శుభముహూర్తమున వారికి ఉపనయనములు చేసి, నిరాక్షేప నిరూపణమును వ్రాసి యిచ్చిరి. జ్ఞానదేవుడు మొదలగు వారు వారి ప్రార్ధనపై వారికి తత్వోపదేశము చేసిరి.

చాంగదేవుడు జ్ఞానదేవుని చూడవచ్చుట

బ్రహ్మ యొక్క ప్రథమ యామమున స్వర్గలోకాధిపత్యమును చేసిన ఇంద్రులు పదునాలుగుమంది కర్మవశముచేత కారాగార బద్ధులై కష్టపడుచుండిరి. ఒకనాడు నారదమహర్షి అక్కడకి వచ్చెను. వారు పరమభక్తితో అతనికి నమస్కరించిరి. అతడు వారిని చూచి చిరునవ్వు నవ్వి, హరి కీర్తనలు పాడుచు పరమానందమున నృత్యము చేయసాగెను. వారిలో చాంగుడను ఇంద్రుడు నారదుడు తమ్ము చూచి నవ్వినందులకు కారణ ఊహించి, భగవద్భక్తి లేక కాలమును వ్యర్థ పుచ్చుట వలననే తమకట్టి దుర్గతి సంభవించినదని గ్రహించి, చేతులు జోడించి, "స్వామీ! నా అవివేకమును ఆత్మ తత్వమును విచారింపక చాల దినముల నుండి ఈ నరకబాధ అనుభవించుచున్నాను. దయయుంచి ఈ కష్టము నుండి విముక్తి చెంది జనన మరణ రహితము అగు శాశ్వతానందం పొందుటకు తగిన మార్గమును తెలియచేయు"మని దీనముగా ప్రార్థించెను.

నారుదుడు అతనిని గూర్చి తీవ్ర ఆలోచన చేసి "చాంగదేవా ! ఈ దేహముతో నీ లోకమున ఉన్నంతవఅకు నీ కోరిక పూర్తికాదు. ఈ దేహమును వదలి భూలోకమున పుట్టి పాండురంగ క్షేత్రమున విఠోబా రూపమున భక్త రక్షణార్ధమై ఇటుక మీద నిలువబడి ఉన్న పరబ్రహ్మమూర్తిని భక్తితో సేవించినగాని నీకు మోక్షము సిద్ధింపదు. దేవతలు నేరుగా మోక్షమునకు అర్హులు కారు. ఎట్టి వారైనను ముక్తి పొందవలెనన్నచో మానవరూపమెత్తక తప్పదు. కావున భూలోకమున మానవుడవై జన్మించి పాండురంగని భక్తితో సేవింపుము. నీకు తప్పక మోక్షము సిద్ధించును.

శ్రీ చాంగ్‌దేవ్ మహారాజ్

ఇది నిశ్చయ"మని పలికెను.

చాంగదేవుడు పరమానంద భరితుడై "స్వామీ ! ఈ దేహమును విడిచి భూలోకమునకు వెళ్ళుటకు సదుపాయమును తెలుపుము" అనెను. నారదుడు అతనికి ద్వాదశాక్షరీ మహామంత్రమును ఉపదేశించెను. చాంగదేవుడు ఆ మంత్రమును భక్తితో విన్నవెంటనే దేహమును వదలి భూలోకమున అతి వృద్ధుడగు విఠోభా రుక్మియను అతనికి కుమారుడై జన్మించెను. ఆ వృద్ధుడు తనకు లేక లేక కలిగిన కుమారుని చూచి అత్యంతప్రీతుడై వానిని కాపాడుచు క్రమముగా ఉపనయనము చేసెను. 16వ సంవత్సరమున వానికి ఒక అందమైన అమ్మాయిని తెచ్చి పెండ్లి చేసెను. వాడు పూర్వ జన్మ వాసనా విశేషమును బట్టి ఇచ్ఛామాత్రమున ఆకాశగమనము మొదలగు వినోదములు అనేకములు చేయుచు, స్వేచ్ఛగా

తిరుగుచుండెను. అతని నోటినుండి పలికిన పలుకులన్నియు ఫలించుచుండెను.

కాలక్రమమున అరువదినాలుగు కళలును పదునాలుగు విద్యలును చాంగదేవుడు చెప్పినట్లు వినుచుండెను. అతని పేరన్న నవకోటి సిద్ధులు సహితము భయపడెను. అతడు తనకు నూరు సంవత్సరములు నిండగనే ప్రాణమును బ్రహ్మాండమునందు దాచియుంచి మృత్యువును వంచించి మరల కొంతకాలమునకు ఆ ప్రాణమును దేహములోని ఆకర్షించి యధా ప్రకారముగా సంచరించు చుండెను. ఇలా చేయుటచే అతనికి ఎన్ని సంవత్సరములయినా జరా మరణములు లేక నవ యౌవ్వనములో ఉండెను. అందువల్ల ప్రజలు అతనిని మహానుభావుడని గౌరవించుచుండిరి. అతడు తపతీ నదీతీరమున ఒక మఠము కట్టించి యందు పదునాలుగు వందలమంది శిష్యులు సేవింపగా నివాసము చేయుచుండెను.

నిరంతరము శిష్య ప్రశిష్యులతో గూడ స్నానార్థమై ఆకాశ మార్గమున గోదావరీ తీరమునకు పోవువాడు. ఇంతటి మహిమ గలవాడైనప్పటికి తనను ఆశ్రయించిన వారికి జ్ఞానోపదేశముచేసి వారి వలన సేవింపబడుచుండెనే కాని తాను మాత్రం ఎన్నడును సద్గురు సేవ చేసినవాడు కాడు. లోకమున తన కంటె తెలివైనవాడు కాని గొప్పవాడుకాని లేడని ఎంచి మిక్కిలి గర్వించుచుండెను. అతని కంటికి యోగులును జ్ఞానులును తృణప్రాయులుగా కనబడుచుండిరి. ఒకనాడు ఇంద్రుడు అతనికి ప్రత్యక్షమై లోకరక్షణార్థమై భూలోకమున త్రిమూర్తులును, ఆదిశక్తియు మానవరూపమున అవతరింతురనియు వారిని

శరణుజొచ్చినచో ముక్తిగలుగును అని బోధించెను.

పైఠణపురములో జ్ఞానదేవు చేయుచున్నలీలలు చూచి ఒక బ్రాహ్మణుడు చాంగదేవుని వద్దకుపోయి, అతనికి నమస్కరించి, జ్ఞానదేవుడు సకుటుంబముగా పైఠణపురమునకు వచ్చుట మొదలుకొని పితృదేవతలను రప్పించి శ్రాద్ధమును నెరవేర్చుట వరకు గల అన్ని విషయములు విశదముగా తెలిపి, వారి మహత్త్వము అనేక విధముల కొనియాడెను. చాంగదేవుడు కొంత ఆలోచించి, ఏమి చేయుటకును తోచక ఏకాంతమున ఉండెను.

అతనికి ఇంద్రుడు తెలిపియుంచిన విషయము గుర్తునకువచ్చి, ఆ త్రిమూర్తులు ఆదిశక్తియే వీరై ఉందురని నిశ్చయించెను. శిష్యులను కొందరిని పిలిచి జ్ఞానదేవుని దర్శించుటకై వెళ్ళవలెననెను. శిష్యులు జ్ఞానదేవుని మహత్త్వమును వినియుండుటచే అతనిని దర్శించిన తమ గురువు ముక్తిని పొందుదురు గదా అని ఆలోచించి అక్కడికి వెళ్ళకుండ ఉండటానికి ఒక ఉపాయము పన్ని “స్వామీ ! నీ విప్పుడే వెళ్ళుట మంచిదికాదు. పత్రికా మూలమున అతని అభిప్రాయమును తెలిసికొని తరువాత వెళ్ళవచ్చును. లేనిచో పరువునకు లోపము వాటిల్లు”నని పలికిరి. అతడు ఆత్మతత్త్వవిచారముచేసి అహంకారమును నాశనము చేసినవాడు కాడు కనుక దురభిమాన సూచకములగు వారి మాటలకు సమ్మతించి, తాళపత్రములను గంటమును తీసికొని, వారిని ఏమని సంబోధించుటకును తోచక, తన శిష్యులను ఇద్దరిని పిలిచి, “మీరు పోయి వారి నలువురిని చూచి మాటాడి వారి స్థితిగతులను ఆచార

వ్యవహారములను చక్కగా తెలుసుకొని వారి యోగ్యతను గూర్చి యా గ్రామస్థులచేత ఒక పత్రికను వ్రాయించి తీసికొని రావలసినద"ని చెప్పి, వట్టి తాటాకుచుట్ట ఒకదానిని వారి చేతికిచ్చి, దానిని దీసికొనివెళ్ళి వారికి ఇవ్వవలసినదని చెప్పెను.

ఆ శిష్యులు అక్కడి నుండి బయలుదేరి, తమ విద్యాప్రభావముచే ఆకాశమార్గమున అలకావతిచేరి సిద్ధోపంతు గృహమునకు వచ్చిరి. జ్ఞానదేవుడు నివృత్తిదేవుని చూచి "అన్నా ! చాంగదేవుని శిష్యులిద్దరు ఇచటికి కార్యార్థమై వచ్చిరి. చాంగదేవుడు ఉత్తుంగ ప్రభావము గలవాడని పలుకుచుండుట వినియుంటిమి. మనకు అతని దర్శనము కొలది కాలములో లభింపనున్నది. తన శిష్యులచేత అతడొక తాళపత్రపు లేఖ పంపియున్నాడు. అందులో ఒక అక్షరమైనను లే"దని చెప్పెను. చాంగదేవుని శిష్యులు ఆ మాటలు విని ఆశ్చర్య చకితులై జ్ఞానదేవుని సమీపించి, అతనికి నమస్కరించి "స్వామీ! నీవు పరబ్రహ్మస్వరూపుడవు; సర్వజ్ఞుడవు. నీకు తెలియని విషయములు లేవు. మేము వచ్చిన విషయము అప్పుడే తెలిసికొంటివి. నీ మహత్త్వమును కొనియాడ మా తరముగా"దని స్తుతించి, తాటాకు లేఖ అతని ఎదుటబెట్టి నిలుచుండిరి.

జ్ఞానదేవుడు తాళపత్రములను విప్పి అది వట్టిదిగా ఉండుట చూచి నివృత్తిదేవునకు చూపి "చాంగదేవుని వివేకమును గుర్తించు"మనెను. నివృత్తిదేవుడు చిరునవ్వుతో ఆ పత్రమును తీసికొని యిటునటు త్రిప్పి ఆశ్చర్యపడి "తమ్ముడా ! ఈ చాంగదేవుడు మరుద్గణాంసమున జన్మించినవాడు. ఇతనికి పదునాలుగు విద్యలు, అరువది నాలుగుకళల

ప్రావీణ్యము, అష్టాంగయోగములు బాగుగా తెలియును. పదునాలుగు వందల సంవత్సరములనుండి దేహమును భద్రముగా కాపాడుకొనుచు మృత్యుభయము లేక విచ్చలవిడిగా సంచరించుచున్నాడు. ఆత్మజ్ఞానమును మాత్రము సంపాదించలేదు. దురభిమానము అతనిని వదలలేదు. అందువలన మనలను తీర్థస్వరూపులనిగాని, చిరంజీవులనిగాని సంబోధించుటకు మనసురాక మనకు లేఖనము వ్రాయుటకు సంశయించి, తన ఆత్మజ్ఞానశూన్యతను తెలియజేయుటకై ఈ వట్టి తాళపత్రములను ఇచ్చి పంపినాడు" అని చెప్పెను. జ్ఞానదేవుడు నవ్వి, తాటాకు గంటము దీసికొని అతనికి "స్వస్తిశ్రీ చాంగదేవునకు, చిత్తగింపవలెను. సచ్చిదానంద పరబ్రహ్మమంతటను నిండియుండగా అల్పమనియు అధికమనియు, గొప్పవాడనియు చిన్నవాడనియు, అధికారి అనియు సేవకుడనియు, మిత్రుడనియు, శత్రువనియు ద్వైతభావ మెట్లుండునో ఆలోచించుము. శరీర మెవ్వరిది ? అందున్న వాడెవ్వడు ? ఈ విషయములను పరిశోధించి చూడుము. యోగ విద్యలవలన మోక్షము సిద్ధింపదు. ఇంద్రియములకు మనస్సే రాజు. రాజును బంధించి చెరసాలయం దుంచిన భటులెల్ల పాఱిపోవుదురు. బ్రహ్మాండము అందుగల పదార్థములెల్ల పిండాండమునందు కలవు కాని మాయ ఆవరించి ఉండుటవలన అవి కనబడుటలేదు. ఆ మాయయొక్క మహిచేతనే నేను నాదియన్న భ్రాంతి కలుగుచున్నది. వివేకముతో తత్వమును విచారింపగా ఆ భ్రాంతి కలుగుచున్నది. ద్వైతమును వదలి అద్వైతమును చూచినచో సర్వమునకు కారణభూతమగు పదార్థమేదో అదియే నీకు నాకు కారణమై ఉన్నది

తెలియు"నని తత్వవిషయముల అరువది ఐదు శ్లోకములలో వ్రాసి, దానిని చాంగదేవుని శిష్యులకిచ్చి, ఆ పత్రమును వారి గురువునకి ఇమ్మని చెప్పెను. వారు జ్ఞానదేవునకు నమస్కరించి, మరల ఆకాశమార్గమున గురుసన్నిధిచేరి, జ్ఞానదేవు ఇచ్చిన పత్రము అతని ఎదుట పెట్టిరి. వారి మహత్త్వమునుగూర్చి వివరించిరి. వారి తేజో విశేషములను చూచిన నిజమూగా త్రిమూర్తులు, పరాశక్తియే అవతరించి ఉందురనుటకు సందేహము లేదనిరి.

జ్ఞానదేవాదులు గోడనెక్కి చాంగదేవుని ఎదుర్కొనుట

చాంగదేవుడు వారు తెలిపిన విషయములు విని, తాళ పత్రమును చదివి, అతని గర్వరాహిత్యమును ప్రశంసించి, అందులోని విషయములను పలుమారు చదివి తనకు బోధపడకుండుటచే వారు తనకంటె గొప్పవారే కాక సంపూర్ణ జ్ఞానులనియు వారిని సందర్శించి పత్రమునందలి విషయముల అర్థమును తెలిసికొనవలెననియు నిశ్చయించెను. తన నిశ్చయమును శిష్యులకు తెలిపి, తన విద్యాబలమున గొప్ప సర్పముల అలంకరించుకొని భయంకరమైన పెద్దపులినెక్కి బయలుదేరెను. అతని శిష్యులును పెద్దపులులను ఎక్కి గొప్ప సర్పములను పట్టుకొను ధ్వజము ఎత్తించుకొని గురు ప్రభావమును వర్ణించుచు ఆడంబరముగా గురువును అనుసరించిరి. వారి ఆడంబరమును చూచి ప్రజలాశ్చర్యపడుచుండిరి. చాంగదేవుడు అలకావతికి దగ్గరగా ఉన్నప్పుడు, జ్ఞానదేవునకు తన ఆగమనవార్తను తెలుపుటకు కొందఱు శిష్యులను పంపెను. వారు

చాంగ్‌దేవుడు శ్రీ జ్ఞానేశ్వర్‌మహారాజ్ వద్దకు పులిపై వచ్చుట

పోవునప్పటికి చాంగదేవుడు తనువద్దకు వచ్చుచున్న విషయమును తెలిసికొని నివృత్తిదేవుడు మొదలుగాగల నలువురును ఒకమొండిగోడ మీద కూర్చుండి చూచుచుండిరి. చాంగదేవుని శిష్యులు వారిని చూచి, నమస్కరించి, తమ గురువు వర్తమానమును తెలియచేసిరి. జ్ఞానదేవుడు మున్నగువారు చాంగదేవు ఎదుర్కొనుటకై బయలుదేరు చుంటిమనిరి. ప్రజలు మూకలుగట్టి వేడుకచూచుటకై రాసాగిరి. జ్ఞానదేవుడు తాము కూర్చున్న మొండిగోడను చూచి "సిద్ధవర్యుడని ప్రసిద్ధి వహించిన చాంగదేవుడు శిష్యప్రశిష్యలతో గూడ వ్యాఘ్రమును ఎక్కి మనకడకు

వచ్చుచున్నాడు. ఆయనను మనము గౌరవింపవలెను. కాన నీవు తొందరగా నడువవలెను" అనెను.

వెంటనే గోడ మహావేగమున నడువసాగెను. జనులు ఆశ్చర్యపడి కరతాళ ధ్వనులు చేయుచు జయ జయ ధ్వనులతో గంతులు వేయసాగిరి. చాంగదేవుడు ఎదురుగా వచ్చి ఆ వినోదమును చూచి ఆశ్చర్యచకితుడై నిర్జీవమగు వస్తువు మీద కూర్చుండి వచ్చుచున్న సద్గురు శిఖామణిముందు సజీవవాహనము ఎక్కిపోవుట తన పరువునకు తగని పని అని సిగ్గుపడెను. పులిమీదనుండి దిగి చేతులు జోడించి నడచివచ్చి, ఆ నలువురికి సాష్టాంగముగా నమస్కరించెను. శిష్యులును దిగి పాదచారులై అతనివెంట వచ్చి జ్ఞానదేవుడు మొదలగు వారికి నమస్కరించి దూరముగా నిలుచుండిరి. పెద్దపులులు వెళ్ళిపోయెను. నివృత్తి దేవాదులు గోడనుండి క్రిందికిదిగి చాంగదేవునకును, శిష్యులకును ప్రతినమస్కారములుచేసి, చాంగదేవుడిని ఆలింగనము చేసికొని ఒక్క మఱ్ఱిచెట్టు క్రింద విశ్రమించి సరస సల్లాపములతో కొంతసేపు సమయము గడిపిరి. నివృత్తి దేవాదులు భగవద్ధ్యానము చేయుచు, మంత్రముల జపించుచు, భగవంతుని స్తుతించుచు, సాలగ్రాముల పూజించుచు, రామాయణాది సద్గ్రంథముల పారాయణము చేయుచు నిశ్చింతగా ఉండిరి. చాంగదేవుడు వారి సామాన్యచర్యలకు ఆశ్చర్యపడి, ఇంతటి సామాన్యక్రియ లొనర్చు వీరు అద్భుత క్రియల నెట్లు చేసియుందురని ఆలోచించి, జ్ఞానదేవునితో "స్వామీ! మీరందరీ నిర్జీవ వాహనమును ఎట్లు నడిపితిరో తెలుపు"మనెను.

జ్ఞానదేవుడు "ఈవిద్య గోప్యమైనది. అయినను నీకు కొంత తెలిపెదను. శ్రద్ధగా వినుము. భగవత్సంకల్పము లేక గడ్డిపోచయును కదలదు. ఎంత గొప్ప కార్యమైనను భగవంతుడు తలచినచో సులభముగా జరుగును. శ్రీరామావతారమున సముద్రమున వంతెన వేసి వానరులు లంకను ముట్టడించిరి.

సూర్యకిరణములు సోకినంతనే చీకట్లు మటుమాయమై పోవునట్లు భగవదనుగ్రహము కలిగినంతనే బుద్ధిని ఆవరించి ఉన్నటి అజ్ఞానము తొలగిపోవును. ప్రపంచమంతయు భగవల్లీలయే కాని వేరుకాదు. అతని శక్తిని వర్ణింప వీలుపడదు. సర్వమును తానై, సచ్చిదానంద స్వరూపుడై, ఆద్యంత రహితుడై, అప్రమేయుడై, సర్వశక్తుడై ఉన్న పరమాత్మ తన మహత్త్వముచే దేనినైన నడుపగలడు.

ఆకాశము తాను లేకపోయినచో
సకలలోకములకు అవకాశమే లేకుండు ననుచున్నది.
వాయువు తాను లేకున్న ప్రాణులకు నిలువ వీలులేదనుచున్నది.
అగ్ని తాను లేకున్న ప్రపంచ వ్యవహార మేమియు జరుగదనుచున్నది.
జలము తాను లేకున్న ఏ జంతువైనను జీవింప లేదనుచున్నది.
భూమి తాను లేకున్న
జీవకోటి అంతటికిని పట్టులేకపోవు అనుచున్నది.

ఇట్లు జడములగు పంచభూతములే ప్రపంచ కార్యములనెల్ల నడుపుచున్నపుడు మహాభూతముల అన్నింటికి ఆధారభూతుడై వెలయుచున్న పరమాత్మునికి ఈ గోడను నడుపుట గొప్పకా"దని పలికెను.

చాంగదేవుడు అదియంతయు చక్కగా విని, సంతోషభరితుడై, వెంటనే లేచి, అతని పాదములకు నమస్కరించి, చేతులు జోడించి "స్వామీ ! నేను అజ్ఞానాంధకారములో చిక్కి సుజ్ఞానమార్గమును కానక చిత్రశ్రమ పడుచుంటిని. నా మీద పరిపూర్ణకటాక్ష ముంచి కృతార్థుణిగా చేయుము"అని ప్రార్థించెను.

జ్ఞానదేవుడు చాంగదేవుడను ఆదరించి "అయ్యా ! నీవు మరుద్గణాంశ సంభూతుడవయ్యు షట్చక్రములను భేదించి యోగసిద్ధి పొందియు మోహకరములగు మాయ విద్యలచేత జనులను భ్రమింపజేసి గౌరవమును వహించితివేకాని ఆత్మ తరుణోపాయమును గురించి ఎంతమాత్రమును ఆలోచించలేదు. పనికిమాలిన విద్యలచే వ్యర్థముగా పదునాలుగువందల సంవత్సరముల కాలమును వృధాచేశావు. నీ అవివేకమును ఏమనవలెను. దురభిమానముచే దుస్సాంగత్యము కలిగి కాలమును వ్యర్థపుచ్చు నిరర్థకులు దుర్గతిని పొందుదురు. మన ఈ కలయిక వల్ల, నా జీవితమునకు మోక్షము లభించునని, భవసాగరమునుండి తరింపచేయమని అనేక విధముల ప్రార్థించెను.

ముక్తాబాయి చాంగదేవుని చూచి "అయ్యా ! నీవింత వరకు దురభిమానములో ఉన్నందున తత్వ విషయమై నీకు తెలియలేదు. మాయ విద్యలను గ్రహించుటలో ఇచ్చిన శ్రద్ధలో సగమైనను తత్వవిషయమును గ్రహించుటలో ఇచ్చియున్న ఇప్పటికి ఎంతయో ప్రబుద్ధుడవై ఉండువాడవు. జరిగినదేదో జరిగిపోయినది. ఇంతటితోనైనను జాగ్రత్తపడి, నీవు ఎవరు అన్నది నీ కీ దురభిమానము ఎట్లు వచ్చినదియు విచారించినచో సర్వ

మాత్మ స్వరూపమే అనెడి యదార్ధ జ్ఞానము పట్టుబడి నీవు మోక్షం పొందెదవని" చెప్పెను. వారు కూర్చుండి తత్వ విషయమును గూర్చి మాటాడిన స్థలమున ఉన్న మఱ్ఱిచెట్టు ఇప్పటికిని విశ్రాంతి వటమని పిలుస్తూ, దాన్ని సేవిస్తున్నారు.

జ్ఞానదేవుడు నివృత్తి దేవునితో "అన్నా ! మధ్యాహ్నమైనది. చాంగదేవుని శిష్యులతో కూడ భోజనమునకు మన ఆశ్రమమునకు తీసికొని వెళ్ళుద"మని పలికి, వారందరిని వెంటబెట్టుకొని బయలుదేరి మెల్లగా అలకావతి చేరి తన మఠమున అంతా దర్భాసనములపై కూర్చుండ చేసి దేహాభిమానమును పోగొట్టు ఉపాయమాలోచించు చుండెను. జ్ఞానదేవుడు చాంగదేవునితో "శిష్యులతో కూడ స్నానాదులను ముగించి భోజనమునకు సిద్ధము" కమ్మనెను. చాంగదేవుడు స్నానముచేసి వచ్చి నిత్య విధులు నిర్వర్తించుకొని శిష్యులతో కూడ వచ్చి మఠమున కూర్చుండెను. పంచాగ్నులు ప్రజ్వలింపుచున్న సోపానదేవుని వీపుమీద ముక్తాబాయి పక్వాన్నములను సిద్ధము చేయుచుండెను. చాంగదేవుడు విస్మయమంది వారి మహత్త్వము అనేక విధముల అభివర్ణించు చుండెను. ముక్తాబాయి సమస్త పదార్ధములను తయారుచేసి నిమిష మాత్రములో నెల్ల వారికి వడ్డించెను. అందరును సంతుష్టిగా భుజించిరి.

చాంగదేవుడు జ్ఞానదేవునితో "తాళ పత్రమునందలి విషయముల భావమును విపులముగా తెలియజేయు" అనెను. జ్ఞానదేవుడు "దీనిని నీ శిష్యుల చేతికిచ్చిన ఇందులోని అర్థ ఎవ్వడైనను తెలియజేయగల"డనెను. చాంగదేవుడు పధ్నాలుగు వందల శిష్యులలో ప్రముఖుడగు ఒకని చేతికా

తాళపత్రము లిచ్చి బాగుగా ఆలోచించి తెల్లవారువరకు దాని అర్థమును తెలుపుమనెను. ఆ శిష్యుడు తక్కిన వారికి ఆ విషయమును తెలిపెను. ఎవ్వరికిని దాని అర్థము తెలియలేదు. శిష్యులందరూ "మనము చాంగదేవుడు గొప్పవాడని ఆశ్రయించి ఎన్నో గొప్పలు చెప్పితిమి. విద్యలు నేర్చినంత మాత్రమున నిగ్రహానుగ్రహ సమర్థులగు మహాత్ముల భావమును గ్రహించి చెప్పగలిగినంత జ్ఞానము లేదు. ఎంత ఆలోచించినా అర్థం తెలియటం లేదు. తల కొట్టుకొన్నను తాత్పర్యము తెలియకున్నది. తెల్లవారేసరికి దీని అర్థమును చెప్పకపోయిన మన ప్రాణము మీదికే వచ్చును. మన శిష్యత్వము ఇతనికి లేదు. ఈయన గురుత్వము మనకక్కర లేదు. మనము జాగ్రత్తపడి ఇక్కడి నుండి వెళ్ళిపోతే మంచి"దని ఆలోచించి ఆ అర్ధరాత్రి ఎవ్వరితోను చెప్పక బయలుదేరి పారిపోయిరి.

తెల్లవారగనే చాంగదేవుడు లేచి శిష్యులందరూ ఏకకాలమున తప్పించుకొని పారిపోయినందులకు మిగుల బాధపడి, చక్రతీర్థమునకు పోయి, స్నాన సంధ్యా ధ్యనుష్టానములను ముగించి తిరిగి వచ్చి, జ్ఞానదేవాదులకు నమస్కరించి, తన శిష్యులు అందరూ పారిపోయిన విషయమును తెలిపి, చేతనున్న తాళపత్రమును వారి ఎదుట నుంచి, దాని అర్థమును తెలియజేసి కృతార్థుని చేయుడని అనేక విధముల ప్రార్థించెను. వారందరును శిష్యులు పారిపోవుట విని నవ్విరి. జ్ఞాన దేవాదులు ముక్తాబాయితో "చాంగదేవునకు తత్వోపదేశము చేసి కృతార్థునిగా చేయుము" అనిరి.

ముక్తాబాయి చాంగదేవునకు తత్వోపదేశము చేయుట

ముక్తాబాయి చాంగదేవుని తన సమీపమున కూర్చుండ చేసికొని మృదువైన మాటలతో “నాయనా ! సంసారమను కీకారణ్యమతి భయంకరమైనది దాని నుండి బయటపడవలెన్న అనేక ఉపద్రవములు ఎదుర్కొనవలెను. లౌకిక కర్మములు అన్ని మాని పరలోక సుఖములకు ప్రధాన సాధనములగు నిత్య నైమిత్తికాది కర్మములను నిరంతరము ప్రతిఫలాపేక్ష లేక భగవత్ప్రీతిగా చేయుచు, దైవానుగ్రహమువలన పరిశుద్ధ చిత్తమును పొంది, భూమి, పర్వతము, జలము, అగ్ని, వాయువు, ఆకాశము, సూర్యుడు, చంద్రుడు, పావురము, అజగరము, సముద్రము, మిడుత, తేనెటీగ, తుమ్మెద, ఏనుగు, జింక, చేప, వేశ్య, కురరపక్షి, శిశువు, కన్య, శరకర్త, పాము, సాలెపురుగ, కందురీగ – వీని గుణములను బాగుగా గ్రహించి, వీటిని ఆదర్శముగా తీసికొని ఆ ప్రకారముగా ప్రవర్తించినచో జీవుడు పరమాత్మను తెలుసుకొనుటకు అర్హత కలిగి, పరమాత్మను చేరుకోగలగుతాడు. పరమార్ధ విషయమున ఆ పదార్ధముల గుణములను గ్రహించి ఉపయోగించు ఎలా అని అనుమానం నీకు కలుగవచ్చును. శ్రద్ధగా వినుము.

భూమి సమస్త జంతువులకు ఆశ్రయమై వారి కార్యములకెల్ల సహించి ఉన్నట్లు ముముక్షువు అన్నివేళల ఓర్పు వహించి ఉండవలెను. పర్వతము, తృణ, వృక్ష, గుల్మాదులు నదులు మున్నగు వానినెల్ల శిరమున వహించి జీవకోటికెల్ల ఉపకరించునట్లు స్వార్ధము లేక పరుల విషయమై నిరంతరము ఉపకార స్మృతి కలిగి ఉండవలెను. జలము పారిశుద్ధ్య

మాధుర్యాది గుణములచే స్నాన పానాదులకు యోగ్యమై ఉండునట్లు సత్ప్రవర్తనముచే ఎల్లప్పుడును శుచిర్భూతుడై ఉండవలయును. అగ్ని ఎప్పుడు చీకటితో చేరక తేజోమయమై ఉండునట్లు అజ్ఞానముచే కళ్ళుమూసుకోక, జ్ఞానవంతుడై ఉండవలయును. సమిధలు మొదలగు వానిచేత వెలుగునట్లు ముముక్షువు శుద్ధతపస్సుచేత వెలుగవలయును. తనకు అప్రయత్నముగా లభించిన వస్తువులను నిలువ ఉంచక తక్షణమే భక్షించునట్లు భావికాలాపేక్ష లేక ఎప్పుడు దొరకిన దాని నప్పుడు వినియోగింపవలయును. అగ్నిహోత్రము పదార్థములందు రుచిపక్వము పెంచనట్లు ముముక్షువును తనకు లభించిన వస్తువులందు రుచిపక్వములు చూడరాదు. అరణిని మథించి ప్రజ్వలింప చేయునట్లు ముముక్షువు నిధి ధ్యానరూపమథనముచే జ్ఞానమును ప్రజ్వలింపజేసి పరమాత్మను దర్శింపవలెను. అగ్ని తనను ఉపాసించు వారిపాపములను నిరసించుచు తన కర్పించబడిన హవ్య కవ్యములను స్వీకరించునట్లు ముముక్షువును ఆశ్రయించిన వారిపాపములను తొలగించుచు వారు సమర్పించిన పదార్థములను స్వీకరింపవలెను. జీవుడు దేవతిర్య ఙ్మనుష్యాది శరీరములందు ప్రవేశించి చంద్ర, కొఱవి, చింత మొదలగు కాష్ఠ విశేషములందు జ్వాలా భేదములచేత అగ్ని ప్రకాశించునట్లు నానారూపములతో ప్రకాశించుచున్నాడు. వాయువు మందవేగములు, సుగంధ దుర్గంధములు, శీతోష్ణములు మున్నగు గుణములతో గూడి వీచుచున్నను ఆ గుణములెల్ల వాయువునకు సంసర్గదోషమువలన కలిగినవే కాని సహజములు కానట్లు దేహమునందు ఆత్మకు కర్మవశమున

సంభవించు సుఖదుఃఖాది వికారములెల్లను అజ్ఞానవశమున తోచునవేకాని సహజములు కావు. ఆహారమును పూర్తిగా వదలిన దేహము క్షీణించును. శరీరము క్షీణించినచో మన స్థైర్యము పోవును. మన స్థైర్యము చెడినమీదట ఆత్మానుసంధానము జరుగదు. ఆత్మానుసంధానము లేనిచో కడతేరుటకు వీలులేదు. అందువల్ల మితాహారము అత్యావశ్యకము.

ఆకాశము సమస్త పదార్థములందు నిండి ఉండియు దేనియందును ఉండక విలక్షణమై ఉన్నట్లు పరమాత్మ సమస్త పదార్థముల బాహ్యాంతరములయందు నిండియున్న అన్నింటియందు విలక్షణమై ఉన్నది. ఆకాశములో తనయందు ఉన్న మేఘములు మెరుపులు మున్నగువానిని వేనిని స్పృశింపనట్లు పరమాత్మయు కాలవశమున తనయందు ఉంచుకొని స్థితిలయములను వేనిని పొందక సచ్చిదానందముగా ప్రకాశించును.

సూర్యుడు తన కిరణములచేత నీటిని ఆకర్షించుచున్నను తానుపయోగించుకొనక మళ్ళీ వర్షరూపంలో మూలమున భూమికి వదలినట్లు, ముముక్షువు తనకు ఇతరులిచ్చిన పదార్థములను పుచ్చుకొన్నను తనకొరకు ఉంచుకొనక తన్నాశ్రయించినవారికి పంచిపెట్టవలయును. శ్రోత్రాదికములగు ఇంద్రియములచేత శబ్దాది విషయములను గ్రహించినను మనస్సు నందుంచక వానిని వెంటనే తొలగింపవలెను. వృద్ధి క్షయములు చంద్రకళకే కాని చంద్రునకు లేనట్లు షడ్భావవికారములు శరీరమునకేగాని ఆత్మకు లేవు. పావురము తన ఆడపావురము, పిల్లలపై నున్న స్నేహానుబంధముతో వలలో చిక్కి నశించునట్లుగా ఈషణ త్రయమునందు ఆసక్తి కలవాడు ప్రకృతిబద్ధుడై మానవజన్మమును

వ్యర్థముచేసి సంసార సాగరమున పడి సంతత దుఃఖము అనుభవించును. అజగర మప్రయత్నముగా తనకు లభించిన ఆహారమును తిని తృప్తిచెందనట్లు ముముక్షువు తనకు లభించిన పదార్ధమును రుచియెంచక భుజించి తృప్తి చెందవలయును.

సముద్ర ఎప్పుడును గాంభీర్య ప్రసన్నతలు కలిగి, కలతచెందక నిశ్చలతపొంది, నదులువచ్చి చేరినపుడు ఉప్పొంగకయు నదులు రాకపోయిన బాధపడక ఒకే విధమున ఉండునట్లు జ్ఞాని ఎప్పుడును లోపల ప్రసన్నతయు లోపగాంభీర్యమును కలిగి పరులకు లోబడక వారి వలన క్షోభ మొందక చిత్తస్థైర్యమును పొంది తనకు సంభవించు మంచిచెడ్డలకు మోదఖేదముల పొందక సమచిత్తుడై ఉండవలయును. మిడుత రాత్రివేళ అగ్నిచూచి యుక్తాయుక్తములను విచారింపక భ్రమించి అందులో పడినాశనము పొందునట్లు, శక్తికిమించిన కార్యములయందు ప్రవేశించువాడు తప్పక నశించును. తేనెటీగ ఏ పుష్పమునం దెంతమాత్రము తేనె దొరుకునో అంతమాత్రమే త్రాగి, ఆ పుష్పమును విడిచి మరియొక పుష్పమునకు పోవునట్లు ముముక్షు ఎవరెవరె ఎంతమాత్రమిచ్చినారో, అంతటితో తృప్తి నొందుచుండవలెను.

తేనెటీగ తాను తినక కూడబెట్టిన తేనె ఇతరుల పాలుచేసి చెడిపోవునట్లు, సంచయేచ్ఛ గలవాడు నశించునని గుర్తించి దొరకిన దానితో సంతుష్టికలిగి జీవింపవలయును. తుమ్మెద వివిధ పుష్పములయందలి రసమును పానముచేసి సంతుష్టి చెందునట్లు ముముక్షువు సకలశాస్త్రముల సారాంశముల గ్రహించి తుష్టి

చెందవలయును. మగ ఏనుగు ఆడయేనుగుతో సంపర్క సుఖమునకు తలపెట్టి మానవులకు చిక్కినట్లు, స్పర్శ సుఖము అపేక్షించినవాడు మోహపాశముచేత కట్టబడి శిక్షకు పాత్రుడగును. కావున యోగి కఱ్ఱతో తయారుచేసిన స్త్రీ ప్రతిమైనను తాకగూడదు. జింక వీనుల కింపుగా వినబడిన రాగమునకు మోహపడి వలలో చిక్కినట్లు మోక్షాపేక్ష గలవాడు గ్రామ్యగీతములకు చెవి యొగ్గినచో చెడిపోవును. చేప గాలమున గ్రుచ్చియున్న ఆ పురుగుకు ఆశపడి, తన ప్రాణమునకు ముప్పుతెచ్చుకొనునట్లు, జిహ్వా చాపల్యమునకు చిక్కి, రుచ్యములగు పదార్థముల అపేక్షించిన మృత్యువును ఎరుగవలసివచ్చును. జిహ్వాచాపల్యము వదలువరకు విషయచాపల్యములు వదలవు. నాలుకను జయించినచో తక్కిన ఇంద్రియములెల్ల సులభముగా జయింపబడును. రుచిపక్వముల లెక్కింపక మితాహారమును తీసుకున్నచో ఇంద్రియములు బలహీనములై ఆత్మకు వశమగును.

ఒక వేశ్య ద్రవ్యమును సంపాదించవలెననెడి దురాశచే ధనము ఎక్కువగా నిచ్చిన వానిని భర్తగా వరింపదలచి చక్కగా అలంకరించుకొని విధివాకిట నిలచి తెల్లవారు వరకు విటుల రాకకు ఎదురు చూచుచుండును. తనకు కావలసినంత ధనమిచ్చువాడు రాలేదు. తన కోరిక నెరవేరకుండుటచే విసిగి, పడక గదికి వెళ్ళి "నేనెంత మూర్ఖురాలను, సర్వాంతర్యామి అగు భగవానుడిని సేవింపక తుచ్ఛమగు పురుష దేహ స్పర్శకు ఆశపడి ఇంతకాలమును వ్యర్థమొనర్చితిని. ఇక నీ దురాశా పిశాచమునకు చోటీయక ఆత్మ భర్తయగు సకల లోకకర్తను మనస్సున నిలిపి నిరంతరం

అతనితో లక్ష్మీదేవి వలె సరస సల్లాప సుఖ అనుభవించుచు ఆనంద పారవశ్యమున పొందుచుందు"అని నిశ్చయించి, నిశ్చల చిత్తంతో నిద్రించెను. అలాగే మానవుడు కామనిగ్రహన మిహపర సుఖదాయక మని తలచి మెలగవలయును. పక్షి శ్రమపడి సంపాదించి మాంసమును తెచ్చుకొన్నప్పుడు తక్కిన పక్షులు దాని మీదపడి ముక్కులతో ఎక్కి కాళ్ళతో రక్కి నానాబాధలు పెట్టియది మాంసపు ముక్కను వదలి వేయగనే దాని జోలికిపోక మానుకొనును. కావున ఇష్టమైన వస్తువును సంపాదించుట యందు దుఃఖమును దానిని విడుచట యందు సుఖమును కలుగును.

ఒక బీద కన్య తన ఇంటికి బంధువులు రాగా బియ్యము లేకుండుటచే ధాన్యమును దంచ ఆరంభించి గాజులు ఘల్లు ఘల్లుమని శబ్దము చేయగా విసిగి వాని ఒక్కొక్కొటిగా తీసివేసి మంగళ సూచకముగా చేతి కొక్క గాజు ఉంచుకొని దారిద్ర్య సూచకమగు కంకణ ధ్వాని అణగినందులకు సంతోషించి తన పనిని నెరవేర్చెను. కావున అనేకులతో కూడి ముచ్చట ఆరంభించిన గుట్టుచెడి కలహములు సంభవించి మనో విచారము కలుగునని ఆలోచించి, ముముక్షువెవ్వరితోను చేరక ఒంటరిగా ఉండవలయును. వైరాగ్యమనగా ఇంద్రియములను విషయముల వైపు పోకుండ నిర్బంధము చేయుట. అభ్యాస యోగమనగా మనస్సును పరమాత్మయందు నిశ్చలముగా నిలుపుటకై అలవరచుట. విషయాసక్తి పూర్తిగా నశించిన గాని పరమాత్మను దర్శించుట ఆసక్తి కలుగదు. అభ్యాస వైరాగ్యము అన్యోన్య సహకారులు.

సర్పము ఒంటరిగా నివసించుచు జాగ్రత్త కలిగి ఉండునట్లు జ్ఞానవంతుడు ఉన్న గృహములయందు నివసించుచు ఏకాంత స్థలములో ఉంటూ, జాగ్రత్త కలిగి నిర్విచారముగా ఉండవలయును. కందురీగ ఒక పురుగును తెచ్చి తన గూటి యందుంచి దాని చుట్టు ఝుంకారము చేయుచు తిరుగుచుండ ఆ పురుగు భయముచేత తన లక్ష్యము అంతయు నా కందురీగ యందే ఉంచి తుదకు దానిరూపమునే పొందునట్లు దేహధారి యే పదార్ధమునందు దృఢముగా మనస్సు నిలిపి ధ్యానము చేయునో ఆ పదార్ధము యొక్క స్వరూపమును పొందును. అందువలన నిరంతరము భగవత్స్వరూపము నందు చిత్తము నిలిపి ధ్యానింపవలయును.

ఈ విషయము మనస్సునందు స్థిరముగా ఉంచి, దేనియందు భేదభావం తనకు లేవని నిశ్చయించి, కర్మాను సారముగా సంప్రాప్తించినవాని అనుభవించుచు, అంతర్లీనముగా లక్ష్యముంచి ప్రవర్తించుచున్న యెడల అహంకార మమకారములు నశించి నిర్వికల్ప

చాంగ్‌దేవుని సమాధి, పుణతాంబె

బ్రహ్మానందము తనంత తానే సిద్ధించును” అని బోధించెను. హస్త మస్తక సంయోగముచేసి, ‘తత్వమసి’ యను మహా వాక్యమును తాత్పర్య సహితముగా నుపదేశించి, కృతార్థుడవు కమ్మని ఆశీర్వదించెను.

చాంగదేవుడు పరమానందము నొంది ముక్తాబాయికిని, నివృత్తిదేవునకును, జ్ఞానదేవునకును, సోపానదేవునకును నమస్కరించి వారి అనేక విధముల నుతించెను. వారి యాజ్ఞప్రకారము చాంగదేవుడు పాండురంగని సేవించుటకై పుండరీక క్షేత్రమునకు వెళ్ళెను.

చాంగ్‌దేవునికి శ్రీ జ్ఞానేశ్వర్‌మహారాజ్ జ్ఞానబోధ చేయుట

4. విసోబా మూర్ఖత్వము - శ్రీజ్ఞానదేవుడు నేర్పిన గుణపాఠం

ఆ పట్టణమున విసోబా అను ఒక గొప్ప ధనికుడుండెను. అతడు ధనమున్నదన్న గర్వంతో విచ్చల విడిగా తిరుగుచుండెను. ఆ పట్టణములోని ప్రజలు అతనికి ఋణపడియుండుటచే అతనికి భయపడుచుండిరి, అతడు జ్ఞానదేవాదులు సన్యాసి పుత్రులను అసూయచే వారికి అనేక విధముల నిందించుచుండెను.

ఒకనాడు దీపావళి పండుగ వచ్చెను. నివృత్తి దేవుడు ముక్తాబాయితో "అమ్మా ! సాధువులకు విందుచేయవలెను. మందిగలు (ఒకరకమైన దోసలు) చేయు"మనెను. ముక్తాబాయి వానిని కాల్చుటకు ఒక బాన కావలసివచ్చుటచే దానికొరకు కుమ్మరివాని ఇంటికి పోవుచుండెను. ఆమె విసోబాను చూచి, వానికి ఎదురుగా పోకుండా, చాటున నిలిచెను. ఆ దుర్మార్గుడామెను చూచి సమీపించి, "ఓసీ ! దుష్టురాలా ! ఎచటికి వెళ్ళుచున్నావు ? ఈ గ్రామమును వదలిపోగూడదా? ఈ పట్టణములో కొందరు కులభ్రష్టులగు మిమ్ము చేర్చుకొని అందరిని చెడగొట్టెచున్నా"రని పలికెను. ముక్తాబాయి భయపడి ఇంటికి పరుగెత్తెను. వాడామెను వెంటాడి జుట్టు పట్టుకొని తలమీద కొట్టి ఎక్కడికి వెళుతున్నావు?" అని నిలదీసి అడిగెను. ఆమె "దీపావళి పండుగకు మండిగలు చేయుటకొర్కై కుండలు కోసం కుమ్మరివాని ఇంటికి వెళ్ళుచుంటిని" అనెను. అప్పుడు విసోబా ఆమెను తిడుతూ, అక్కడినుండి కుమ్మరివాని ఇంటికి పోయి, జ్ఞానదేవాదులకు తను చెప్పకుండా ఏ

రకమైన సహాయం చేయకూడదని చెప్పి, తన దారిన వెళ్ళిపోయెను.

ముక్తాబాయి కుమ్మరివాని ఇంటికి వెళ్ళి కుండల కొరకు ఎంత బ్రతిమిలాడినా వాడు కుండలను ఇచ్చుటకు నిరాకరించెను. ఆమె ఇంటికివచ్చి విచారించుచు జ్ఞానదేవునికి ఆ విషయములన్నియు తెలిపెను. జ్ఞానదేవుడు ఆమెను ఓదార్చి, రాగద్వేషాలనే వికారాలకు బాధపడవద్దని, విసోబాకూడ మనవాడే కాని పరాయివాడు కాదు అని ఆమెను ఓదార్చెను. స్నానము చేసి మడి కట్టుకొని రమ్మనెను. విసోబా ఏమి జరుగునో చూడాలని కుతూహలముతో జ్ఞానదేవుని ఇంటికి వచ్చి, చాటుగా దాక్కుని అంతా గమనించుచుండెను. జ్ఞానదేవుడు సిద్ధాసనము వేసికొని కూర్చుండి ధారణామహత్త్వమున జఠరాగ్నిని ప్రజ్వలింపజేసెను. అతని నోటనుండి అగ్నిజ్వాలలు భగ్గున వచ్చెను. వీపు వేడిమిచేత కుంపటిపైన పెనమున్నట్లు కనకనలాడుచుండెను. అతడు తన చెల్లెలిని బిలిచి "భక్ష్యములను తయారు చేసికొను"మనెను. ముక్తాబాయి అతని వీపుమీద పాకము చేసి క్రొత్త కుండలో పెట్టి భద్రపఱచెను. జ్ఞానదేవుడు జఠరాగ్నిని ఉపశమింప చేసికొని భగవధ్యానము చేయుచుండెను. జ్ఞానదేవుడు మొదలగువారు సాధువులందరను విస్తళ్ళ ముందు పీటలమీద కూర్చుండజేసి, తాము వారిపంక్తిని కూర్చుండిరి. ముక్తాబాయి పదార్థములనెల్ల వడ్డించెను. అందరును అవపోశము పట్టి భుజించుచుండిరి. ఇదంతయు చూచుచున్న విసోబా తన అవివేకము వలన వారిని నిందించినందులకు మిగుల చింతించి, వారిని, శరణుకోరుటయే కర్తవ్యమనియు, వారు తినగా మిగిలిన అన్నమును తినుటయే తనకు సరైన శిక్ష అని నిశ్చయించి, లోనికేగి

జ్ఞానదేవుని విస్తరిలోని పదార్ధములో కొన్ని మెతుకులు తీసుకొని కన్నులకద్దుకొని నోటిలో పెట్టుకొని తినుట ప్రారంభించెను.

జ్ఞానదేవుడా "ఏమి ! నీవు ఖేచరుడవుగా ఉన్నావు ! ఛీ ! ఇక్కడినుండి వెడలిపొ"మ్మనెను. విఠోబా అతని నోటినుండి వచ్చిన మాటనే తనకు తత్వోపదేశముగా గ్రహించి, వారికి నమస్కరించి, క్షమాపణవేడి, అచటినుండి వెళ్ళిపోయి, ప్రపంచ వ్యాపారములను మాని, పరమాత్మయందు చిత్తముంచి జీవించుచుండెను. జ్ఞానదేవుడు ఖేచరనుడటచే నాటినుండి అతనికి విసోబా ఖేచరుడను పేరు సుప్రసిద్ధమయ్యెను. జ్ఞానదేవుని దివ్యప్రసాదము స్వీకరించి అప్పటినుండి అతనివలన నా గ్రామస్థులకు ఎట్టిబాధ కలుగలేదు.

ఒకనాడు విసోబా జ్ఞానదేవునికడకు వచ్చి, అతనికి నమస్కరించి "స్వామీ ! మీ అనుగ్రహామువలన కృతార్థుడనైతిని. నీవు ఇచ్చిన మిగిలిన ప్రసాదము సేవించుటవలన ఆ మహిమచేత నా దుర్గుణములన్ని నశించినవి ఇక నేనెట్లు ప్రవర్తింపవలయునో సెలవి"మ్మని ప్రార్థించెను. జ్ఞానదేవుడు విసోబాను చూసి చిరునవ్వుతో "బ్రహ్మమే తానన్న నిశ్చయ జ్ఞానము చేత దశేంద్రియములను వానికి కారణముగానున్న మనస్సును నిగ్రహించి, అరిషడ్వర్గమును జయించి, నిర్మల బ్రహ్మాకార వృత్తిచేత కేవల పరిపూర్ణ తత్వస్వరూపమును దర్శించి ఆనందమయుడవై, చిత్తవిశ్రాంతిని పొందు"మని పలికి, "బ్రహ్మానందము అనుభవింతువు గాక" అని ఆశీర్వదించెను. విసోబా పరమానంద భరితుడై జ్ఞానదేవునకు నమస్కరించి, అచటినుండి వెడలిపోయి, జ్ఞానదేవుడు ఉపదేశించినట్లు

జీవించుచుండెను. జ్ఞానదేవాదులు తమను ఆశ్రయించినవారికి తత్త్వోపదేశములు చేయుచు, అత్యద్భుత లీలలు చూపిస్తూ సదానందముతో జీవించుచుండిరి.

శ్రీజ్ఞానేశ్వర్ మహారాజ్

8. శ్రీ జ్ఞానేశ్వర్ మహారాజ్ - రచనలు

శ్రీజ్ఞానేశ్వర్ మహారాజ్ బ్రాహ్మణుల గర్వమణచడమే కాకుండా అజ్ఞాని దున్నపోతుచే వేదం పలకరించిన తీరు వర్ణించడం కష్టం. నామ సంకీర్తనంతో, నామస్మరణతో, నామశ్రవణంతో జనులందరిని పవిత్రులని చేసినారు. అమృతం లేకుండానే లోకులకు అమరత్వాన్ని ప్రసాదించారు. యోగం లేకుండానే కళ్ళకు కైవల్యాన్ని కనిపింపచేశారు. వీరి దృష్టిలో రాజు, ముష్టివాడు, చిన్న, పెద్ద, ధనిక, పేద భావాలు లేవు. అందరినీ సమభావంతో జగత్తంతటికీ ఆనందాల హరివిల్లుల విందునందజేశారు.

భక్తిమార్గాన్ని ఆధ్యాత్మిక ధోరణిలో ప్రచారం చేస్తూ 1212వ సం॥ (అంటే శ్రీ జ్ఞానేశ్వర్ మహారాజ్ అప్పటికి కేవలం 15 సం॥లు మాత్రమే) ప్రవరానదీ తీరంలోవున్న నేవాసేక్షేత్రంలో పవిత్ర పూజనీయమైన భగవద్గీతకు వాక్యం రచించినారు. ప్రజల కళ్ళు తెరిపించారు. వేదోపనిషత్తులో ఉన్న మోక్షరూపాన్ని సాధ్యం చేసేవి లేక వైరాగ్యాది సాధనలను వివరణపూర్వకంగా "ధర్మ సంకీర్తనం" చేశారు. ఈ గ్రంధాన్ని వ్రాసే పనిని శ్రీ సచ్చిదానంద బాబా ఆదర్శపూర్వకంగా చేశారు. శ్రీ నివృత్తిదేవ మహారాజ్ ఆజ్ఞతో, ప్రయణ, ప్రమేయ, భావరంగిత, నిత్యమూర్తి స్థితి అనే ధర్మాన్ని వివేచించే సిద్ధానువాదరూపమే రచనలో అమృతానుభవ గ్రంధంగా రచించారు. అంతేకాక నామసంకీర్తనాత్మక "హరిసార్" అనే గ్రంథాన్ని కూడా రచించారు. "అభంగనాథ"లో భక్తి, జ్ఞాన, వైరాగ్యాది సాధనల గూర్చి రసభరితమైన పద్ధతిలో రచనలు రాసి ప్రజల గుండెల్లో స్థిరస్థాయిగా నిలిచినారు.

శ్రీజ్ఞానేశ్వర్ మహారాజ్ 'జ్ఞానేశ్వరి' రచించుట

జ్ఞానదేవుని కరస్పర్శచే సర్పవేది సోకగనే బంగారమగు ఇనుము వలె దున్నపోతు సంచిత కర్మముల నుండి విముక్తిపొంది బ్రహ్మానందము అనుభవించుచు వేద వేదాంతముల సారాంశము అధ్యయనము చేయుచుండెను. ఒకనాడు జ్ఞానదేవుడు నివృత్తి దేవుని చూచి, "అన్నా! బ్రహ్మజ్ఞానము ఉదయించుటచే నీ దున్నపోతు రహస్యమగు శ్రుత్యర్థము

శ్రీ జ్ఞానదేవుడు ప్రజలకు 'జ్ఞానేశ్వరి' భోదించుట

నెల్ల వెల్లడించుచున్నది. శ్రుత్యర్థము వెల్లడైనచో కర్మ మార్గము పూర్తిగా నశించును. కర్మాసక్తి లేనిచో లోకమున యజ్ఞ యాగాది కర్మలు నిలిచిపోవును. అందువల్ల అనర్థములు కలుగును. కాబట్టి ఈ మహిషము ఇచ్చుట విడిచిపెట్టి పోవుటకు వీలులేదు. మన వెంట తీసికొని పోవుట మంచిది"అని పలికి, అతనిని సమ్మతింపచేసి, ఆ దున్నపోతును తీసికొని, అక్కడివారికి వీడ్కోలు చెప్పి అలకావతికి సకుటుంబముగా బయలుదేరెను.

వారు మహాసల క్షేత్రమునకు పోయి ప్రవర తీర్థమున స్నానము చేసి మోహనరాయస్వామి దర్శించి, పాషండ మతమును జయింపనెంచి అక్కడ కొన్ని దినములు నిలిచిరి.

ఒకనాడు జ్ఞానదేవుడు వేదాంత విషయము ఉపన్యసించు చుండెను. మహా జనులెల్లరు అతనికి నమస్కరించి, భగవద్గీతార్థమును విపులీకరించుము అని ప్రార్థించిరి. అందరికి తెలియునట్లు "జ్ఞానేశ్వరీయ"మను ప్రాకృత వ్యాఖ్యానమును చేసి, మోహనరాయస్వామి ఆలయములో సభ చేసి దానిని వినిపించెను. ఆకాశము నుండి మేఘ గంభీర స్వరమున "ఆహా ! నీ దయా గుణమును ఏమని కొనియాడ వలెను ? పూర్వము అర్జునునకు కృష్ణరూపమున బోధించిన విధమున ఇప్పు డీరూపమున భగవద్గీతకు ప్రాకృత వ్యాఖ్యానము చేసి రహస్యములు వెల్లడించి లోకమును ఉద్ధరించితివి. ఈ గ్రంథమును చదివినవారెల్ల నిస్సందేహముగా సదానంద సామ్రాజ్యము అనుభవింపగల"రను వాక్యములు వినబడెను. జనులా మాటలు విని, ఆశ్చర్యపడి, శ్రీకృష్ణపరమాత్మయే మరల ఈ లోకమున ధర్మమును ఉద్ధరింప అవతరించెనని అనుకొని, జ్ఞానదేవునకు సాష్టాంగ నమస్కారముచేసి, సంతోషాతిశయమును నృత్యము చేసిరి. కంకణముచేత రత్నమును, రత్నముచేత కంకణమును ప్రకాశించునట్లు జ్ఞానేశ్వరీయమును వ్యాఖ్య భగవద్గీతయు, భగవద్గీతచేత జ్ఞానేశ్వరీయమును పరస్పరశోభగాంచెను.

ఒకనాడు నివృత్తిదేవుడు జ్ఞానదేవుని చూచి "తమ్ముడా ! భగవద్గీతను ప్రాకృత వ్యాఖ్యానము ఒనర్చి మహోపకారము చేసితివి.

దానికి అనుకూలముగా అనుభవవిషయములు తెలుపుతూ మరి ఒక గ్రంథమును రచించిన మరింత ఉపకారముగా ఉండు" అనెను. జ్ఞానదేవుడు అందుకు సమ్మతించి, శ్రీకృష్ణావతారమున బ్రహ్మ యొక్క గర్వము అణచుటకు గోపసంఘమును నిర్మించినట్లు పాషండుల యొక్క గర్వము అణచి వేయుటకై అమోఘ విషయములను చేర్చి పద్యరూపమున 'అనుభవామృతము' అను మహాగ్రంథము ఒకదానిని మృదుమధురముగా రచించెను. ఆ గ్రంథము వలన సూర్యోదయ మగుటతో పటాపంచలగు మంచువలె పాషండ మతము పటాపంచలయ్యెను. అక్కడి నుండి వారు బయలుదేరి అలకావతికి సమీపమున ఉన్న అడవికి వచ్చి భగవద్ధ్యానము చేయుచుండిరి. దున్నపోతు వేదమును చదువుచు ఆయువు తీరిపోవుటచే వారికి అందరికి ముట్టి కాళ్ళతో వందనములు చేసి పురుష సూక్తమును చదివి అవలీలగా ప్రాణములను వదలెను. దాని దేహము నుండి యొక దివ్యజ్యోతి బయలుదేఱి జ్ఞానదేవుని యందు చేరి నిత్యానందకరమగు మోక్ష సామ్రాజ్యము పొందెను. వారు అత్యంత ప్రీతితో ఆ మహిషము యొక్క దేహమును విధ్యుక్తముగా సమాధి చేసి దానికి 'శోభ' యని పేరు పెట్టి అక్కడి నుండి బయలుదేరి అలకావతి చేరిరి.

అలకావతి రాజు వారి రాక విని పరమానందమున నా పట్టణము అంతయు అలంకరింప ఆజ్ఞాపించి, మంగళ వాద్యములతో వారిని పల్లకీల మీద తీసికొనివచ్చి గొప్ప ఉత్సవము చేసి ఇల్లు చేర్చెను. అక్కడి బ్రాహ్మణులు ప్రతిష్ఠాన పురమున జరిగిన విషయములు ఎప్పటికప్పుడు

తెలిసికొని ఉండుట వలన సోపానదేవుడిచ్చిన శుద్ధపత్రికను తీసికొని, వారిని జగద్గురువులుగా భావించి పరమానందముతో నృత్యము చేసిరి. రాజునకు కలిగిన ఆనందమునకు అంతము లేదు. అతడు బ్రాహ్మణులకు సంతర్పణము చేయించి విఠోబా కుటుంబమున వారినందరిని సత్కరించి వారి ఆజ్ఞానుసారము నడుచుకొనెను. బ్రాహ్మణులే కాక సమస్త వర్ణముల వారును వారి ధర్మోపన్యాసముల అత్యంత శ్రద్ధతో వినుచు వారిని నిరంతరము సేవించుచు పరమానందము అనుభవించుచుండిరి.

శ్రీ జ్ఞానేశ్వర్ మహారాజ్

9. శ్రీ జ్ఞానేశ్వర మహారాజ్ మహాసమాధి

తత్వజ్ఞాన బోధలను, ఆధ్యాత్మిక రసాభాండాగారాన్ని ప్రజల్లోకి తీసుకెళ్ళాలన్న సంకల్పంతో శ్రీజ్ఞానేశ్వర మహారాజ్ తీర్థయాత్ర ద్వారా తన లక్ష్యం నిర్ణయించుకొని, అందుకు తగిన ఏర్పాటు చేసుకున్నారు. అందుకు తనతో పాటుగా శ్రీ నామదేవ్ మహారాజ్‌ను కూడా ఉంటే తన కార్యం నిర్వహించడంలో కాని, ప్రజల్లోకి వెళ్ళి, తన మనోభావాలను పంచడంలో కాని ఎంతో సహాయంగా ఉంటుందని భావించి, పండరీపురంలో నివసిస్తున్న శ్రీ నామదేవ్ మహారాజ్ వద్దకు వెళ్ళి, తన మనసులో ఉన్న ఆకాంక్షను తెలియపరిచాడు.

అందుకు సమాధానంగా శ్రీ నామదేవు మహారాజ్ తాను పూర్తిగా శ్రీ విఠలుని అధీనంలో ఉన్నానని, విఠలుని ఆజ్ఞలేనిదే ఎక్కడకి కదలనని తన అభిప్రాయం చెప్పాడు. వెంటనే శ్రీ జ్ఞానేశ్వర్ మహారాజ్ శ్రీపాండురంగని శరణువేడుకొనెను. అంతటా శ్రీ జ్ఞానేశ్వర్ మహారాజ్ కోరిక నెరవేరునట్లు విఠలుడు ఆశీర్వదించారు.

శ్రీ విఠలుని ఆశీర్వాదాన్ని అందుకున్న శ్రీ జ్ఞానేశ్వర్ మహారాజ్, శ్రీ నామదేవు మహారాజ్‌తో కలిసి తీర్థయాత్ర మొదలుపెట్టెను. తన యాత్రలో భాగంగా పుణ్యక్షేత్రాలను దర్శిస్తూ, అక్కడి ప్రజలకు తమ జ్ఞానాన్ని పంచుతూ, వారిలో ఆధ్యాత్మికభావాన్ని నెలకొల్పినారు. అలా తిరిగి, తిరిగి చివరకి మళ్ళీ పుణ్యక్షేత్రమైన పండరీపురంకు వచ్చినారు. అటుపై తాను అవతరించిన రూపానికి స్వస్తి చెప్పాలని, సమయం

శ్రీజ్ఞానేశ్వర్ మహారాజ్ సమాధి చెందుట

ఆసన్నమైనదని శ్రీ జ్ఞానేశ్వర్ మహారాజ్ గుర్తించారు. తన భావాన్ని సోదరసోదరిలకు చెప్పి అందుకు తగిన సమయం ఏర్పాటు చేయమన్నారు. తీర్థయాత్రలో భాగంగా శ్రీ జ్ఞానేశ్వర్ మహారాజ్, శ్రీ నామదేవు మహారాజ్‌లు కలిసినా, వారి మధ్య ఎనలేని ప్రేమ ఏర్పడింది. శ్రీ జ్ఞానేశ్వర్ మహారాజ్ సజీవసమాధి చెందుతున్నారని వార్త శ్రీ నామదేవు మహారాజ్‌కు ఎంతో కలవరపరచింది.

శ్రీ నామదేవు మహారాజ్

చివరగా శ్రీపాండురంగనికి తన తనువు చాలింపు గూర్చి చెప్పగా, శ్రీ పాండురంగమూర్తి ఇలా సమాధానం ఇచ్చాడు. “కృష్ణపక్షంలో నిన్ను తప్పక కలుస్తాను. కార్తీక శుద్ధ ఏకాదశినాడు పండరీయాత్ర జరుగుతుంది.

దాని తర్వాత కృష్ణపక్షంలో వచ్చే ఏకాదశి నీకు చెందుతుంది. ప్రజలు ఆ రోజు నిన్ను శ్రద్ధాభక్తులతో కొలుస్తారు. ఆ రోజు నీ సన్నిధికి ఎవరు వస్తారో, ఆ రోజు నిన్ను ఎవరు శరణువేడుతారో, ఆ రోజు నిన్ను సదా స్మరిస్తారో వారందరికి మోక్షప్రాప్తి కలుగుతుందని చెప్పి అదృశ్యమయ్యెను. శ్రీ విఠలుని పలుకులతో తనలో ఎనలేని ధైర్యం వచ్చి చివరి సారిగా తన సోదరిసోదరిలతో హాయిగా కాలం గడిపెను. త్రిమూర్తి అవతరాంగా, మహాశక్తి అవతారంగా ఉన్న నలుగురు సోదరసోదరిలలో సజీవసమాధి చెంది కైలాసానికి వెళ్ళిన మొదటివారు శ్రీ జ్ఞానేశ్వర్ మహారాజ్.

ఇంద్రాయణీనదీ తీరంలో శ్రీ సిద్ధేశ్వరుని ఎదుట నందిని ప్రక్కకు పెట్టి, అక్కడి నుండి ఆ బిలంలోకి ప్రవేశించి ఆ ప్రదేశాన్ని శుభ్రం చేసెను శ్రీనామదేవుని కుమారుడు. అటుపై అందులోకి ప్రవేశించి సజీవ సమాధి నిష్ఠలోకి వెళ్ళిపోయెను శ్రీ జ్ఞానేశ్వర్ మహారాజ్. ఒక రాతిపలుకతో బిలాన్ని శ్రీ నివృత్తిదేవుడు మూసివేసెను.

1218వ సం॥లో కార్తీకమాసంలో కృష్ణపక్షత్రయోదశినాడు శ్రీజ్ఞానేశ్వర్ మహారాజ్ సజీవసమాధిలోకి వెళ్ళిపోయారు. వయస్సు ప్రకారం కేవలం 21 సం॥లు అయినా, తాను భూమండలంపైకి వచ్చిన కార్యాన్ని పూర్తిచేసి తన అవతారాన్ని చాలించిన భగవంతుడు శ్రీ జ్ఞానేశ్వర్ మహారాజ్.



ఆళిందిలోని శ్రీజ్ఞానేశ్వర్ మహారాజ్ సమాధి

10. శ్రీ జ్ఞానేశ్వర్ మహారాజ్ సమాధి అనంతరం

శ్రీజ్ఞానేశ్వర్ మహారాజ్ తన చేతలతోటి, మాటలతోటి, లీలలద్వారా, రచనల ద్వారా ఎందరికో జ్ఞానోదయం కల్గించారు. చిన్న వయస్సులోనే భౌతికంగా సమాధి చెందిన, నిజంగా వారి యొక్క శక్తి, మహిమలు ఇంకా ఈ భారతదేశం నలుమూలలా ఎందరికో నిదర్శనంగా నిలుస్తున్నాయి. ఎందరో భక్తులు, ప్రజలు, అనుచరులు ఆళిందిలో శ్రీ జ్ఞానేశ్వర్ మహారాజ్ మహా సమాధిని దర్శించి తమ జన్మ సార్ధకం చేసుకుంటున్నారు.

ఎందరో ఇళ్ళలో శ్రీ జ్ఞానేశ్వరి నిత్యపారాయణగ్రంథంగా పఠింపబడుతున్నది.

శ్రీసాయిబాబా తరుచుగా తమ భక్తులకు శ్రీజ్ఞానేశ్వరి చదవమని, అందులో దాగియున్న అర్ధాన్ని గ్రహించమని చెప్పినారు. అంటే జ్ఞానేశ్వరి గొప్పతనం మనం తప్పక గుర్తించి దాని చదవాలి.

ప్రజలలో ఉన్న అజ్ఞానాన్నే కాకుండా, వారికి ఉన్న గర్వాన్ని అణచి, వారిని ఆధ్యాత్మిక మార్గంలో నడిపిన విష్ణుమూర్తి అవతారమే శ్రీ జ్ఞానేశ్వర్ మహారాజ్.

తన భక్తుని కోరిక తీర్చడం కోసం భూమి మీద అవతరించి, ప్రజలను ఉద్ధరించిన మహనీయుడు శ్రీజ్ఞానేశ్వర్ మహారాజ్.

మానవరూపంలో ఉన్న అవతారమూర్తి, మానవుని లాగే ఎన్నో కష్టాలు అనుభవించారు. నిజానికి వారికి కష్టపడ అవసరం లేదు. అయినా

ఆళిందిలోని శ్రీ జ్ఞానేశ్వర్ మహారాజ్ మందిరం

మానవరూపంలో ఉన్నప్పుడు మానవునిలాగే ప్రవర్తించాలని వారు అతి సాధారణ జీవనం గడిపినారు.

ప్రజలకు తాము ఏనాడు అవతారపురుషులమని చెప్పలేదు. వారిలో చైతన్యం కలిగించి, గర్వం నశింపచేశారు అంతే. శ్రీజ్ఞానేశ్వర్ మహారాజ్ గూర్చి తెలుసుకుంటే చాలు జన్మజన్మలు పావనం అవుతాయి. చాంగ్‌దేవునికి చెప్పిన మాటలు, విఠోబాతో చేసిన వాదనలు, బ్రాహ్మణుల గర్వభంగం ఇలా ఎన్నో చేసి ప్రజల గుండెల్లో, శాశ్వతంగా నిలిచిపోయిన మంగళకారుడు శ్రీజ్ఞానేశ్వర్ మహారాజ్.

ఆళిందిలోని శ్రీ జ్ఞానేశ్వర్ మహారాజ్ మందిరం

ఈ రోజుకు వేల సంఖ్యలో ఆళందికి వస్తున్న భక్తులే ఇందుకు నిదర్శనం. తనను నమ్ముకున్న వారికి ఎదో ఒక రూపంలో దర్శనం ఇస్తూ వారి కష్టాలను తీర్చుచున్న మహనీయుడు శ్రీ జ్ఞానేశ్వర్ మహారాజ్.

అలాంటి ఆ భగవంతున్ని సదా స్మరిద్దాం, జన్మ పావనం చేసుకుందాం.

జై పాండురంగా! జై జై పాండురంగా !

ఆళిందికి చేరుమార్గం



ఉపకరించిన గ్రంథాలు

1. శ్రీ జ్ఞానేశ్వరి భగవద్గీత

– అనువాదం (తెలుగులో) విమలాశర్మ

2. శ్రీ జ్ఞానేశ్వరి జీవిత చరిత్ర

– సాయి మాస్టారు సేవాశ్రమం ట్రస్టు, గొలగమూడి



ఉన్న స్థితి నుండి ఉన్నత స్థాయికి వెళ్ళటమే

ఆధ్యాత్మికతలో లక్ష్యం

భగవంతుడిచ్చిన ఈ జీవితంలో, ఆ భగవంతుని మనలో వెదకటమే

ఆధ్యాత్మిక మార్గం

నీ ఆలోచనలను అదుపులో పెట్టి, మనసును భగవంతుని మీద నిలపటమే

ఆధ్యాత్మికతలో ప్రధానం

ఆధ్యాత్మికత వల్లనే కలుగును మోక్షం

చరణ్ జనమంచి